అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ


శుక్రవారం 21-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 122 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

నీట్ రద్దుపై తేల్చండి

- కేంద్రం, ఎన్టీఏకు సుప్రీం నోటీసులు
- జులై 8న మళ్లీ విచారణ



న్యూఢిల్లీ: నీట్- యూజీ 2024 పరీక్షల రద్దుపై కేంద్రం, ఎన్టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నీట్ రద్దు చేయాలా అనే అంశంపై వివరణ ఇవ్వాలని వారిని కోరింది. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కోర్టు ఆధ్వర్యంలో విచారణ జరగాలని సుప్రీం తెలిపింది. జస్టిస్ విక్రమ్ నాథ్, ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. అయితే నీట్ రద్దుపై వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సుప్రీంకు మార్చాలని ఎన్టీఏ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై వివిధ పార్టీల నుంచి ధర్మాసనం వివరణ కోరింది. జులై 8న మళ్లీ ఈ కేసులో విచారణ చేపట్టనున్నట్టు కోర్టు తెలిపింది. అయితే నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కొందరు విద్యార్థులు పెట్టుకున్న పిటిషన్‌పై కూడా కోర్టు విచారణ చేపట్టనున్నది.

నీట్ లీక్ నిజమే.. బీహార్ పోలీసులకు విద్యార్థి వాంగ్మూలం..

నీట్ పరీక్షలో అక్రమాలపై విద్యార్థులు, విపక్షాలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. తొలుత బీహార్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీకైనట్టు వార్తలు రాగా కేంద్రం, ఎన్టీఏ తోసిపుచ్చాయి. కానీ పరీక్ష తేదీకి ముందు రోజే నీట్ పరీక్షా పత్రం తమ చేతికి వచ్చిందని ఇదే కేసులో బీహార్‌లో అరెస్టైన విద్యార్థులు పోలీసుల విచారణలో ...3లో



విద్యావ్యవస్థ భ్రష్టు పట్టింది

విద్యాసంస్థలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ హైజాక్ చేశాయి

- నీట్‌పై పార్లమెంట్‌లో లేవనెత్తుతాం : రాహుల్ గాంధీ

వివరాలు 11లో



విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం

'నీట్' అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- ప్రధాని మోడీ మౌనం వీడాలి

రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) శ్రేణుల ధర్నాలు

నవతెలంగాణ- విలేకరులు

ఎన్టీఏ నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో అవినీతి, అక్రమాలు జరిగినందున వెంటనే పరీక్షను రద్దు చేయాలి.. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడిన నిందితులను కఠినంగా శిక్షించాలి.. అని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) శ్రేణులు ధర్నాలు చేశారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు.



నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోడీ మౌనం వీడి తక్షణమే న్యాయ విచారణ జరపాలని, జాతీయస్థాయి పరీక్షలు నిర్వహించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు అన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సీపీఐ (ఎం) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులు.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. మోడీ మూడోసారి ప్రధాని అయ్యాక నీట్ పరీక్షలో తీవ్రమైన అవకతవకలు జరిగాయన్నారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న బీహార్, మధ్యప్రదేశ్, హర్యానా, గుజరాత్, రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీ జరిగిందన్నారు. నీట్ పేపర్లను రూ.50 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. విద్యార్థుల కోరిక మేరకు నీట్ పరీక్షలు రద్దుచేసి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ ...2లో

ఎన్టీఏను రద్దు చేయాలి

కేంద్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలి

- విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలి
- నీట్ అక్రమాలపై విద్యార్థి సంఘాల దేశవ్యాప్త ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నీట్-యూజీ, యూజీసీ నెట్ పరీక్షల్లో అక్రమాలు జరిగిన నేపథ్యంలో బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. అవకతవకలపై దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు రోడ్డెక్కాయి. ఢిల్లీ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం ప్రదర్శించారు. గురువారం నాడిక్కడ జేఎన్‌యూఎస్ యూతో పాటు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీఎస్ఎఫ్, కైవైఎస్, ఎన్ఎస్ యూఐ విద్యార్థి సంఘాలు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ (శాస్త్రి భవన్) కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాయి. ఢిల్లీ పోలీసులు విద్యార్థులపై దాడికి దిగారు. విద్యార్థినులనూ మగ పోలీసులు కొట్టారు. అనంతరం విద్యార్థులను అరెస్టు చేసి ఢిల్లీలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల దౌర్జన్యాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. యూజీసీ నెట్, నీట్, సెంట్రల్ యూనివర్సిటీస్ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) నిర్వహణలో పేపర్ లీక్‌లు,



ఢిల్లీలోని కేంద్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నిరసన జ్వాల

స్కామ్‌లతో సహా ఎన్టీఏ చుట్టూ ఉన్న వివాదాల నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అర్హత లేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ డిమాండ్ చేశారు. పరీక్షల మాల్ ప్రాక్టీస్‌కు కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ...11లో



మాట్లాడుతున్న ఏచూరి, సలీం

విద్యా ప్రమాణాలను కాపాడుకోవాలి

సీతారాం ఏచూరి

మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దేశ భవిష్యత్తును నాశనం చేయ కుండా, విద్యా ప్రమాణాలను కాపాడుకోవడానికి విద్యార్థులు చేసే పోరాటాలకు సంఘీభావం తెలుపుతున్నట్లు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రకటించారు. ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవలి నీట్, నెట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు కేంద్రం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల అనుసరించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ఉన్న అడ్మిషన్ విధానాలను కేంద్రీకృత ప్రవేశ పరీక్షలతో భర్తీ చేసే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని అన్నారు. తద్వారా దేశంలో ప్రవేశ పరీక్షల మాఫియాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

అలా కుదరదు



- 65శాతం రిజర్వేషన్ల పెంపు నిర్ణయాన్ని తిరస్కరించిన పాట్నా హైకోర్టు
- 50 నుంచి 65 శాతానికి పెంచిన నితీశ్ సర్కార్

వివరాలు 11లో

అమరావతి, పోలవరం సంపద సృష్టి కేంద్రాలు

- ప్రజా రాజధానిని విధ్వంసం చేశారు
- ఒక మూర్ఖుడితో రాష్ట్రానికి తీరని నష్టం
- రాజధాని పనులపై వైట్‌పేపర్ : ఏపీ సీఎం చంద్రబాబు

వివరాలు 10లో

24 గంటల్లో 17 మంది మృతి



- ఢిల్లీలో వడగాల్పులకు పిట్టల్లా రాలుతున్న జనం

వివరాలు 11లో

సింగరేణి మెడపై కేంద్రం కత్తి

వందేండ్ల సంస్థను బీజేపీ, కాంగ్రెస్ బొందపెడుతున్నాయి



విలేకరులతో మాట్లాడుతున్న కేటీఆర్

- ఎన్డీయే చర్యలకు రేవంత్ ప్రభుత్వం మద్దతు
- ఈ విషయంపై సీఎం ఎందుకు స్పందించటం లేదు
- కేసుల భయమా..? మరేదైనా కారణమా..? : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటి ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎనిమిది ఎంపీ సీట్లను బీజేపీ, మరో ఎనిమిది స్థానాలకు కాంగ్రెస్‌కు అప్పజెపితే... ఆ రెండు పార్టీలూ కలిసి తెలంగాణకే తలమానికమైన సింగరేణిని ఖతం పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బొగ్గు గనుల వేలం పేరిట ఆ సంస్థ మెడపై కేంద్రం కత్తిని వేలాడదీసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. వందేళ్ల చరిత్ర ఉన్న సింగరేణిని బొందపెట్టేందుకు మోడీ సర్కారు ప్రయత్నించటం దారుణమన్నారు. కేంద్రానికి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో మోడీ సర్కారుకు మద్దతు పలుకుతోందని దుయ్యబట్టారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రధానికి లేఖ రాసిన రేవంత్... ఇప్పుడు సీఎం హోదాలో ఎందుకు వ్యతిరేకించటం లేదని ప్రశ్నించారు. ఆయన ఎందుకు మౌనం దాల్చుతున్నారని నిలదీశారు. కేసుల భయమా..? లేక మరేదైనా కారణమా..? అని ఎద్దేవా చేశారు.

పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో ...2లో

నేడే బొగ్గుగనుల వేలం

- దేశవ్యాప్తంగా 60 గనుల గుర్తింపు
- వేలంలో పాల్గొననున్న సింగరేణి
- శ్రావణపల్లి బ్లాక్‌ను దక్కించుకునేందుకు యత్నాలు

వివరాలు 2లో

సింగరేణి విచ్ఛిన్నానికి కుట్ర

బొగ్గు గనులపై బీజేపీ-బీఆర్ఎస్ తీరు అభివృద్ధికి ఆటంకం

- నాడు సింగరేణి ప్రయివేటీకరణ బిల్లుపై బీఆర్ఎస్ సంతకం
- నేడు దొంగే దొంగ దొంగ అని అరిచిన చందంగా విమర్శలు
- వేలం లేకుండా గనులను నేరుగా సింగరేణికి అప్పగించాలి
- పరిరక్షణకు అఖిలపక్ష నేతలతో కలిసి ముందుకు: ఉపముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



బీఆర్ఎస్ చేసిన సంతకాలు చూపుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కూనం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బొగ్గు గనులను ప్రయివేటీకరించి రాష్ట్రాభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ విఘాతం కలిగిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తే వేలం లేకుండా గనులను సింగరేణికి అప్పగించాలని కోరారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన సన్నిహితుల కోసం.. 2021 కోల్‌బ్లాక్‌ల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనకుండా చేశారని విమర్శించారు. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని బొగ్గు బ్లాక్‌లనూ ఆ సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో గురువారం విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు.

సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాక్‌లను ఆ సంస్థకే కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని శుక్రవారం కలిసి విన్నవిస్తామన్నారు. తెలంగాణలో అతిముఖ్యమైన ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణి భవిష్యత్‌లోనూ కొనసాగాలంటే కొత్త గనుల ఏర్పాటు తప్పనిసరి అన్నారు. ఈ గనులను వేలంపాట ద్వారా కాకుండా నేరుగా సంస్థకు కేటాయించాలని కోరారు. ఈ విషయంలో అఖిలపక్ష నేతలు ప్రధానమంత్రిని కలిసేందుకు కిషన్‌రెడ్డి ఏర్పాటు చేయాలన్నారు. తమ ప్రాంత గనులను తమకు ఇవ్వాలని ...11లో

నేడు మంత్రివర్గం భేటీ

రైతు రుణమాఫీ, రైతు భరోసాపైనే ప్రధాన చర్చ



- సంక్షేమ, అభివృద్ధి పథకాల నిధుల సమీకరణపై కసరత్తు
- కాళేశ్వరం అవినీతి, ఛత్తీస్‌గడ్ విద్యుత్ కొనుగోళ్లపైనా సమాలోచనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. నేడు మధ్యాహ్నం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ భేటీలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, రుణమాఫీ, రైతుభరోసా విధి విధానాలతో పాటు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు, అవినీతి ఆరోపణలపై కొనసాగుతోన్న విచారణలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వీటితో పాటు అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ రూపకల్పన, పంటల బీమాపైనా మంత్రుల బృందం చర్చించనుంది. ఆగస్టు 15లోగా పంట రుణాల మాఫీ చేస్తామంటూ సీఎం ప్రకటించిన నేపథ్యంలో,ప్రధానంగా ఇదే అంశంపై క్యాబినెట్‌లో చర్చించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. రుణమాఫీకి సుమారు రూ.30వేల కోట్లు, రైతుభరోసాకు మరో రూ.7వేల కోట్లు అవసరమవడంతో, నిధుల సేకరణ ఎలా అనే అంశంపై క్యాబినెట్‌లో చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. రైతులతో ముడిపడి ఉన్న ఈ రెండు ...2లో



కేజ్రీవాల్‌కు బెయిల్

నేడు విడుదల

- రూ. లక్ష పూచీకత్తులో మంజూరు
- ఆమ్‌ఆద్మీ పార్టీ క్యాంప్‌లో సంబురాలు

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు ఢిల్లీ కోర్టు రూ. లక్ష పూచీకత్తులో బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన నేడు విడుదల కానున్నారు. మరోపక్క 48 గంటల పాటు బెయిల్ ఆర్డరును ...11లో

చెంచు మహిళపై పాశవిక దాడి

అర్ధరాత్రి కాళ్లు, చేతులు కట్టేసి..కండ్లలో కారం చల్లి..

ప్రయివేటు భాగాలపై డీజిల్ పోసి కాల్చిన వైనం



- పది రోజుల పాటు ఇంట్లోనే నిర్బంధం
- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అమానుష ఘటన
- దోషులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ(ఎం) నేతలు
- విచారణ చేస్తున్నాం.. నిందితులను శిక్షిస్తాం : డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

బయటి ప్రపంచం తెలియని చెంచు మహిళ. భర్తతో గొడవ పడి పుట్టింటికెళ్లింది. దుర్మార్గులు అక్కడి నుంచి ఆమెను తీసుకొచ్చి దారుణంగా హింసించారు. ఇంట్లో బంధించి వివస్త్రను చేసి ప్రయివేటు భాగాలపై డీజిల్ పోసి కాల్చారు. కండ్లల్లో కారం చల్లారు. కాళ్ల మొక్కుతా.. నన్ను వదలండి అంటూ ఏడ్చినా వదల్లేదు. ప్రయివేటు భాగాలపై ఇష్టానుసారంగా కొట్టారు. స్పృహ తప్పి పడిపోయినా కనికరం లేని నీచులు తమ ఇంట్లోనే ఎలాంటి వైద్యం లేకుండా పది రోజులు బంధించారు. బయటికి ...11లో

దోషులను కఠినంగా శిక్షించాలి

- తెలంగాణ గిరిజన సంఘం

వివరాలు 11లో

మొక్కుబడి బాట



కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి హోదాలో పాల్గొనని వైనం

ఒకటో తరగతిలో 60,673 మంది మాత్రమే చేరిక

గతేడాది జూన్ 12 నాటికి 1.46 లక్షల మందికి ప్రవేశం

బదిలీలు, పదోన్నతుల్లో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు

సర్కారు స్కూళ్లలో 18.50 లక్షల మంది విద్యార్థులకు యూనిఫారాలు

20.98 లక్షల మందికి పాఠ్యపుస్తకాలు, 11.65 లక్షల మందికి నోట్ పుస్తకాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభమైన జయశంకర్ బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఇందులో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు బిజీబిజీగా ఉన్నారు. దీంతో బడిబాట కార్యక్రమాన్ని పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలపై ప్రభావం పడడమే అందుకు నిదర్శనం. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు ఒకటో తరగతిలో ఇప్పటి వరకు 60,673 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. గత విద్యాసంవత్సరంలో జూన్ 12 నాటికి ఒకటో తరగతిలో 1,46,824 మంది చేరడం గమనార్హం. గతేడాది కంటే ఈ ఏడాది 86,151 మంది విద్యార్థులు తక్కువ చేరారు. అంటే ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పాల్గొనలేదని అర్థమవుతున్నది. ఇంకోవైపు విద్యాశాఖ అధికారులు ఎక్కువ సమయాన్ని ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల కోసమే కేటాయించినట్టు తెలుస్తున్నది. అందుకే ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షించలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తుందని అందరూ ఆశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని విద్యాశాఖ అధికారులు ముందుగా ప్రకటించారు. కానీ మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి నడిచారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ముఖ్యమంత్రి హోదాలో పాల్గొనకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అయినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు.

విద్యార్థులను ఆకట్టుకోని వినూత్న ప్రచారం

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావడం... విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది ప్రభుత్వం వినూత్నంగా ఈ ప్రచారాన్ని నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు వీలుగా తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేలా వారిని చైతన్యవంతులను చేయాలని నిర్ణయించింది. ప్రయివేటు పాఠశాలల్లో చేరితే ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పిస్తే ఆ డబ్బు ఆదా చేసే అవకాశముంటుందనీ, పిల్లల ఉన్నత చదువులకు పొదుపు చేయొచ్చని సరికొత్త ప్రచారానికి సర్కారు శ్రీకారం చుట్టింది. ప్రయివేటు విద్యారంగంపై మోజు తగ్గించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నాలు చేసినా విస్తృతంగా ప్రచారం నిర్వహించినా ఆశించిన స్థాయిలో విద్యార్థులను ఆకట్టుకోలేదు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరలేదు.

వందశాతం ఒక జత యూనిఫారం పంపిణీ

రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో స్వయం సహాయక బృందాల సహకారంతో వంద శాతం ఒక జత యూనిఫారాలను విద్యార్థులకు ప్రభుత్వం అందించింది. బడులు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు పంపిణీ చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 18,50,400 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫారాలను అందించింది. 20,98,099 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసింది. 11,65,748 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలను ఇచ్చింది. ఇప్పటి వరకు 4,31,780 మంది విద్యార్థులకు వర్క్ బుక్స్ పంపిణీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఏ విద్యార్థికీ ఏ కారణంతో ప్రవేశాన్ని నిరాకరించబోమని విద్యాశాఖ ప్రకటించింది. ఉదయం రాగిజావ, మధ్యాహ్నం పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపింది. ఒత్తిడి లేని విద్యతోపాటు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి చక్కని అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. సర్కారు బడుల్లో పిల్లలను చదివిస్తే ఆదా అయ్యే డబ్బు వారి ఉన్నత విద్యకు వాడుకునే అవకాశముందని తల్లిదండ్రులకు వివరించింది.

ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమా పాది

ప్రతిపక్ష నేతగా నేనే : నవీన్ పట్నాయక్



ఒడిశా: భువనేశ్వర్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమా పాధి బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీలో ఆమె బాధ్యతలు స్వీకరించేటపుడు ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ, ప్రతిపక్ష నేత, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ అభినందనలు తెలిపారు. ఒడిశా అసెంబ్లీలో తానే ప్రతిపక్ష నేతగా ఉంటానని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ చెప్పారు. పార్టీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మీడియాకు తెలిపారు. బీజేడీ ఎమ్మెల్యేలంతా తనను బీజేడీ సభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. 24 ఏండ్ల పాటు ఒడిశాలో అధికారంలో ఉన్న బీజేడీ ఇటీవల అసెంబ్లీలో ఎన్నికల్లో ఓటమి చవిచూసింది. 78 సీట్లు గెలుచుకున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

నేడే బొగ్గుగనుల వేలం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం హైదరాబాద్‌లో బొగ్గు గనుల వేలం నిర్వహించనున్నారు. ప్రతి ఏటా ఏదో ఒక నగరంలో బొగ్గు బ్లాకుల వేలాన్ని నిర్వహిస్తారు. మన రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఉండటంతో 10వ రౌండ్ కమర్షియల్ మైనింగ్ వేలాన్ని ఆయన నేడు హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా 60 బొగ్గు బ్లాక్‌లను వేలం వేయనున్నారు. ఇందులో వివిధ రకాల కోకింగ్, నాన్-కోకింగ్ బొగ్గు గనులున్నాయి. వీటిలో 24 బొగ్గు గనులను పూర్తిగా అన్వేషించగా, 36 గనుల్లో పాక్షిక అన్వేషణ జరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా ఒడిశా 16, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో15, జార్ఖండ్‌లో 6, పశ్చిమబెంగాల్, బీహార్‌లలో మూడేసి బొగ్గు బ్లాకులను గుర్తించారు. తెలంగాణ, మహారాష్ట్రలో ఒక బ్లాక్‌లను వేలం వేయనున్నారు. బొగ్గు రంగంలో పారదర్శకత, పోటీతత్వ ం, సుస్థిరతను పెంపొందించడానికి దోహదపడుతుందని అధికార బీజేపీ అంటోంది. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా ఉన్న ఈ బ్లాక్‌లు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు దోహదం చేస్తాయని వాదిస్తోంది. అయితే ఈ వాదనను రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ మొదలగు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెట్టేందుకే వేలం అని విమర్శిస్తున్నాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వేలంలో పాల్గొనేందుకు నిర్ణయించింది. బిడ్‌లో పాల్గొనకుంటే సింగరేణి కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కార్ వేలానికి మద్దతు పలికిందని ఈ సందర్భంగా వాదిస్తోంది.

శ్రావణపల్లి కోసం సింగరేణి ప్రయత్నం

రాష్ట్రంలో గుర్తించి ఏకైక బొగ్గు బ్లాకైన శ్రావణపల్లిని దక్కించుకునేందుకు సింగరేణి ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు వేలంలో పాల్గొనేందుకు ఆ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసుకుంది. రాష్ట్రంలో సింగరేణి మొత్తం 40 గనుల్లో బొగ్గును వెలికి తీస్తోంది. 2030 కల్లా 22 గనులు మూతపడే అవకాశం ఉంది. ఇప్పుడున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి 15 టన్నులకు పడిపోనుంది. కొత్త గనులు సంపాదించుకోక పోతే సింగరేణి చరిత్రలో కలిసి పోవడం ఖాయం. ఈ నేపథ్యంలో సంస్థను రక్షించుకునేందుకు 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలున్న రాష్ట్రంలోని శ్రావణపల్లి గనిని దక్కించుకునేందుకు సింగరేణి తనవంతుగా వేలంలో పాల్గొనేందుకు సిద్ధమైంది.

విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి, ఎన్టీఏ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్టీఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ..2013 కంటే ముందు రాష్ట్రాల వారీగా జరిగినట్టు పాత పద్ధతిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ నుంచి ప్రదర్శనగా వెళ్లి సరిత క్లినిక్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ పరీక్ష లీకేజీపై తక్షణమే నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్‌తో చెలగాటమాడటం సరికాదన్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ముందుగా సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు.సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, పటాన్‌చెరు, ఇతర ప్రాంతాలలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. నీట్ అక్రమాలపై ప్రధాని మోడీ ఎందుకు నోరు విప్పడం లేదని సీపీఐ(ఎం) నాయకులు ప్రశ్నించారు. నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసన, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నీట్ పరీక్షలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అంతవరకు విద్యాశాఖ మంత్రి బాధ్యతల నుంచి వైదొలగాలని నేతలు డిమాండ్ చేశారు.

సింగరేణి మెడపై కేంద్రం కత్తి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేయటానికి కేంద్రం సాహసించలేకపోయిందని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. అప్పట్లో మాజీ సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాయటంతో వాటి జోలికి రాలేదని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి అంతా తారుమారైందని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో రెండు కోల్ బ్లాకులను అక్కడి ప్రభుత్వరంగ సంస్థ అయిన మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు, ఒడిశాలో రెండు లిగ్నైట్ గనులను అక్కడి ప్రభుత్వరంగ సంస్థలకు ఇచ్చారని తెలిపారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై కూడా వేలం విషయమై అభ్యంతరం తెలిపితే... ఎలాంటి వేలం లేకుండానే అక్కడి లిగ్నైట్ గనులను కేటాయించారని వివరించారు. ఆ మూడు రాష్ట్రాలకు భిన్నంగా తెలంగాణలోని సింగరేణికి మాత్రం ఎందుకు గనులు కేటాయించటం లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేవనే కారణంతో, నష్టాల బూచి చూపి, దాన్ని ప్రయివేటీకరించేందుకు కేంద్రం పావులు కదిపిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో సింగరేణికి కూడా అదే దుస్థితి ఎదురుకానుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బొగ్గు బ్లాకుల వేలానికి కేంద్రం పూనుకుందని వాపోయారు. ఈ వేలం ప్రక్రియలో ఎందుకు పాల్గొంటున్నారో చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆయన ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు సైతం ఈ దుర్మార్గంపై ఆలోచించాలనీ, సంస్థను కాపాడుకునేందుకు నడుం బిగించాలని కేటీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రి అయిన కిషన్‌రెడ్డి... తెలంగాణకు ఏదో చేస్తారనుకుంటే, ఆయన ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ సింగరేణిని ప్రయివేటీకరించటమేనా..? అని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవటంతోనే కేంద్రం ఇలాంటి చర్యలకు ఒడిగడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ గద్దలకు బొగ్గు గనులను కేటాయిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. 'నాలుగున్నరేండ్ల తర్వాత మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం, అప్పుడు బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేస్తాం, ఇప్పటి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటాం... అందువల్ల వేలంలో పాల్గొనే వాళ్లు ఆలోచించుకోవాలి...' అని కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై రెండు, మూడు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

జీఓ 5ని వెంటనే ఉపసంహరించుకోవాలి

ఐటీ పరిశ్రమలో కార్మిక చట్టాల సడలింపు సరికాదు

తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్

మంత్రి దుద్దిళ శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని ఐటీ పరిశ్రమల్లో కార్మిక చట్టాలను మరో నాలుగేండ్ల పాటు సడలిస్తూ కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జారీ చేసిన జీవో నెంబర్ 5ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆ జీవో వల్ల ఐటీరంగంలో పనిచేస్తున్న కార్మికులకు నష్టం చేకూరే ప్రమాదముందని జె.వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లుగా రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలో కార్మిక శాఖ తనిఖీలు చేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కరోనా కాలం తర్వాత ఐటీ రంగంలో ఉన్న సౌకర్యాలను తగ్గించారనీ, వేతనాల్లో కోతపెట్టడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్మిక చట్టాలు ఆ రంగంలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.సురేశ్, ప్రధాన కార్యదర్శి జెనీమా, కోశాధికారి ఎవీబీ లక్ష్మి, సహాయ కార్యదర్శి కవిత, ఉపాధ్యక్షులు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రివర్గం భేటీ

(మొదటిపేజీ తరువాయి)

అంశాలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకోవడంతో సాధ్యమైనంత త్వరగా వీటిని అమలు చేసి ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఏకకాలంలో, ఏక మొత్తంలో రైతులు తీసుకున్న రూ.2లక్షల వరకు రుణాలన్నీ ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రుణమాఫీ విషయంలో కొందరిని మినహాయించాలని నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్, ప్రధాన మంత్రి బీమా యోజన పథకంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారు, ఉద్యోగులను దీని నుంచి మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో .రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనతో ఉన్నట్టు తెలిసింది. రుణమాఫీ పథకానికి ఎప్పటి నుంచి కట్ ఆఫ్ డేట్‌ను నిర్ణయించాలి, ఇంకా ఎలాంటి నిబంధనలు విధించాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. దీనిపై క్యాబినెట్ భేటీలో కూలంకషంగా చర్చించి, మంత్రుల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని సీఎం ఆలోచిస్తున్నారు. అలాగే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నందున ప్రారంభ తేదీని ఖరారు చేయనున్నారు. ఇప్పటికే ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఈ సమావేశాల్లో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సమాయత్తమవుతోంది.ఎన్నికల కోడ్ అనంతరం జరుగుతున్న ఈ భేటీలో వివిధ పథకాలకు, అభివృద్ధి పనులకు కేటాయింపులు, సమావేశాల నిర్వహణ, అధికార చిహ్నం, పార్లమెంట్ సెగ్మెంట్‌కో జిల్లాగా, 17 జిల్లాలకు కుదింపు, రాష్ట్ర విభజన అంశాల్లోని 9, 10 షెడ్యూల్‌కు సంబంధించిన ఆస్తులపైనా చర్చించనున్నట్టు సమాచారం. గవర్నర్ సంతకమయినా సాంకేతిక సమస్యతో బ్రేక్ పడ్డ ప్రభుత్వంల ఆర్టీసీ ఉద్యోగుల విలీనంతో పాటు ఏపీ తెలంగాణ ఉద్యోగుల అంశాల గురించి ఈ భేటీలో చర్చించే అవకాశముంది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో వచ్చిన అవినీతి, ఆరోపణలు, చత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో వెలుగుచూసిన కుంభకోణంపై కొనసాగుతోన్న విచారణలు, కేంద్ర నివేదికల ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు గత ప్రభుత్వంలో ఆయా శాఖలకు వ్యవహరించిన మంత్రులు, అధికారులపై తీసుకోవాల్సిన చర్యల గురించీ ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అనేక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునేందుకు జరుగుతున్న ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సమయ పాలన పాటించకుంటే కఠిన చర్యలు

టూరిజం కార్పొరేషన్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన మంత్రి జూపల్లి

ఎమ్‌డీ రమేశ్ నాయుడు తీరుపై ఆగ్రహం

ఇకనుంచి ఉద్యోగులందరికీ బయోమెట్రిక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమయ పాలన పాటించని ఉద్యోగులకు కఠిన చర్యలు తప్పవని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని (టీజీటీడీసీ) గురువారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రిసెప్షన్‌లో ఉన్న హాజరు పట్టిక, బయోమెట్రిక్‌లో అటెండెన్స్‌ను పరిశీలించారు. ప్రతీ ఫ్లోర్‌ను కలియ తిరిగి ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. పూర్తి స్థాయిలో సిబ్బంది రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంటే ఏం చేస్తున్నారని ఎమ్‌డీ రమేశ్‌నాయుడుపై ఈ సందర్భంగా మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సర కాలానికి సంబంధించిన అటెండెన్స్ జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. హాజరు శాతం, ఉద్యోగుల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అందరికీ బయో మెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వము

మహబూబ్‌నగర్ పురపాలక మండలివారి కార్యాలయం మహబూబ్‌నగర్ జిల్లా

ఆసక్తి వ్యక్తీకరణ (ఇ.ఓ.ఐ)

ఇ.ఓ.ఐ నోటీసు నెం:E2/4267/3rd part QC/2024, తేది : 18-06-2024

మున్సిపాలిటీ చేపట్టే అన్ని రకాల పనుల కొరకు, థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ కన్సల్టెన్సీ కొరకు ఆసక్తి వ్యక్తీకరణకు మహబూబ్‌నగర్ పురపాలక మండలి, కమిషనర్ ఆహ్వానిస్తున్నారు. ఆసక్తిగల సంస్థలు వారియొక్క ఫైనాన్షియల్ ఆఫర్ మరియు దిగువ పేర్కొన్న పత్రాలతోపాటు ఆసక్తి వ్యక్తీకరణను తేది : 24-06-24 మధ్యాహ్నం 1.00 గంట వరకెల్లా తెలపాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ కోరుతున్నారు, మరియు అదే రోజున 24-06-2024 సా.3.00 గంటలకు తెరువబడును.

కన్సల్టెన్సీ సంస్థ కొరకు అర్హతా షరతులు: 1. కన్సల్టెన్సీ సంస్థ తప్పనిసరిగా రిజిస్టరై ఉండాలి మరియు కనీసం గత 7 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో టిపిక్యూసి & టిపిక్యూఎ కన్సల్టెన్సీ సర్వీసెస్ సమకూర్చే రంగంలో ఉనికిలో ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన సంస్థ రిజిస్ట్రేషన్ కాపీని కన్సల్టెన్సీ సంస్థ సమర్పించాలి. 2. గత 7 సంవత్సరాలలో ఏదైనా 5 సంవత్సరాల కనీస వ్యవధికి టిపిక్యూసి సర్వీసెస్ అనుభవాన్ని కన్సల్టెన్సీ సంస్థ కలిగి ఉండాలి.

3. కన్సల్టెన్సీ సంస్థ గత ఐదేళ్లలో మొత్తమ్మీద కనీసం రూ.100 కోట్ల విలువైన తనిఖీ పనులు నిర్వహించి ఉండాలి.

4. ప్రభుత్వ మెమో నెం. 14436/ఇ1/2012-1, తేది : 27-06-2012 ప్రకారం, కన్సల్టెన్సీ సంస్థ తప్పనిసరిగా ఐఎస్ఓ/బిఐఎస్ ధ్రువీకరణను కలిగి ఉండాలి, గత ఐదు సంవత్సరాల ధ్రువీకరణ కాపీని సమర్పించాలి. 5. టెస్టింగ్ మరియు క్యాలిబ్రేషన్ సర్వీసెస్ కొరకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు చేత కన్సల్టెన్సీ సంస్థ తప్పనిసరిగా అక్రిడిట్ చేయబడి ఉండాలి. గత 7 ఏళ్లకు వరుసగా కనీసం ఏవేని 5 ఏళ్లపాటు నిర్మాణ సామగ్రిని పరీక్షించినట్లు ఎన్ఎబిఎల్ చేత జారీ అయిన సర్టిఫికెట్‌ను ఏజెన్సీ (ఎన్ఎబిఎల్ అక్రిడిటెడ్ ల్యాబొరేటరీ) తప్పనిసరిగా కలిగి ఉండాలి. (ఇతర ఏజెన్సీతో జాయింట్ వెంచర్ లేదా టై అప్ అయినది అనుమతించబడదు, మరియు విద్యాసంస్థలు అనుమతించబడవు). 6. కన్సల్టెన్సీ సంస్థ తప్పనిసరిగా చెల్లుబాటయ్యే జిఎస్‌టి రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి, మరియు తాజా జిఎస్‌టి రిటర్న్స్‌ను సమర్పించాలి.

7. కన్సల్టెన్సీ సంస్థ తప్పనిసరిగా చెల్లుబాటయ్యే ఇఎస్ఐ మరియు ఇపిఎఫ్ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి, మరియు గత ఐదేళ్ల కొరకు ఇఎస్ఐ మరియు ఇపిఎఫ్ లకు చెల్లింపులు జరిపిన కాపీలను సమర్పించాలి. 8. కన్సల్టెన్సీ తప్పనిసరిగా పాన్ మరియు సంస్థ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను సమర్పించాలి. 9. కన్సల్టెన్సీ సంస్థ తప్పనిసరిగా కమిషనర్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పేరిట తీసిన రూ.30,000/- డిడి తోపాటు సీల్డ్ ఇ.ఓ.ఐని సమర్పించాలి.

సం./- కమిషనర్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ.

DIPR. R.O.No. 925-PP/CL/ADVT/1/2024-25, Dt. 20-06-2024

తెలంగాణ ప్రభుత్వము

రెవెన్యూ (భూసేకరణ) శాఖ సూర్యాపేట జిల్లా

ఫారం-6

ప్రాథమిక ప్రకటన

(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 11(1) రూల్ 19(1) ననుసరించి కలెక్టర్ / అదనపు కలెక్టర్ / రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్

జిల్లా కలెక్టర్ సూర్యాపేట ఫైల్ నం. ఉ/58/2023 తేది: 14.06.2024

రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం.ఎఫ్/449/2023 తేది: 31.05.2024

హుజూర్ నగర్

గెజిట్ నెంబర్ 56/2024 తేది: 14.06.2024

తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు, జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ & సి.ఏ.డి ఇరిగేషన్ డివిజన్ నెం.3 హుజూర్‌నగర్ గారు పాలకీడు మండలం, గుండ్లపహాడ్ గ్రామములో ఇచ్చిన రిక్విజిషన్ లెటర్ నెం. ఇ.ఇ/ఐ.యస్.డి3/ హుజూర్ నగర్ / టి.ఓ/ 61 యం తేది: 22-02-2023 ప్రకారం ఈ దిగువ షెడ్యూల్ లో నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లా, పాలకీడు మండలం, గుండ్లపహాడ్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 1, 3, 4, 8, 10, 11, 13, 14, 62, 64, 68, 69, 70, 76, 183, 254, 257, 259 & 260లలో గల విస్తీర్ణం ఎ. 5-13 కుంటలు పట్టా భూములు ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా పాలకీడు మండలము, గుండెబోయినగూడెం గ్రామం నందు కృష్ణా నది నుండి జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్ కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కొరకు గుండ్ల పహాడ్ గ్రామ రెవెన్యూ పరిధిలో విస్తీర్ణం ఎ 5-13 కుంటలు భూమి అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017)ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం సెక్షన్ -10ఎ ఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, పాలకీడు మండలం, గుండ్లపహాడ్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 1, 3, 4, 8, 10, 11, 13, 14, 62, 64, 68, 69, 70, 76, 183, 254, 257, 259 & 260 లలో గల విస్తీర్ణం ఎ. 5-13 కుంటలు గల భూమి కృష్ణానది నుండి జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్ కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు అవసరమైనదని ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము: గుండ్లపహాడ్ మండలం: పాలకీడు జిల్లా: సూర్యాపేట

క్రమ సంఖ్య	సర్వే నెం.	భూమి వర్గీకరణ	భూమి రకము	సేకరించవలసిన విస్తీర్ణం	పట్టాదారు పేరు/ ఆసక్తి గల వ్యక్తుల పేరు/ చిరునామా	అనుభవదారుల పేరు	సరిహద్దులు ఉ	ద	తూ	ప	చెట్లు/ నిర్మాణాలు
1	2	3	4	5	6	7	8				9
1	1/15 /87/3 /5/8	పట్టా	ఖుష్కి	0.02	గొట్టె వెంకటేశ్వర్లు తండ్రి సైదయ్య	గొట్టె ఉష్మా భర్త	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
2	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
3	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
4	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
5	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
6	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
7	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
8	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
9	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
10	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
11	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
12	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
13	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
14	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
15	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
16	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
17	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
18	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
19	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
20	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
21	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
22	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
23	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
24	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
25	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
26	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
27	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
28	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
29	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
30	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
31	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
32	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
33	[illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
34	69	పట్టా	ఖుష్కి	0.01	గోళ్ళ వెంకటేశ్వర్లు తండ్రి నాగయ్య	గోళ్ళ వెంకటేశ్వర్లు తండ్రి నాగయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
35	70/ఆ	పట్టా	ఖుష్కి	0.00	దొంతగాని నర్సయ్య తండ్రి వెంకటస్వామి	దొంతగాని నర్సయ్య తండ్రి వెంకట స్వామి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
36	76/ఆ 3/2	పట్టా	ఖుష్కి	0.00	పాలేటి కవిత భర్త చంద్రశేఖర్	పాలేటి కవిత భర్త చంద్రశేఖర్	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
37	183/ 5 1 183/ 3/1 183/ 2 183	[illegible]	[illegible]	0.03	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
38	[illegible]	[illegible]	ఖుష్కి	0.02	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
39	[illegible]	[illegible]	ఖుష్కి	0.04 ¼	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
40	254/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
41	254/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
42	254/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
43	254/ 1	పట్టా	ఖుష్కి	0.04	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
44	254/ 2	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
45	254/ ఆ3	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
46	254/ ఆ3/	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
47	257/ 3ఎ/	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
48	257/ 3-1	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
49	257/ 10	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
50	257/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
51	257	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
52	257/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
53	257/ 7	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
54	257 -1	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
55	257/ 6-1	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
56	257/ 7/2	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
57	257/ 7/2	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
58	257	పట్టా	ఖుష్కి	0.00 ¼	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
59	257	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
60	257	పట్టా	ఖుష్కి	0.02 ¼	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
61	257	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
62	257/ 3/1	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
63	257/ 3/1	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
64	259/ 3/1	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	పిపిసి పైపులు
65	259/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
66	260/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
67	260/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
68	260/ [illegible]	పట్టా	ఖుష్కి	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
69	260	పట్టా	ఖుష్కి	0.00 ¼	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
	మొత్తం విస్తీర్ణం			5-13							

భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారపు హక్కు చట్టం 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము ప్రాథమిక ప్రకటన జారీ చేయడమైనది. నిబంధనల మేరకు సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి, హుజూర్‌నగర్ గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వ మండల అధికారి, హుజూర్‌నగర్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణ సంబంధించి సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలోకి ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరమున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వ మండలాధికారి, హుజూర్‌నగర్ గార్లకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసియున్నది. ఇట్టి ప్రకటన జారీచేసి (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసియున్నది.

సం/-	సం/-	సం/-
రెవిన్యూ డివిజనల్ అధికారి, హుజూర్‌నగర్	అధనపు కలెక్టర్, సూర్యాపేట	జిల్లా కలెక్టర్, సూర్యాపేట


DIPR Ro.No.72/LA-PP/Advt/Pubr2024-25

కారణం ఏదైతేనేం ? ఈ భూ ప్రపంచంలో నివసిస్తున్న ప్రతి 69 మంది ప్రజల్లో ఒక్కరు సొంత గూటిని వదిలి సుదూర ప్రాంతాలకు తరలిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 12 కోట్ల మంది ప్రజలు...అంటే జనాభాలో ఒకటిన్నర శాతం మంది నిరాశ్రయుల జాబితాలో చేరిపోయారు. దీని వెనుక ఎన్నో కన్నీటి కథలు, వ్యథలు ఉన్నాయి. కుటుంబాలు చిన్నాభిన్నమై పోయాయి. జీవనోపాధి కరువైంది. సమాజాలకు సమాజాలే వలస బాట పట్టాయి. ఇలా నిరాశ్రయులైన వారిలో 6.8 కోట్ల మంది స్వదేశంలోనే ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. మిగిలిన వారు శరణార్థులు. వీరిలో రక్షణ కోసం 4.34 కోట్ల మంది, ఆశ్రయం కోరుతూ 69 లక్షల మంది వలస పోయారని శరణార్థులకు చెందిన ఐరాస హైకమిషన్ కార్యాలయం తెలిపింది.

నీడ లేక గూడు వదిలి...!

ధరణిపై పెరుగుతున్న నిరాశ్రయులు

యుద్ధాలు, ఘర్షణలతో శరణార్థులుగా మారుతున్న ప్రజానీకం



న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఉన్న శరణార్థుల పరిస్థితిపై అవగాహన కల్పించేందుకు ఐరాస జూన్ 20వ తేదీని ప్రపంచ శరణార్థుల దినోత్సవంగా జరుపుతోంది. బలవంతంగా నిరాశ్రయులైన వారందరితో ఓ దేశాన్ని ఏర్పాటు చేస్తే అది ప్రపంచంలో అధిక జనాభా కలిగిన 13వ దేశంగా మారుతుంది. దారుణమైన విషయమేమంటే విధిలేని పరిస్థితుల్లో చెట్టా పుట్టా పట్టుకొని గమ్యం తెలియకుండా సాగిపోతున్న వారిలో సగం మంది చిన్నారులే.

1951లో కన్వెన్షన్ ఏర్పాటు

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లోని శరణార్థుల హక్కుల రక్షణ కోసం 1951లో ఐరాస ఓ కన్వెన్షన్‌ను ఏర్పాటు చేసింది. 1967లో ఆ కన్వెన్షన్‌ను ప్రపంచానికంతటికీ విస్తరించింది. ప్రారంభంలో 21 లక్షల మంది శరణార్థులు మాత్రమే ఉండేవారు. 1980 నాటికి వారి సంఖ్య కోటి దాటింది. 1980వ దశకంలో జరిగిన ఆఫ్ఘనిస్తాన్, ఇథియోపియా యుద్ధాల కారణంగా 1990 నాటికి శరణార్థుల సంఖ్య రెండు కోట్లకు చేరింది. ఆ తర్వాత రెండు దశాబ్దాల పాటు శరణార్థుల సంఖ్య స్థిరంగానే ఉంది.

ఆ ఐదు దేశాల నుండే...

తాజా సమాచారం ప్రకారం శరణార్థుల్లో మూడో వంతు మంది కేవలం ఐదు దేశాలు... ఆఫ్ఘనిస్తాన్, సిరియా, వెనెజులియా, ఉక్రెయిన్, పాలస్తీనా...నుండి వలస పోయిన వారే. శరణార్థుల్లో 70శాతం మంది పొరుగు దేశాల్లోనే ఆశ్రయం పొందుతున్నారు.

యుద్ధాలు, ఘర్షణలే కారణం

2001లో ఆఫ్ఘనిస్తాన్ పైన, 2003లో ఇరాక్ పైన అమెరికా జరిపిన దురాక్రమణలతో పాటు దక్షిణ సూడాన్, సిరియా దేశాల్లో జరిగిన ప్రచ్ఛన్న యుద్ధాల కారణంగా 2021 చివరి నాటికి నిరాశ్రయుల సంఖ్య మూడు కోట్లు దాటిపోయింది. 2022లో జరిగిన ఉక్రెయిన్ యుద్ధంతో శరణార్థుల సంఖ్య భారీగా పెరిగింది. సంవత్సరం వ్యవధిలోనే 57 లక్షల మంది ప్రజలు ఉక్రెయిన్‌ను విడిచి పారిపోయారు. గత సంవత్సరం చివరి నాటికి 60 లక్షల మంది ఉక్రెయిన్ ప్రజలు బలవంతంగా స్వస్థలాలను వదిలి సురక్షిత ప్రదేశాలకు తరలిపోవాల్సి వచ్చింది. గత సంవత్సరం సూడాన్‌లో సైన్యానికి, రాపిడ్ సపోర్ట్ దళాలకు మధ్య జరిగిన ఘర్షణలో పదిహేను లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ ప్రతిరోజూ వేలాది మంది వలస పోతూనే ఉన్నారు. ఇటీవల గాజాపై ఇజ్రాయిల్ జరిపిన భీకర దాడుల కారణంగా పాలస్తీనా ప్రజలు పెద్ద సంఖ్యలో శరణార్థులుగా మారారు. గాజా స్ట్రిప్‌లో 75శాతానికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. అనేక మంది ప్రజలు ఒక్కసారి కాదు...అనేక పర్యాయాలు ఇళ్లను వదిలేసి పారిపోవాల్సి వచ్చింది. అక్కడ 23 లక్షల మంది ఆకలి కేకలు వేస్తూ అల్లాడిపోతున్నారు. తీవ్రమైన కరువు పరిస్థితులు ముంచుకొస్తున్నాయి.

నీట్ పేపర్ లీక్‌లో బీజేపీ నాయకుల హస్తం

- ఆ రాష్ట్రాల్లోనే లీకేజీ..
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



నవతెలంగాణ-పెన్‌పహాడ్

నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందని, ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని శ్రీ సత్య ఫంక్షన్‌హాల్లో సీపీఐ(ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ మూలంగా 24 లక్షల కుటుంబాలు తీవ్ర ఆవేదనలో ఉన్నాయన్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకొని కోచింగులు తీసుకొని పరీక్షలు రాస్తే చివరి నిమిషంలో పేపర్ లీకేజీ, కుంభకోణాలు జరిగి విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాలు బీహార్, గుజరాత్, హర్యాన రాష్ట్రాల్లో లీక్ అయ్యాయని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీ జరిగిందన్నారు. పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల పాత్ర ఉందని ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. బీహార్ పోలీసులు పరీక్ష పత్రాల లీకేజీకి సంబంధించి 16 మందిని అరెస్టు చేశారని అన్నారు. పేపర్ లీకేజీ వెనుక కోట్లాది రూపాయలు తారుమారయ్యాయని తెలిపారు. గ్రేస్ మార్కులు ఉంటాయని ప్రభుత్వం ముందు చెప్పలేదని, మార్కుల్లో తేడాలు ఎందుకు ఉన్నాయని అడిగితే గ్రేస్ మార్కులు కలిపామని చెబుతోందని, ఎంట్రన్స్ టెస్టులలో ఎప్పుడూ గ్రేస్ మార్కులు వినలేదని అన్నారు. పేపర్ లీకేజీ అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి, ప్రధాని మోడీ నేటికీ నోరు విప్పలేదని విమర్శించారు. దేవుడు తనను పంపించాడని చెప్పిన మోడీకి పేపర్ లీకేజీ విషయం తెలియకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన నెట్ పరీక్షలలో సైతం అవకతవకలు జరిగాయని వాటిని వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఏ రాష్ట్రం పరీక్షలు ఆ రాష్ట్రమే నిర్వహించేదని, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తూ కేంద్రమే పరీక్షలు నిర్వహిం చడం సరైంది కాదని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కుల వివక్షకు చోటివ్వద్దు

డీఎంకే ప్రభుత్వానికి మాజీ న్యాయమూర్తి సిఫారసులు

చెన్నయ్ : తమిళనాడులోని పాఠశాలల్లో కుల వివక్ష అంతానికి మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె.చంద్రు నేతృత్వంలోని ఏకసభ్య కమిటీ డీఎంకే ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. పాఠశాల ప్రాంగణంలో కులాన్ని సూచించే రంగుతో రిస్ట్‌బ్యాండ్లు లేదా రింగులు వంటి చిహ్నాలు ధరించడాన్ని నిషేధించాలని, పాఠశాల పేర్ల నుండి కుల అనుబంధాలను తొలగించాలని, ఉపాధ్యాయులను నిర్దిష్ట కాలపరిమితిలో బదిలీ చేయాలని సిఫారసు చేసింది.

గత ఏడాది తిరునల్వేలిలో ఇద్దరు దళిత విద్యార్థులపై అగ్రకులాలకు చెందిన సహ విద్యార్థులు ఆటవికంగా దాడి చేసిన ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కొద్ది రోజుల క్రితం 610 పేజీలతో కూడిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అందజేసింది.

పలు జిల్లాల్లో పర్యటించి, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యార్థులతో సమావేశాలు నిర్వహించిన తర్వాత కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. దాడికి గురైన విద్యార్థులను కూడా జస్టిస్ చంద్రు కలిశారు. సమాజంలో వేళ్లూనుకుపోయిన కుల వివక్షను అంతమొందించేందుకు పాఠశాలల్లో చేపట్టాల్సిన చర్యలను ఆయన ప్రభుత్వానికి సూచించారు. కుల వివక్ష, హింస, లైంగిక వేధింపులు, లైంగిక హింస, ఎస్సీ-ఎస్టీలపై జరుగుతున్న వేధింపులను నిరోధించే చట్టం వంటి విషయాలలో 6-12 తరగతుల విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. పాఠశాలకు కులాన్ని సూచించే పేరు ఉన్నట్లయితే దానిని



తొలగించాలని, తరగతి గదిలో అక్షర క్రమంలోనే సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, హాజరు పట్టీలో విద్యార్థి కులం ప్రస్తావన లేకుండా చూడాలని సిఫారసు చేశారు.

చర్యల అమలును పర్యవేక్షించేందుకు ఎస్ఎస్ఎస్ తరహాలో సామాజిక న్యాయ విద్యార్థి దళాన్ని ఏర్పాటు చేయాలని జస్టిస్ చంద్రు సూచించారు. ఏదైనా ఓ కులం ప్రభావం ఎక్కువగా ఉన్న చోట ఆ కులానికే చెందిన విద్యాశాఖ అధికారులను నియమించకూడదని చెప్పారు. ఉపాధ్యాయులు, సిబ్బంది కోసం చట్టబద్ధమైన ప్రవర్తనా నియమావళిని రూపొందించాలని కోరారు. కాగా కమిటీ జరిపిన సంప్రదింపుల ప్రక్రియకు పలు పార్టీలు దూరంగా ఉన్నాయి. రిస్ట్‌బ్యాండ్లు, రింగులు ధరించడాన్ని నిషేధించాలని చెప్పడం హిందూ వ్యతిరేకతను సూచిస్తోందని బీజేపీ విమర్శించింది. 'తిలకధారణకు ఎలా అభ్యంతరం చెబుతారు? ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలి' అని డిమాండ్ చేసింది. కొన్ని కుల సంఘాలు కూడా నివేదికను విమర్శించాయి.

ప్రజలకు, కార్యకర్తలకు సెల్యూట్

- వచ్చే శాసనసభ ఎన్నికల్లో 88 సీట్లు గెలుస్తాం : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- కార్యకర్తల కృషిని ఎంత కొనియాడినా తక్కువే : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్
- బేగంపేట నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు తెలంగాణకు సెల్యూట్ ర్యాలీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లేసి ఆదరించిన రాష్ట్ర ప్రజలకు, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిషలు కృషి చేసిన కార్యకర్తలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సెల్యూట్ చేశారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు గెలవటం, రాష్ట్రానికి మోడీ క్యాబినెట్‌లో రెండు మంత్రి పదవులు దక్కటాన్ని పురస్కరించుకుని తెలంగాణకు సెల్యూట్ పేరుతో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో బేగంపేట నుంచి నాంపల్లిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో కిషన్‌రెడ్డి ఎంపీలు, ఎమ్మెల్యేలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రానున్న రోజుల్లో ప్రజల ఆశీస్సుల కోసం మరింత పనిచేస్తామని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో బీజేపీ తరపున 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలుగా గెలిచారనీ, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 88 సీట్లు సాధించి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..బీజేపీ కోసం ప్రాణాలు అర్పించిన కార్యకర్తలకు తెలంగాణ ఎంపీల గెలుపును అంకితం చేస్తున్నామని ప్రకటించారు. సాధారణ కార్యకర్తలుగా రాజకీయ జీవితం ప్రారంభించిన కిషన్‌రెడ్డి, సంజయ్ కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించడం గర్వకారణంగా ఉందన్నారు. తమ పార్టీలోకి వచ్చేవారిని గౌరవిస్తామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. 2028లో తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అర్వింద్‌కుమార్, జి.నగేశ్, బీజేపీ ఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి, హరీశ్‌బాబు, రామారావు, వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, సూర్యనారాయణ, పాయల్ శంకర్, పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం : బండి

తెలంగాణలో అధికారంలోకి రాగానే పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన భాగ్యలక్ష్మి టెంపుల్‌ను గురువారం రాత్రి సందర్శించారు. తమ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కార్యకర్తల కష్టార్జితమేనన్నారు. గోల్కొండ కోట మీద జెండా ఎగరవేసే వరకూ పోరాడుతామన్నారు. తనకు కేంద్ర మంత్రి పదవి అవకాశం కల్పించిన ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, అధ్యక్షులు జేపీ నడ్డాకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



రామాయణాన్ని అవమానపరుస్తూ స్కిట్ చేశారనీ..

ఐఐటీ బాంబే విద్యార్థులకు జరిమానా

- ఒక్కొక్కరికి రూ. 1.2 లక్షల వరకు ఫైన్

ముంబయి : భారత్‌లోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో ఒకటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే (ఐఐటీ బాంబే).. వార్షిక ప్రదర్శన కళల ఉత్సవం సందర్భంగా 'రాహోవన్' అనే నాటకాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1.2 లక్షల వరకు జరిమానా విధించింది. భారతీయ ఇతిహాసం రామాయణంపై ఆధారపడిన ఈ నాటకం.. రాముడిని కించపరిచేలా, హిందూ సంస్కృతిని అగౌరవపరిచేలా ఉన్నదంటూ కొన్ని హిందూత్వ శక్తులు ఆందోళనను వెలిబుచ్చాయి. దీంతో సంస్థ విద్యార్థులపై చర్య తీసుకున్నది. ఇన్‌స్టిట్యూట్‌లో సెమిస్టర్ ఫీజుకు దాదాపు సమానమైన జరిమానాతో పాటు, గ్రాడ్యుయేట్ చేసిన విద్యార్థులు జింఖానా అవార్డులలో ఎలాంటి గుర్తింపు పొందరు. అదే సమయంలో, వారి జూనియర్లకు ఒక్కొక్కరికి రూ.40,000 జరిమానాతో పాటు హాస్టల్ సౌకర్యాలను పొందకుండా నిషేధం విధించబడింది. మార్చి 31న ఈ నాటకాన్ని వివిధ విభాగాలు, తరగతులకు చెందిన విద్యార్థులు ప్రదర్శించారు. నాటకానికి సంబంధించిన అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'రాహోవన్' స్కిట్.. ప్రధాన పాత్రలను చెడుగా చూపించిందని ఐఐటీ బాంబేకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సదరు ఇన్‌స్టిట్యూట్ ఒక క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేసింది. చాలా చర్చల తర్వాత, కమిటీ జరిమానా, ఇతర క్రమశిక్షణా చర్యలను విధించింది. కాగా, కొందరు సంస్థ చర్యను తప్పుబట్టారు. విద్యార్థుల స్కిట్‌లో తప్పేమీ లేదని వారికి మద్దతుగా నిలిచారు. అయితే విద్యార్థులపై చర్యపై వ్యాఖ్యానించేందుకు ఐఐటీ బాంబే నిరాకరించింది.

ఉద్యోగ కల్పన అతిపెద్ద సవాల్

- బీజేపీ మెజారిటీ తగ్గడానికి ప్రధాన కారణం
- ఆర్థిక నిపుణుల వెల్లడి

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా చెప్పుకుంటున్నప్పటికీ.. ఉద్యోగ కల్పన అతిపెద్ద సవాల్‌గా ఉంది. వచ్చే ఐదేండ్లలో నిరుద్యోగాన్ని పరిష్కరించడమే అత్యంత కీలకం కానుందని రాయిటర్స్ పోల్‌లో నిపుణులు అభిప్రాయపడ్డారు. మే 15 నుంచి జూన్ 18 మధ్య నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది ఆర్థిక నిపుణులు, విధానవేత్తలు నిరుద్యోగమే అతిపెద్ద సవాల్‌గా నిలువనుందన్నారు. 54 మందిలో 49 మంది ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగాలను కల్పించడంలో లేదా దాని వైఫల్యాన్ని ఖచ్చితంగా అంచనా వేయడంలో ప్రభుత్వ సామర్థ్యాన్ని మెజారిటీ నిపుణులు ప్రశ్నించారు. ఉపాధిలో మార్పులు తీసుకురావడంపై పోషించాల్సిన పాత్రను వారు నొక్కి చెప్పారు. రాయిటర్స్ రిపోర్ట్ వివరాలు.. గత ఆర్థిక సంవత్సరం భారత్ 8 శాతం పైగా వృద్ధి నమోదు చేసింది. ప్రభుత్వ మూలధన వ్యయం ఇందుకు మద్దతునిచ్చింది. అసమానతలు, ద్రవ్యోల్బణం ఒత్తిడి, మంచి జీతాలు ఇచ్చే ఉద్యోగాలు సృష్టించలేకపోవడం తదితర కారణాల వల్లే ప్రధానీ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని బీజేపీ ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికలలో భారీగా మెజారిటీని కోల్పోయింది. "ప్రభుత్వం ఉద్యోగ కల్పన కోసం నిర్దిష్ట వ్యూహాన్ని కలిగి ఉండాలి. ప్రాథమిక సామాజిక సేవలు అయినా ఆరోగ్యం, విద్య పోషకాహారం, పారిశుద్ధంలో ప్రభుత్వ ఉపాధిని భారీగా పెంచాలి." అని నిపుణులు సూచించారు.

"భారత్‌లో మనకు చాలా విచిత్రమైన సమస్య ఉంది. వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఉపాధిలో



పెరుగుదల లేదు. యువతకు ఉద్యోగాలు, మెరుగైన జీవితాన్ని అందిస్తామని మోడీ అధికారంలోకి వచ్చారు. కానీ పరిస్థితులు చాలా దారుణంగా మారాయి" అని మసాచుసెట్స్ అమ్హెర్స్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయతి ఘోష్ అన్నారు. "ప్రతి సంవత్సరం లక్షలాది మంది శ్రామికశక్తిలోకి ప్రవేశించడానికి అవసరమైన ఉద్యోగాలను ప్రభుత్వం మాత్రమే సృష్టించలేదని.. ప్రయివేటు రంగంలోనూ అధిక, స్థిరమైన పెట్టుబడితో ముందుకు సాగాలి" అని ముంబయిలోని ఇందిరా గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ నుండి ఆర్థికశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ రాజేశ్వరి సేన్‌గుప్తా అన్నారు. ప్రభుత్వ ప్రయివేటు పెట్టుబడులకు అవరోధాలను గుర్తించాలని.. విధానపరమైన అడ్డంకులను తొలగించాలని సేన్‌గుప్తా పేర్కొన్నారు. దేశంలోని 80 శాతం మంది కూడా అసంఘటిత రంగంలోనే ఉన్నారని ఇటీవల ఆర్‌బిఐ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. దేశంలోని చాలా శ్రామిక శక్తి అనధికారిక రంగంలో ఉందని.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వారిని నిరుద్యోగులుగా నమోదు చేయడం లేదని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొఫెసర్ బీనా అగర్వాల్ అన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
కెనాల్ రోడ్ బ్రాంచ్, ఏలూరు, డి.నెం.36-1-25, విజయ గ్యాస్ గోడౌన్ దగ్గర, కెనాల్ రోడ్డు, ఏలూరు, ఆం.ప్ర-534001. ఫోన్: 08812-230896
స్కాన్ చేయగలరు
నియమ నిబంధనల కొరకు

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) లోని నిబంధనలు క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీత (లు) మరియు హామీదారు(లు)లకు తెలియుజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తులను సెక్యూర్డ్ క్రెడిటర్ గారికి తనఖా/ఛార్జ్ చేయబడి **బ్యాంక్ ఆఫ్ బరోడా** యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తగిన వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను **"ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే"** మరియు **"ఏదైతే ఉన్నదో అదే"** ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/సెక్యూర్డ్ ఆస్తు(లు)/బకాయి మొత్తము/రిజర్వు ధర/ఇ-వేలం బిడ్ పెంపుదల మొత్తము వివరములు ఈ దిగువ చెప్పబడినది.

క్ర సం	ఋణగ్రహీత / హామీదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తుల వివరములు	మొత్తము బకాయి	ఇ-వేలం తేది మరియు సమయం	రిజర్వు ధర, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల
1)	శ్రీ దాంట్ల మహేష్, తండ్రి. శ్రీ వసంత రావు, ఇంటి నెం.2-3, ముస్తిబండ (గ్రా), దమ్మపేట (మం), సత్తుపల్లి, తెలంగాణ-507306.	ఆం.ప్ర, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, వెంకటాపురం పంచాయితీ, ఏలూరు బ్లాక్-1, గ్రీన్ వ్యాలీ లే-అవుట్, ప్లాట్ నెం.134 లోని ఆర్.ఎస్.నెం.132/2ఎ మరియు 132/3 వద్ద గల 38.00 చ॥గ॥లు (266.66 చ॥గ॥లు విస్తీర్ణంలోని అవిభాజ్యమైన ఉమ్మడి వాటాతో గల) విస్తీర్ణంలోని గ్రూప్ హౌస్ (స్టిల్ట్+గ్రౌండ్+మొదటి+రెండవ అంతస్తులతో ఉన్న) గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్లింత్ ఏరియా 850 చ॥అ॥లుతో పడమర వైపున ఫ్లాట్ నెం.102, డోర్ నెం.22-136 తో ఉన్న నివాసయోగ్యమైన ఫ్లాట్. స్థలం యొక్క హద్దులు: తూర్పు: 40 అ॥ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.133 యొక్క స్థలం, పడమర: ప్లాట్ నెం.127 యొక్క స్థలం, ఉత్తరం: ప్లాట్ నెం.135 యొక్క స్థలం. ఫ్లాట్ యొక్క హద్దులు : తూర్పు: కామన్ కారిడార్ & లిఫ్ట్, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: కామన్ కారిడార్. మొత్తం ఆస్తి విస్తీర్ణం 850 చ॥అ॥లులోని నివాసయోగ్యమైన ఫ్లాట్ అన్ని ఈజిమెంట్ హక్కులుతో గల శ్రీ దాంట్ల మహేష్, తండ్రి. శ్రీ వసంత రావు గారి పేరున కలదు.	రూ.24,15,673/- (అక్షరాల ఇరవై నాలుగు లక్షల పదిహేను వేల ఆరు వందల డెబ్బై మూడు రూపాయలు మాత్రమే) మరియు తేది.10.11.2022 నుండి వర్తించని వడ్డీ + ఛార్జీలు మొదలైనవి.	05-07-2024 మ॥ 02.00 గం॥ల నుండి సా॥ 06.00 గం॥ల వరకు (వేలము పూర్తి అగు వరకు 10 నిమిషముల చొప్పున సమయం పొడిగించబడును)	రిజర్వు ధర : రూ.16,61,000/- ధరావత్తు : రూ.1,66,100/- బిడ్ పెంపుదల : రూ.10,000/-
				స్వాధీనత స్వభావం : భౌతికంగా	
				ఆస్తిని తేది.01-07-2024 ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు తనిఖీ చేసుకోగలరు.	

అమ్మకం పూర్తి నియమములు మరియు నిబంధనల కొరకు మా వెబ్ సైట్ : **https://www.bankofbaroda.in/e-auction.htm** సందలి మాచే ఇవ్వబడిన లింకును చూడండి మరియు **https://ibapi.in** కూడ చూడవచ్చును. అర్హత గల బిడ్డర్లు **అధీకృత అధికారి : శ్రీ జడే పాల్ విల్సన్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం.84510 15253** ను సంప్రదించగలరు.

తేది : 20.06.2024, ప్రదేశం : ఏలూరు — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

నీట్ లీక్ నిజమే..

బీహార్ పోలీసులకు విద్యార్థి వాంగ్మూలం..

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించారు.మరోపక్క నీట్ లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బీహార్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బందం(సిట్)ను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకూ సిట్ అధికారులు 14 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ఒక జూనియర్ ఇంజినీర్, ముగ్గురు నీట్ అభ్యర్థులు ఉన్నారు. ఈ నలుగురిలో ఓ నీట్ అభ్యర్థి.. జూనియర్ ఇంజినీర్‌కు మేనల్లుడని తెలుస్తోంది.నీట్ పరీక్షకు హాజరైన సదరు విద్యార్థి పోలీసుల విచారణలో స్పందిస్తూ.. 'రాజస్థాన్‌లోని కోటాలో నేను నీట్ కోసం ప్రిపేరవుతున్నా. మా మామయ్య ఫోన్ చేసి, నీట్ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేశా.. ఇంటికి రమ్మన్నారు. గత నెల ఐదో తేదీన నీట్ పరీక్షకు ఒక రోజు ముందు రాత్రి నా మిత్రులతో కలిసి మామయ్య ఇంటికి వెళ్లా.. అక్కడ నాకు నీట్ ప్రశ్నాపత్రం, ఆన్సర్ షీట్ ఇచ్చారు. ఆ రాత్రంతా వాటిని కంఠస్థం చేశాం. ఐదో తేదీన పరీక్షా కేంద్రంలో మాకు ఇచ్చిన ప్రశ్నాపత్రం.. ముందు రోజు మా మామయ్య ఇచ్చిన పేపర్ ఒక్కటే అని తేలింది' అని చెప్పాడు. ఇదే విషయమై రాత పూర్వకంగా రాసివ్వడంతో నీట్ యూజీ 2024 అక్రమాల వ్యవహారం మరింత తీవ్రమైంది.అయితే బీహార్‌లో నీట్ పరీక్షా పత్రం లీకేజీ కోసం సంబంధిత ముఠా రూ.32 లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తున్నది. అలా లీకైన ప్రశ్నాపత్రం అందుకున్న విద్యార్థుల్లో ఒకరికి 720 మార్కులకు 185, మరొకరికి 300, మరో ఇద్దరికి 581, 483 మార్కులు వచ్చాయని తెలుస్తున్నది.

ఎన్టీఏను రద్దు చేయాలి

- పరీక్షల నిర్వహణలో వరుస అవకతవకలు
- అధికారులపై విచారణ జరపాలి
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరీక్షలను నిర్వహించడంలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యతారహితంగా వ్యవహరించడాన్ని ఖండించారు. ఎన్టీఏ ప్రారంభం నుంచి విద్యావ్యవస్థను అపహాస్యం చేస్తున్నదని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో అది అసమర్థంగా వ్యవహరించిందని తెలిపారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, సీయూఈటీ పరీక్షలో పొరపాట్లు, ఇప్పుడు యూజీసీ నెట్ పరీక్షను సమగ్రంగా నిర్వహించడంలో విఫలమైందని విమర్శించారు. యూజీసీ నెట్ రాతపరీక్షను రద్దు చేసిందని తెలిపారు. విద్యారంగంలో సమస్యలు తీవ్రమవుతున్నా కేంద్ర విద్యాశాఖ మంత్రి పరిష్కరించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. తక్షణమే ఆ పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని, పరీక్షలను కేంద్రీకృతం చేసి ప్రయివేటు కోచింగ్ సెంటర్లు, సంస్థలను ప్రోత్సహించడాన్ని తీవ్రంగా ఖండించారు. మతోన్మాదాన్ని పెంచే దృష్టితో ఎన్ఈపీలో భాగంగా ఎన్టీఏను కేంద్రం ప్రారంభించిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ అవకతవకలకు పాల్పడుతున్నదనీ, ఆ అధికారులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ

శుక్రవారం 21 జూన్ 2024
www.navatelangana.com

గంధపు చెక్కలా సమాజ సేవలో అరిగిపోగాని,
ఇనుప ముక్కలా తుప్పపట్టకు - మోక్షగుండం విశ్వేశ్వరయ్య

సంపాదకీయం

రష్యా-ఉత్తర కొరియా రక్షణ బంధం!




రష్యా-ఉత్తర కొరియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవటం ప్రపంచ పరిణామాల్లో ఒక ముఖ్యమైన అంశం. ఇరవై నాలుగేండ్ల తరువాత రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ ఉత్తర కొరియా సందర్శనలో సంతకాలు చేశారు. తమ కంట్లో నలుసుగా, పంటికింద రాయిగా, కాళ్లో ముల్లుగా ఉన్న దేశాలను అణగదొక్కేందుకు చూస్తున్న అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలకు సహజంగానే ఇది మింగుడు పడక చిందులు వేస్తున్నది. ఉక్రెయిన్‌తో పదేండ్ల రక్షణ ఒప్పందాన్ని అమెరికా కుదుర్చుకున్నపుడు లేని రచ్చ ఇప్పుడెందుకు ? తన అణుకార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు, పదును పెంచేందుకు ఈ ఒప్పందం గురించి అమెరికా తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఉత్తర కొరియా అందిస్తున్న ఆయుధాలకు ప్రతిగా దాని అణు కార్యక్రమానికి, ఖండాంతర క్షిపణుల వృద్ధి, అణు జలాంతర్గాముల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, యుద్ధ విమానాలు,సాయుధ శకటాలను అందించనుందని అంటున్నది. ఇదంతా పశ్చిమ దేశాలను మరింతగా భయపెట్టి తన కౌగిట్లో బంధించుకొనేందుకు, వాటితో పెద్ద మొత్తంలో ఆయుధాలను కొనిపించేందుకు అన్నది స్పష్టం.నాటో కూడా దానికి తానతందాన అన్నది. అసలు ఒప్పంద పత్రాన్ని ఇంతవరకు ప్రకటించలేదు, దానిలో ఉన్న అంశాలేమిటో తెలియకుండానే ఇలా చెప్పటంలో ఆశ్చర్యం లేదు.

బంగ్లాదేశ్ విముక్తికి మన దేశం మిలిటరీని పంపి సాయం చేసినపుడు మనల్ని బెదిరించేందుకు అమెరికా బంగాళాఖాతంలోకి సప్తమ నౌకా దళాన్ని దించింది. అప్పుడు నాటి సోవియట్ యూనియన్‌తో మనదేశం కూడా ఇలాంటి రక్షణ ఒప్పందమే చేసుకోవటంతో అమెరికా తోకముడిచింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరిగింది. రష్యా, ఉత్తర కొరియా మరింత దగ్గరయ్యాయి. రెండు దేశాల మీద సామ్రాజ్యవాద కూటమి అమలు జరుపుతున్న ఆంక్షలను ఎదుర్కొనేందుకు కూడా ఉపయోగపడుతుంది.

పశ్చిమ దేశాలు ఇస్తున్న ఆయుధాలను ఆత్మరక్షణకే గాక అవసరమైతే రష్యా భూభాగాలపై దాడులు చేసేందుకు కూడా జెలెన్‌స్కీ సేనలకు అనుమతి ఇచ్చిన అంశం తెలిసిందే. తెలివితేటలు పశ్చిమదేశాల గుత్త సొత్తేమీ కాదు. ఎవరి తురుపు ముక్కలు వారికి ఉంటాయి.కంటికి కన్ను పంటికి పన్ను మాదిరి ఉంటేనే అగ్రరాజ్యం ఒళ్లు దగ్గర పెట్టుకొని ఉంటుంది.రష్యాకు వ్యతిరేకంగా, అసలు సమస్య నుంచి ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకు స్విడ్జర్లాండ్‌లో నిర్వహించిన ఉక్రెయిన్ శాంతి సభ సాధించేదేమీ లేదు. అమెరికా కూటమికి చెంపపెట్టుగా దానికి హాజరైన అనేక ముఖ్యదేశాలు సమావేశ ప్రకటనపై సంతకాలు చేసేందుకు తిరస్కరించాయి. హాజరైన 90దేశాలలో భారత్, బ్రెజిల్, మెక్సికో, ఇండోనేషియా వంటి పన్నెండు దేశాలు వాటిలో ఉన్నాయి. సం తకం చేసిన ఇరాక్, జోర్డాన్ తరువాత ఉపసంహరించు కున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సమావేశానికి రష్యాను పిలవలేదు, ఆహ్వానం అందుకున్న చైనా తిరస్కరించింది. రష్యా లేకుండా ఆ సభ సాధించేదేమీ ఉండదని చెప్పింది. కొలంబియా చివరి నిమిషంలో తాము హాజరు కావటం లేదని తెలిపింది.

ఉక్రెయిన్ సంక్షోభ నేపథ్యంలోనే రష్యా-ఉత్తర కొరియా ఒప్పందం అన్నది స్పష్టం.ఉక్రెయిన్‌పై సైనిక చర్య జరుపుతున్న రష్యాకు ఉత్తర కొరియా అందిస్తున్న మందుగుండు, రాకెట్ల గురించి పశ్చిమదేశాలు గుర్రుగా ఉన్నాయి.రష్యాకు సరఫరా అవుతున్న 48లక్షల ఫిరంగి గుండ్లున్న కంటెయినర్లను తాము కనుగొన్నట్లు అమెరికా ఫిబ్రవరిలో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత నాటి సోవియట్ యూనియన్, ఉత్తర కొరియా, చైనాలను బెదిరించేందుకు, అవసరమైనపుడు దాడులు చేసేందుకు వీలుగా అమెరికన్లు దక్షిణకొరియా, జపాన్‌లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేయటమేగాక జపాన్‌తో రక్షణ ఒప్పందం కూడా చేసుకుంది. ఇప్పుడు ఉత్తర కొరియాతో రష్యా అదే చేసింది. దీని ప్రకారం మూడోపక్షం లేదా కూటమి ఎవరి మీద దాడి చేసినా ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు అవకాశం కల్పిస్తుంది. బంగ్లాదేశ్ విముక్తికి మన దేశం మిలిటరీని పంపి సాయం చేసినపుడు మనల్ని బెదిరించేందుకు అమెరికా బంగాళాఖాతంలోకి సప్తమ నౌకా దళాన్ని దించింది. అప్పుడు నాటి సోవియట్ యూనియన్‌తో మనదేశం కూడా ఇలాంటి రక్షణ ఒప్పందమే చేసుకోవటంతో అమెరికా తోకముడిచింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరిగింది. రష్యా, ఉత్తర కొరియా మరింత దగ్గరయ్యాయి. రెండు దేశాల మీద సామ్రాజ్యవాద కూటమి అమలు జరుపుతున్న ఆంక్షలను ఎదుర్కొనేందుకు కూడా ఉపయోగ పడుతుంది. పశ్చిమ దేశాలతో సాగుతున్న వైరుధ్యాలు ఇప్పటికిప్పుడు సమిసేవికాదు. ఇప్పటికే చైనాతో ఎంతో దగ్గరైన రష్యా మరొక ముందడుగువేసి ఉత్తర కొరియాతో మైత్రిని పటిష్టం చేసుకోవటమే కాదు పశ్చిమ దేశాలతో పోరాడే సామర్థ్యాన్ని కూడా పెంచుకున్నట్లయింది. ఉత్తర కొరియా కూడా ఎవరిని చూసీ భయపడాల్సిన పరిస్థితి ఉండదు. ఒకవైపు రష్యా, మరొకవైపు చైనా రక్షణ కవచాల్లా ఉంటాయి.

అయోతీ థాస్: తొలి కులరహిత ద్రవిడోద్యమ మార్గదర్శి


డాక్టర్ దేవరాజు మహారాజు



"స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి, దేశభక్తి గురించి, స్వదేశీ జాగరణ గురించి మాట్లాడి జనాల నుండి చందాలు వసూలు చేసుకునే ఈ రాజకీయ నాయకులు ప్లేగు వంటి వ్యాధులు ప్రబలినప్పుడు, కరువు కాటకాలు వచ్చినపుడు అడ్రసు లేకుండా పోతారు. ప్రజల కన్నీళ్లు తుడవడానికి ఎవరూ రారు. వారికి అందించాల్సిన కూడు, నీడా వంటి కనీసావసరాలు అందించరు. కష్టకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ నాయకులు కలలో కూడా అనుకోరు. వారు చేప్పే దేశభక్తి అంతా వారి స్వార్థ ప్రయోజనాల కోసమే - అని ప్రజలు గ్రహించాలి!" అని 'తమిళన్' అక్టోబర్ 23, 1912 నాటి సంచికలో ఆ పత్రికా సంపాదకుడు సి.అయోతీ థాస్ రాజకీయ వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. దాంతో దక్షిణ భారత దేశం ఉలిక్కిపడింది. ఎవరీ అయోతీ థాస్ అని తెలుసుకోవడం ప్రారంభించింది.

దక్షిణ భారతదేశంలో కులాన్ని ప్రశ్నిస్తూ తొలిసారి గొంతెత్తిన కార్యకర్త-అయోతీ థాస్. ఆది ద్రావిడ నేపథ్యం నుండి వచ్చిన ఆయన రాజకీయం, సాహిత్యం, మతం వంటి అనేక రంగాలలో అవిరళ కృషి చేసినవారు. తమిళ పండితుడు, వృత్తి రీత్యా సిద్ధ వైద్యుడు. పందొమ్మిదవ శతాబ్దం చివరలో ఆది ద్రావిడ ప్రజల అభ్యున్నతి కోసం నడుం బిగించి 1891లో 'కుల రహిత ద్రవిడ మహాసభ'ను స్థాపిం చారు. ఈ విషయంలో రెట్టమలై శ్రీనివాసన్ అనే మరో సంఘ సంస్కర్త ఈయనకు సహకరించారు. బౌద్ధం స్వీకరించిన అయోతీ థాస్, పరయల (మాలల) అసలు మతం బౌద్ధమని తేల్చారు. అందరినీ అందులోకి మారమని సూచించారు. కులరహిత సమాజం బౌద్ధం ద్వారానే సాధ్యమని ఉద్బోధించారు.

తరతరాలుగా వైష్ణవ సంప్రదాయంలో కూరుకుపోయిన కుటుంబం వీరిది. అయినప్పటికీ తన హేతుబద్ధమైన ఆలోచనలతో బ్రాహ్మణాధిపత్యాన్ని మతపరమైన పెత్తందారీ పోకడల్నీ అయోతీథాస్ పక్కకు తొలగిస్తూ వచ్చారు. ఆ కాలంలోనే అంటే 19వ శతాబ్దపు చివరికాలంలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం సంస్థలు హిందూ మత పునరుద్ధరణకు పూనుకున్నాయి. 1861-91 మధ్య కాలంలో క్రైస్తవులు, ముస్లింలు మినహా మిగిలిన వారందరినీ బలవంతంగా హిందువులుగానే పరిగణించారు. అయితే అయోతీ థాస్ 'హిందూ' అనే గుర్తింపును నిరాకరించారు. కారణమేమంటే హిందూను గుర్తిస్తే అందులో ఉన్న కుల నిర్మాణాన్ని, నిచ్చెనమెట్ల కుల సంస్కృతిని, అసమానతలను స్వీకరించాలి. అందు కని ఆయన దాన్ని తిరస్కరించడంతో పాటు, తన అనుయాయులందరినీ తిరస్కరించమని సూచించారు. కుల హింసలను గుర్తు చేసుకుని, ఆది ద్రావిడుల్ని ఆ పరిధిలోంచి బయటికి రమ్మని పిలుపు నిచ్చారు. అప్పుడే తమిళ శైవమతంలో కూడా పునరుద్ధరణకు ప్రయత్నాలు జరిగాయి. ఇది బ్రాహ్మణ వ్యతిరేకత గురించి మాట్లాడింది కానీ, కుల నిర్మూలన గురించి మౌనంగానే ఉంది. అందువల్ల అయోతీ థాస్ శైవమతం స్వీకరించలేదు.పైగా శైవమతం వైపు కూడా ఆకర్షితులు కాకూడదని తనవారికి ఉద్బోధించారు.

ఈ ప్రయత్నాలు ఇలా ఉండగా అయోతీథాస్ రాజకీయంగా కూడా కొన్ని ప్రయత్నాలు చేశారు. తను స్థాపించిన 'కుల రహిత ద్రావిడ మహాసభ' పక్షాన 10 డిమాండ్లతో ఒక వినతి పత్రం తయారు చేసి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి పంపారు. వారు వాటిని తమ 12వ సమావేశంలో చర్చించారు కూడా! అయితే, అందులో ఒక్క డిమాండుకు కూడా సుముఖత వ్యక్తపరచలేదు. ఆ డిమాండ్లలో ఉచిత విద్య, బంజరు భూముల కేటాయింపు, పరయల (మాలల) ఆలయ ప్రవేశం మొదలైనవి ఉన్నాయి. ఆలయ ప్రవేశం ఇక్కడ భక్తికి సంబంధించిన విషయం కాదు. మనుషులుగా సమానహోదా, సమాన హక్కుకు సంబంధిం చిన విషయం. కాంగ్రెస్ పార్టీతో పని కాలేదని అయోతీ థాస్ తన ప్రయత్నం మానుకోలేదు. ప్రత్యామ్నాయ ప్రయత్నాలు ప్రారంభించారు. ఎమ్.వీర రాఘవా చారియర్, జి. సుబ్ర హ్మణ్య అయ్యర్, సి.ఆనందాచార్లు కలిసి 1884లో 'మద్రాస్ మహాజనసభ'ను స్థాపించారు. ఇది కాంగ్రెస్‌కు ప్రత్యా మ్నాయం కాగలదని భావించారు. లోగడ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అవే పది డిమాండ్ల వినతిపత్రం అయోతీ థాస్ మళ్లీ ఈ మద్రాసు మహాజనసభకు పంపిం చారు. కానీ, అక్కడా చుక్కెదురైంది. నిర్వాహక సభ్యులు వినతి పత్రాన్ని తిరస్కరించడమే కాదు, ఆయనను ఘోరంగా అవమానించారు.

తరతరాలుగా వైష్ణవ సంప్రదాయంలో కూరుకుపోయిన కుటుంబం వీరిది. అయినప్పటికీ తన హేతుబద్ధమైన ఆలోచనలతో బ్రాహ్మణాధిపత్యాన్ని మతపరమైన పెత్తందారీ పోకడల్నీ అయోతీథాస్ పక్కకు తొలగిస్తూ వచ్చారు. ఆ కాలంలోనే అంటే 19వ శతాబ్దపు చివరికాలంలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం సంస్థలు హిందూ మత పునరుద్ధరణకు పూనుకున్నాయి. 1861-91 మధ్య కాలంలో క్రైస్తవులు, ముస్లింలు మినహా మిగిలిన వారందరినీ బలవంతంగా హిందువులుగానే పరిగణించారు. అయితే అయోతీ థాస్ 'హిందూ' అనే గుర్తింపును నిరాకరించారు. కారణమేమంటే హిందూను గుర్తిస్తే అందులో ఉన్న కుల నిర్మాణాన్ని, నిచ్చెనమెట్ల కుల సంస్కృతిని, అసమానతలను స్వీకరించాలి. అందు కని ఆయన దాన్ని తిరస్కరించడంతో పాటు, తన అనుయాయులందరినీ తిరస్కరించమని సూచించారు. కుల హింసలను గుర్తు చేసుకుని, ఆది ద్రావిడుల్ని ఆ పరిధిలోంచి బయటికి రమ్మని పిలుపు నిచ్చారు.

జరిగిన అవమానంతో అయోతీ థాస్ తీవ్రమైన మనోవేదనకు గురయ్యారు. తాము హిందు వులమే అయితే జాతి విచక్షణ ఎందుకూ? కుల దూషణలెందుకూ? దేవుడు అందరివాడైనప్పుడు ఆలయ ప్రవేశం తమకెందుకు ఉండదూ? వంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఆయన వాటికి సమాధానాలు కనుగొనే ప్రయత్నంలో వేదాలు, బ్రాహ్మణత్వం, ఆచారాలు వంటి వాటి గూర్చి అధ్య యనం ప్రారంభించారు. విషయాలు అర్థమౌతున్నకొద్దీ ఆయనలో ఒక ఉద్యమకారుడు రూపుదిద్దుకో సాగాడు. 1870 దశకంలో తన పాతికేండ్లప్రాయంలో తమిళనాడు నీలగిరి ప్రాంతంలోని తోడర్- కొండజాతులను సమైక్య పరిచి 1875లో అద్వైతా నంద సభకు రూపకల్పన చేశారు. అప్పుడే రెవరెండ్ జాన్ రథినమ్‌తో పరిచయం ఏర్పడింది. ఈయన మద్రసులో అది ద్రావిడుల కోసం వెస్లియన్ మిషన్ పాఠశాల నిర్వహిస్తున్నా డు. ఆయన పరిచయంతో అయోతీ థాస్‌కు కొత్త ఉత్సాహం లభించింది. దాంతో 1885లో 'ద్రవిడ పాండ్యన్' అనే వార్తా పత్రికను ప్రారంభించాడు. ఎప్పటి నుంచో చేస్తూ వచ్చిన అధ్యయనాల కారణంగా ఒక సంవత్సరం తర్వాత 1886లో "ఆది ద్రావిడులు హిందువులు కారు" - అని భారతదేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మకమైన ప్రకటన చేశారు.

1891లో ద్రవిడ మహాసభను స్థాపించి, ఆది ద్రావిడులకు ఒక పిలుపునిచ్చారు. వారంతా తమను తాము హిందువులుగా కాక, 'కుల రహిత తమిళులు'గా ప్రకటించుకోవాలని కోరారు. ఆ రోజుల్లో అదొక సాహసోపేతమైన చర్య. ఈ రోజుల్లో కొందరు ప్రభుత్వ వ్యవస్థలతో పోరాడి, కులరహిత సర్టిఫికేట్లు తీసుకుంటున్న సంగతి మనకు తెలుసు. కానీ, ఇప్పటికి 130 ఏండ్ల ముందు ఆ ప్రకటన చేయడమంటే-ఆయన ఎంత ధైర్యం చేసి ఉండాలీ? ఎంత ముందు చూపు ఉండి ఉండాలీ? ఒకసారి అయోతీ థాస్ తన అనుచరులతో థియాసాఫికల్ సొసయిటీ వ్యవస్థాపక అధ్యక్షుడయిన కొలొనెల్ హెచ్.ఎస్.ఓల్కాట్‌ను కలుసుకున్నారు. బౌద్ధం స్వీకరించాలన్న తన కోర్కెను ఆయనకు తెలియజేశారు. ఆయన అయోతీ థాస్ శ్రీలంకకు వెళ్లే ఏర్పాటు చేశాడు. శ్రీలంకలో అయోతీ థాస్ సింహళ బౌద్ధ భిక్షువు సుమంగళ నాయక్ నుండి ధమ్మదీక్ష స్వీకరించారు. చెన్నై తిరిగివచ్చాక 1898లో 'శాక్య బౌద్ధ సంఘాన్ని' స్థాపించి దాన్ని శాఖోపశాఖలుగా విస్తరింపజేశారు. ఈయన అప్పుడు ఏర్పాటు చేసిన శాక్య బౌద్ధ సొసయిటీయే కాలక్రమంలో ఇండియన్ బుద్దిస్ట్ అసోసియేషన్‌గా మారిపోయింది. తర్వాత కాలంలో బౌద్ధానికి సంబంధించి అనేక శాఖలు, సంఘాలు ఏర్పడుతూ వచ్చాయి.

ద్రవిడ ఉద్యమ పితామహుడిగా నిలిచిన అయోతీ థాస్, రచయితగా చేసిన కృషి కూడా తక్కువది కాదు. 1.అంబికయ్యన్ కథ 2.ఇంద్ర జాతి చరిత్ర 3.ఇంద్ర దేశ బౌద్ధపండుగలు 4.శాక్య మహర్షి చరిత్ర 5.తిరుక్కురల్ దేవునికి శుభాకాంక్షలు 6.తిరువళ్లువర్ చరిత్ర 7.నందన్ చరిత్ర 8. ఆధునిక కులాల్లో భయాందోళనలు 9. బుద్ధుడు రాత్రీ పగలు లేని కాంతి 10.మురుగ భగవానుని చరిత్ర 11.వివాహ వివరణ 12. ప్రాచీన తమిళ భాష బుద్ధుడు ఆదివేదం 13.వేష బ్రాహ్మణవేదాంత వివరణ-మొదలైనవి.


'అయోతీ థాస్'గా ప్రసిద్ధుడైన ఈయనను తల్లిదండ్రులు పెట్టిన పేరు కథవ రాయన్. ఇప్పుడు ఆ పేరు చెబితే ఆయనను ఎవరూ గుర్తుపట్టరు. అయోతీ థాస్ అనేది ఆయనకు ఆయనే పెట్టుకున్న పేరు. బాల్యంలో ఈయన అయోధ్య దాసర్ పండిట్ అనే ఉపాధ్యాయుడి వద్ద చదువు నేర్చుకున్నారు. తమిళం, ఇంగ్లీషు, పాళీ భాషల్ని, తత్త్వశాస్త్రాన్ని, సిద్ధ వైద్యాన్నీ ఇలా అనేక విషయాలు నేర్చుకున్నారు. అందువల్ల గురువుగారిపట్ల ఆ బాలుడికి ఏర్పడ్డ గౌరవభావంతో తన పేరు కూడా అయోధ్య దాసర్‌గా చెప్పుకునేవాడు. అంటే తను కూడా గురువంతటి వాణ్ణి కావాలన్న ఆకాంక్ష అతనితో అలా చేయించింది. ఆ పేరే స్థిరపడి అయోతీ థాస్‌గా మారింది. తమిళ పలుకుబడి థాస్ అంటే మన తెలుగులో దాసుడు అనే అర్థం.

వీరిది విద్యావంతుల కుటుంబం. ఈయన తండ్రి కాంతప్పన్, ఫ్రాన్సిస్ వైటీ ఎల్లిస్ అనే బ్రిటీషు అధికారి దగ్గర పనిచేసేవాడు. తన కుటుంబం తరతరాలుగా భద్రపరుచుకుంటూ వచ్చిన తిరుక్కురల్, నాలదియార్‌లను కాతప్పన్ ఫ్రాన్సిస్ ఎల్లిస్‌కు తాళపత్రాలలో అందిస్తే - ఆయన వాటి విలువను గ్రహించి, ఇంగ్లీషులోకి అనువదించాడు. తర్వాత పుస్తకాలుగా ముద్రించి ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆ రకంగా తమిళుల సాంస్కృతిక సంపదైన తిరుక్కురల్ వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకుంటూ ఉంటే - మన తెలుగు కవి వేమన పద్యాలను సేకరించి, ఇంగ్లీషులోకి అనువదించి ప్రపంచానికి పరిచయం చేసిన మన ఛార్లెస్ ఫిలిస్, బ్రౌన్ (1798-1884) గుర్తుకొస్తారు.

అయోతీ థాస్ 20 మే 1845న రోయపెట్ట, మద్రాసులో జన్మించారు. మళ్లీ అదే మే నెల 5వ తేదీన 1914లో 69వ యేట కన్నుమూశారు. తండ్రి ఉద్యోగం కారణంగా వీరి కుటుంబం నీలగిరికి వలస వెళ్ళింది. ఒక రకంగా పెరియార్, ద్రవిడర్ కజగమ్, బి.ఆర్.అంబేద్కర్‌లకు ఈయనే స్ఫూర్తి ప్రదాత! ఈయన మరణించిన చాలా కాలానికి ఆయుర్వేదం, యునాని వంటి వైద్య విధానాలతో పాటు సిద్ధ మెడిసిన్‌ను కూడా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ గుర్తించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిద్ధ - ను మాజీ భారత ప్రధాని డా.మన్‌మోహన్‌సింగ్ ప్రారం భించారు. చాలాకాలం అయోతీ థాస్ పేరు మరుగున పడిపోయింది. అయితే తన దళిత సాహిత్య అకాడెమీ పక్షాన ఇజిల్ మలై(గతంలో కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రిగా పనిచేశారు) అయోతీ థాస్ రచనల్ని మళ్లీ వెలుగులోకి తెచ్చారు. కేంద్ర మంత్రిగా పని చేసిన అంబుమణి రామ్‌దాస్ చొరవతో కూడా అయోతీ థాస్ జీవనం - కృషి ఈ తరానికి పరిచయమయ్యాయి.

- సుప్రసిద్ధ సాహితీ వేత్త, విశ్రాంత ప్రొఫెసర్ (మెల్బోర్న్ నుంచి)

బలమైన ప్రతిపక్షం తప్పనిసరి


కె.శాంతారావు
9959745723



ప్రజాస్వామ్యానికి పాలకపక్షం - ప్రతిపక్షం రెండూ రెండు కండ్లులాంటివి. కండ్లు సమంగా ఉంటేనే చూపు సరిగా ఉంటుంది. ప్రతిపక్షం ధీటుగా ఉంటేనే పాలకపక్షం సక్రమంగా వ్యవహరించగలు గుతుంది. కాబట్టి ప్రజాస్వామ్యం సజీవ ఆరోగ్య మనుగడకు బలమైన ప్రతిపక్షం తప్పనిసరి. స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి కమ్యూనిస్టులు ఈ పనిచేసారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు అలా చెక్ పెట్టారు. ప్రతి అంశంలో చాలా పకడ్బందీగా, నిర్మాణాత్మకంగా వ్యవహరించడం వలనే నెహ్రూ ప్రభుత్వం కొంతలో కొంతైనా ప్రజానుకూలంగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడింది.

సైద్ధాంతిక విభేదాలతో సాగే పాలక-ప్రతిపక్షం సభ్యుల చర్చల సరళి అటు పార్లమెంటులోనూ, ఇటు పార్ల మెంటు బయటా ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ప్రజల రాజకీయ చైతన్యాన్ని విజ్ఞానదాయకంగా పెంచేది. పత్రికలు మీడియా హుందాగా నడిచేవి. నేతల ఉపన్యాసాల్లో రాతల్లో ఆ భాషా సంస్కారం, రాజకీయ పరిణితి, సైద్ధాంతిక పరిపక్వత, చమత్కారం ప్రస్ఫుటించేవి. అంతిమంగా అవి ప్రజాస్వామ్యం ఉద్దీవనగావడానికి ఎంతగానో తోడ్పడేవి.

కానీ మనది భూస్వామ్య పెట్టుబడిదారీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రభుత్వం గనుక దాని పరిమితులు దానికి ఉంటాయి. అలాగే ఆ వర్గస్వభావమూ ఉంటుంది. ఆ దోపిడీ పీడన పాలనాంగాల్లో, చర్యల్లో అది వ్యక్తం అవుతూనే ఉంటుంది. వీర తెలంగాణా సాయుధ పోరాట కాలంలో నిజాం పోలీసులతో పాటు నెహ్రూ పటేల్ సైన్యం ఘాతుకాలకి వేలాదిమంది ప్రజానీకం బలికావడం తెలిసిందే. ఆ నిరుపేద ప్రజానీకం భయంకర నిర్బంధ చిత్రవధలకు గురవ్వడం. ప్రజానాయకులు అజ్ఞాతవాసాలకు వెళ్లడం. ప్రజల్ని క్రూరంగా పీడించిన దొరలూ దేశ్‌ముఖ్‌లే తిరిగి కాంగ్రెస్ నేతలుగా చెలామణిగావడం అందరూ ఎరిగిందే.

ఈ నేపథ్యంలో ప్రపంచంలో తొట్టతొలిసారిగా ఎన్నికల ద్వారా ఎన్నికైన కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వానికి నాయకత్వం వహించిన ఘనత ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్‌దే. 1957లో సంభవించింది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం ఉందని భారత ప్రజలకు చూపింది కమ్యూనిస్టులే. దున్నేవానికే భూమి చెందాలని భూ సంస్కరణలు ప్రవేశపెట్టడం. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలపెంపు (సమాన పనికి సమానవేతనం) ఉపాధి కల్పనకై కొత్తగా ప్రయివేటు పెట్టుబడుల ఆకర్షణ, ప్రయివేటు పాఠశాలలో సైతం ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకం మొదలైన చర్యలకు, ఆ ప్రభుత్వం శ్రీకారం చుట్టుంది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు ఇవి ప్రత్యామ్నాయ విధానాలు. ఎక్కడ ఇవి ప్రజల్లో పాతుకు పోతాయేమోననే భయంతో 1959లో కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇ.ఎం.ఎస్. ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించింది.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించడం అంటే రాష్ట్రాల హక్కులను అంటే ఆ రాష్ట్ర ప్రజల ప్రజాస్వామిక హక్కులను సామూహికంగా కాలరాయడమే. అలా ఇప్పటివరకు దాదాపు 125 సార్లు కేంద్రం, వివిధ రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించింది అంటే ఆ విధంగా ప్రతిపక్షాల నోళ్లు నొక్కేయడంగానే భావించాలి.

ఈ పరిస్థితుల్లో ఇప్పటి 18వ లోక్‌సభ ఎన్నికల పరిశీలించినట్లయితే బీజేపీ - ఎన్డీయే కూటమి గెలిచి ఓడినట్టుగా ఫీలవుతుంటే, కాంగ్రెస్ - ఇండియా కూటమి ఓడి గెలిచినట్టుగా సంబరపడిపోతున్నది. ప్రజానీకం కూడా ఈ మార్పును అర్థం చేసుకోగలుగుతున్నది. తమకు ఎదురేలేదనుకున్న బీజేపీ అందునా ప్రధాని మోడీ దుర్మార్గాలకు, దురాగతాలకు కచ్చితంగా ముకుతాడు వేసి అడ్డగించగలమని ఉత్సాహపడ్తున్నది. 'ఈ ఎన్నికల్లో విపక్షాలు కొట్టిన చావుదెబ్బకు మోడీ సర్కార్ కనీసం నడవలేని స్థితికి చేరుకున్నదని' కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటున్నారు. భారత ఓటర్లు ప్రతిపక్షాలకు ఇచ్చిన ఆత్మస్థైర్యంగా దీనిని మనం చెప్పుకోవచ్చు.

లోక్‌సభ మెజారిటీ మార్కు 272 కాగా బీజేపీకి 240 మాత్రమే వచ్చాయి. అందుకే తెలుగుదేశం (16 మంది ఎంపీలు) నిలీష్ కుమార్ జనతాదళ్ (12 మంది ఎంపీలు)పై ఆధారపడవలసి వచ్చింది. కాంగ్రెస్‌కు 99 వచ్చినా ఇండియా కూటమికి 232 లభించాయి.

ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం దాదాపు వందకోట్ల మంది భారత ఓటర్లలో 65 కోట్లమంది మాత్రమే ఓటు వేసారు. అంటే ప్రతి ముగ్గురులో ఇద్దరు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో 37శాతం మంది అంటే 23 కోట్ల మంది మాత్రమే బీజేపీకి ఓటువేసారు. ఇది మాత్రమే బీజేపీ ప్రాతినిధ్యం. మిగిలిన ప్రజాపక్షాన్ని ప్రతిపక్షంగా భావిస్తే ప్రతిపక్ష పాత్ర ఎంత విశాలమైనదో, ఎంత లోతైనదో, ఎంత పెద్ద బాధ్యతతో కూడుకున్నదో అవగతమవుతుంది. మరి దానికి తగిన విధంగా కాంగ్రెస్ వ్యవహరించగలదా? ప్రతిపక్షనేతగా రాహుల్ గాంధీ ఆ సమర్థతను చూపగలరా...? అనేది వేచిచూడాలి.

రాజ్యాంగ విలువలు లౌకిక విలువలు కాపాడడంతో పాటు ప్రజల్లో శాస్త్రీయతను, హేతువాద దృక్పథాన్ని పెంచవలసిన బాధ్యత ఎంతో ఉన్నది. హిందూత్వభావనకు వ్యతిరేకంగా సాఫ్ట్ హిందూత్వ అంటే కుదరదు. సైద్ధాంతికంగా నెహ్రూ శాస్త్రీయ దృక్పథానికి ఇది వ్యతిరేకం. ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడటమే అవుతుంది. వ్రతం చెడ్డా ఫలితం దక్కదని రుజువవుతున్నది కూడా. మొత్తం విద్యావ్యవస్థనే కాషాయికరణ గావించడంలో గత బీజేపీ గణనీయ పాత్రను నిర్వహించింది. అలాగే రైతుల నల్లచట్టాలు మెడపై కత్తిలా వేలాడుతూనే ఉన్నాయి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల చట్టాల సవరణ ప్రమాదం కొనసాగుతూనే ఉన్నది. వీటన్నిటిపై సుస్పష్ట వైఖరి అవశ్యం. దీనికి తోడు అవినీతి తారాస్థాయికి చేరింది. రూ. వందల వేలకోట్లు గల కుబేరులే ప్రజాప్రతి నిధులవుతున్నారు.

పీడిత ప్రజల ప్రియతమనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ పక్షనేతగా రాజ్యసభలో ప్రసంగించేటప్పుడు ప్రతి అంశం పూర్వాపరాలు తెలుసుకుని సాధికారంగా మాట్లాడేవారని ప్రతీతి. అంకెలు, సంఖ్యలతో సహా సభకు వచ్చేవారు. అధికారులు, పాత్రికేయులతో పాటు, ఆయా రంగాల నిపుణులు సైతం శ్రద్ధగా నోట్ చేసుకుని అమలు పరిచేందుకు ప్రయత్నించేవారు. తప్పులను పొరపాట్లను సరిదిద్దుకునేవారు. ప్రజలకు ఆ విధంగా న్యాయం జరిగేది. ఒక వ్యక్తినుండి వ్యవస్థకు, ఓ వ్యవస్థ నుండి ప్రజా సమూహానికి అలా అభిప్రాయాలు ఆచరణ చేరి మార్పుకు దోహదపడేవి. ఓ ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష పాత్ర అంటే ఇదికదా...! అని ముక్కున వేలేసుకుని అంతర్జాతీయ స్థాయిలో సైతం గమనించేవారు.

చరిత్ర ఒక్కొక్కరికి ఒక్కోసారి ఒక్కోలా అవకాశం ఇస్తుంది. దాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటే చరిత్రకారులుగా నిలబడతారు. లేకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. తేల్చుకోవాల్సింది మనమే. ■

రేపటి కామెడీ!

- రంగనాయకమ్మ





'విముక్తి' అనేశావు. ఎలాగ?"

"ఎలాగా? ఎలాగో నీ బ్యాగ్‌లో వున్న పుస్తకంలో చదవాలన్నాను. ఆ పుస్తకం బ్యాగులో నిజంగా వుందా, తీసేశావా?"

"నిజంగా ఇప్పుడు బ్యాగులో లేదు! మొన్న మా క్లాసులో ఒకడు నేను చదువుతోంటే, తొంగి తొంగి చూసి, 'కాపిటలా? ఈ పుస్తకం గురించి బాగుంటుందనో యేదో కొందరంటారు. కొన్నావా? ఒక్కసారి నాకియ్యి! రేపొద్దున్నేకల్లా ఇచ్చేస్తానోయ్! అరె, సారీ! రేపు మార్నింగ్ సినిమాకి టిక్కట్టుందిలే, ఎల్లుండి తప్పకుండా ఇచ్చేస్తానోయ్! ప్లీజ్! ఏమన్నా రాస్తా దాని మీద!' అని గబ గబా అంటోంటే, అసలు భరించలేకపోయాను. రేపొద్దున్న సినిమా అట! అది మానకూడదట! కాపిటల్‌ని తిరగేసి, ఏదో రాస్తాడట! ఎంత వాగాడో!"

"సరే, అడిగాడులే. నువ్వేమన్నావు? ఇవ్వలేదా, ఇచ్చావా?"

"ఇచ్చానా! ఇస్తే, నీ ముందు కూర్చో గలిగేవాడినా?"

"నాకేం తెలుస్తుంది? నిన్ను కూర్చోవద్దంటానా?"

"నువ్వు అంటావని కాదు. కాపిటల్‌ని వాణ్ణి ముట్టుకోనిస్తే, నేనే నీ ముందు కూర్చోగలిగే వాణ్ణి కాదు!"

"అది తప్పు! ఆ పూట ఇవ్వక్కర్లేదు గానీ, 'నేను చదవడం అయ్యాక ఇస్తాలే' అంటే మంచిదే. ఏమో! కాస్త చదివి, తిరగేసి, తిరగేసి చదివి ఏమన్నా మారే వాడేమో! తర్వాత, ఆ పుస్తకం గురించే మాట్లాడే వాడేమో! 'తర్వాత ఇస్తాలే' అనకపోయావా? చూడనియ్యి ఒక సారి! నేను మాత్రం కాపిటల్ చదవక ముందు ఈ మాత్రం మాట్లాడ గలిగే వాడినా?"

"అవును గోపాల్! నాకూ కొత్తగానే తెలిశాయి నీ మాటల్తో!"

"ఏమో మరి! ఒక సారి ఇస్తే చదువుతాడేమో!"

"నా కలా అనిపించలేదు అప్పుడు!"

"అప్పుడు సరే! ఇప్పుడు?"

"ఏమో! అతడు మళ్ళీ అడిగితే, అడిగితేనే కాదులే. అసలు ఏ పుస్తకాలు చదివాడో అడిగి, చదవాలంటే కొనుక్కోలేవా? - అంటా."

"అవును, అంతే! ఒక్క రోజ్కైనా నువ్వు చదవకుండా ఎవరికీ ఇవ్వకు!"

"అలా ఇస్తే, నీతో అబద్ధం చెప్పాల్సిందే!"

"అలాంటి మాటలు మానెయ్యి! ఇలాంటి మాటలు చెప్పడాలూ, వినడాలూ, నీకూ, నాకూ వ్యక్తి పూజలై పోతాయి, తెలుసా?"

"సరే! సరదాగా అన్నాలే. ఇందాకేదో అడగాలనుకుంటే వచ్చింది. సమాజం, మొదట్లో బానిస యజమానుల పెత్తనం కింద ప్రారంభమైందని చెప్పి, తర్వాత ఎదిగింది, మరి కాస్త ఎదిగింది, మరీ కొంత ఎదిగింది అన్నావు. యజమానుల పెత్తనాల్లో మార్పులు వుంటే మాత్రం, వాటిని సమాజం ఎదగడం, అంటామా?"

"బాగా అడిగావు! సమాజం ఎదగడానికి కారణం, యజమానులు కారు! శ్రామిక వర్గంలో ఎదుగుదలలే, ఎదురు తిరగడాలే అసలు కారణం! ఒకప్పుడు బానిసలుగా బతికిన వాళ్ళు, తర్వాత కౌలు రైతులుగా మారి, ఆ తర్వాత జీతాల శ్రామికులుగా ఈ నాటి దశకి ఎదిగినట్టు కాదా? వాళ్ళ పోరాటాల వల్లే మార్పులన్నీ! మనకు తెలియనివి, బోలెడుంటాయిలే. మరి, అదంతా ఎదుగుదలే శ్రామిక వర్గ భావాల్లో."

"అయితే, ఇప్పుడు మనం ఎలా ఎదగాలి? మన భావాల్లో ఏం మార్పులు రావాలి?"

"ఆలోచించి చూడు!"

"మనం ఉద్యోగాలు కావాలనుకుంటున్నాం. వస్తే వస్తాయి! జీతాలూ వస్తాయి! అంతేనా జరగాల్సింది? దానితో మనకి సంతృప్తేనా? పక్కనే బిచ్చగాళ్ళు వుంటారే! పక్కనే బికార్లూ వుంటారే! వాళ్ళెలా ఎదగాలి?"

"శ్రమ దోపిడీ మొత్తంగా అంతర్థానం అవ్వాలన్నదే మన ఆలోచన! ఇంకా, బికార్లేంటీ, బిచ్చగాళ్ళేంటీ?"

"అవును, అవును! అంతే! ఇంకా ఎంత కాలం భరించాలి దోపిడీ? అది కాదు, ఆ కౌలూ, వడ్డీ, లాభం - అన్ని దోపిడీలూ పోవాల్సిందే! కానీ, గోపాల్! 'లాభం' అనేది కూడా పూర్తిగా పోవాల్సిందే కదా?"

" 'లాభం' వేరా? కౌలూ, వడ్డీలతో కలిసిందే లాభం కదా? చెప్పలేదా? సరుకుల్ని అమ్మగా వచ్చే లాభం లోనించే పరిశ్రమ నించున్న భూమికి కౌలు! ఖర్చులికి 'పెట్టుబడి' పేరు పెట్టి, దానికి వడ్డీ! మూడోది లాభం! మూడు పంపకాలయ్యేదే మొత్తం దోపిడీ! ఇంకా ఎప్పుడు పూర్తి చేస్తావు రవి బాబూ ఆ పుస్తకం?"

"చేస్తా! చేస్తా! చేసేస్తా గోపాల్! పరీక్షల గోల ఒకటి కదా, చస్తున్నాను! వాటిని మానేస్తాలే. మరి, లాభం పోతే, దాన్ని లాక్కుంటూ, బతికే పెట్టుబడిదార్లు గార్లు ఎలా బతుకుతారంటావు?"

"నీతో లాభం లేదు, నువ్విక పనికి రావు! లాభం అని నేనూ అన్నాను గానీ, అది చెత్త మాట! నీకు ఆలోచనా శక్తి ఈ బూర్జువా పరీక్షలతో పూర్తిగా పోయింది! 'లాభాన్ని లాగే వాళ్ళు', అది లేకపోతే ఎలా బతుకుతారు - అంటావా? అంత మాత్రం ఆలోచించ లేవా? లాభాలు లేకుండా శ్రామిక వర్గం వాళ్ళంతా ఎలా బ్రతుకుతున్నారు? అసలీ 'లాభం' మాటని మనం పలక కూడదు. బొత్తిగా తప్పుడు మాట అది! ఏ విషయంలో అయినా, 'లాభం లేదే!' అన్నామంటే, ఇప్పుడే అన్నాగా? ఎక్కడి నించో ఏదో రావాలని ఆశలతో ఎదురు చూడ్డమేగా? లాభాన్ని లాగకపోతే దోపిడీ దారులెలా బ్రతుకుతారబ్బా - అని, నీకు బెంగ పట్టుకుందా?"

"సరే, తిడితే తిట్టు! ఇవన్నీ నాకు ఇంతకు ముందే ఎందుకు చెప్పలేదు? నన్ను పిలిచి పది రోజులు దాటి పోయింది."

"నువ్వయితే, పది రోజులూ దాట నిచ్చి, ఆ తర్వాత వచ్చావు. బూర్జువా పరీక్షల మత్తులో, ఫస్ట్ క్లాస్ మార్కుల పిచ్చి గర్వంలో మునిగావు. అంతేగా?"

"అంటే అను! ఇందాకే చెప్పేశాను. ఈ పూటకి ఆఖరిగా తిట్టి చెప్పెయ్! శ్రమ దోపిడీ అంతర్థానం తర్వాత ఈ సమాజం ఎలా ఉంటుందో చెప్పు!"

"దోపిడీ పోతే, దోపిడీ జరగని సమాజం ఉంటుంది! అందరికీ కడుపులు నిండడం! అందరికీ చదువులు! అందరికీ పనులూ, విశ్రాంతులూ! అందరికీ సంతృప్తులూ, సంతోషాలూ! బాధలూ, అసూయలూ, కలహాలూ, వుండే పరిస్థితులే లేకపోతే, హత్యలుంటాయా? ఆత్మహత్యలుంటాయా? మూఢ నమ్మకాలుం టాయా?"

"మరి దేవుళ్ళు?"

"అదీ చెప్పాలా? మూఢ నమ్మకాలు వుండవు అన్నానుగా? సమాజాన్ని, అలాగే ఉత్తమంగా ఊహించు!"

"మనం కూడా, నేను కూడా, ఉత్తమంగా అయిపోవాలి! ఇప్పుడే అయ్యాను! కమ్యూనిస్టుగా అయిపోయాను!"

"అప్పుడే కాదు, నీ పరీక్షలో? రాయవా?"

"కాదు, ఇంక వొద్దు! ఉత్తమ సమాజంలో, ఉత్తమ పరీక్షల కోసం చదువుతాను. మరి నువ్వు? నీ పీహెచ్‌డీ చదువు ఆపుకుంటావా?"

"ఎప్పుడో, ఆర్నెల్ల కిందటే, కాపిటల్‌ని మొదలెట్టి, రెండు సార్లు చదివేసిన తర్వాతే, నా పీహెచ్‌డీ పరిశోధనలనీ అవగొట్టి, ఈ విషయమే ఆలోచిస్తున్నాను నిన్న మొన్నటి నించీ."

"ఏం ఆలోచించావు చెప్పు! తొందరగా చెప్పు!"

"మనం ఉత్తమ సమాజం కోసం ఆలోచించాలి!"

"అంటే, కమ్యూనిస్టులుగా మారాలంటావు. అంతేగా?"

(ఇంకావుంది) ■

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com



కడవరకు పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి నిలిచిన వ్యక్తి పుల్లయ్య

- గ్రామంలో పార్టీని బలోపేతం చేయడంలో ఎనలేని కృషి
- బీరవెల్లి మృతి పార్టీకి, కుటుంబానికి తీరనిలోటు

నవతెలంగాణ-కల్లూరు



తాను నమ్మిన సిద్ధాంతం కోసం చేతపట్టిన జెండా కోసం ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన, తట్టుకొని నిలబడి సీపీఐ(ఎం)ని బలోపేతం చేయటంలో బీరవెల్లి పుల్లయ్య వెనుతిరగలేదు, కడవరకు పార్టీ కోసమే అంకితమై పని చేసి ఆదర్శంగా నిలిచారు. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన బీరవల్లి పుల్లయ్య పార్టీకి పునాదులు వేసిన వారిలో ఒకరు. ఎన్ని ఆటంకాలు ఏర్పడిన, ఎవరు ఏం చెప్పినా వినకుండా తాను నమ్మిన అభిమానించిన పార్టీ వైపే కుటుంబాన్ని మొత్తాన్ని నడిపిన వ్యక్తి, సుమారు 25 సంవత్సరాల పాటు సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మట్టూరు భద్రయ్య సర్పంచ్‌గా కొనసాగారు. అప్పటనుండి వార్డు సభ్యులుగా గెలుస్తూ వార్డులోని సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందారు. తాను మూడుసార్లు, తన భార్య మూడుసార్లు అదే వార్డు సభ్యులుగా గెలుస్తూ వచ్చారు. 2019లో ఆరోగ్యం రీత్యా పోటీ నుండి విరమించుకున్నారు. పార్టీ సంక్షోభంలో ఉన్నప్పుడు గ్రామంలోని పార్టీ నాయకులు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో పుల్లయ్య నేనున్నానంటూ నా వెంట రండి అంటూ పార్టీని ముందుకు నడిపించిన వ్యక్తి పుల్లయ్య. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరు కూడా పార్టీలోనే ఉంటూ పార్టీకి సేవలు అందిస్తున్నారు. వ్యక్తులు కాదు పార్టీ ముఖ్యమని, పార్టీ కోసమే పని చేయాలంటూ కార్యకర్తల్ని ఎటుపోనేకుండా ఉన్నవరకు ఒకే తాటిపై నడిపి పార్టీకి అంకితం అయ్యారు. అనారోగ్య కారణాలతో బుధవారం మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక పార్టీ నాయకత్వం జిల్లా పార్టీ దృష్టికి తీసుకుపోవటంతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, గ్రామానికి చేరుకొని భౌతిక కాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్లయ్య చేసిన సేవలు గురించి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునరావు, మండల పరిషత్ అధ్యక్షుడు బీరవెల్లి రఘు, మట్టూరి స్టాలిన్, గ్రామ శాఖ కార్యదర్శి దోమతోటి పుల్లయ్య, నాయకులు బీరవెల్లి బాబు, తెగుల బాబు, తాళ్ల వెంకటి, తన్నీరు కృష్ణవేణి, బి.రవల్లి కరిష్మా, బీరవల్లి రవీంద్ర, బి.రవల్లి పెద్ద అంజి, బీరవెల్లి నరసింహారావు, కటుకూరి వెంకటేశ్వర్లు, అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొని అంతిమ వీడ్కోలు పలికారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖమ్మం పట్టణం పాండురంగా పురానికి చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితుడైన షేక్ యాకుబ్ పాషా (35)కు సంవత్సరం శిక్షతో పాటు ఫిర్యాదికి లక్ష యాభై వేల రూపాయలను చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు పాండురంగాపురానికి చెందిన ఫిర్యాది కాటిరెడ్డి రామిరెడ్డి వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 10-5-2012న లక్షయాభై వేలను అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చాడు. ఫిర్యాది తన రుణంను తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడి 29-5- 2013 యాక్సస్ బ్యాంకు చెక్కును జారీ చేశారు. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా, నిందితుని ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో తిరస్కరణకు గురిఅయినది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో నిందితుని పై ప్రయివేటు కేసు దాఖలు చేసినారు. అట్టి కేసును విచారించిన న్యాయాదికారి నిందితునిపై నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చేప్పారు.

కౌలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకూ పోరాడుతాం..

- కౌలు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాదినేని రమేష్

నవతెలంగాణ-తల్లాడ



కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు, అలుపెరుగని పోరాటం చేస్తామని తెలంగాణ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాదినేని రమేష్ అన్నారు. బుధవారం తెలంగాణ కౌలు రైతుల సంఘం రాష్ట్ర సదస్సు తల్లాడ వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గాన్ని 25 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా మాదినేని రమేష్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం తల్లాడలో నవతెలంగాణతో మాట్లాడుతూ.. వలసలు పోకుండా, ఉపాధి దొరుకుతుందనే, ఆశతో నిరుపేదలు కాయకష్టాన్ని నమ్ముకుని పొలాలు సాగు చేస్తున్నారన్నారు. అందిన చోటల్లా వడ్డీలకు డబ్బులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తే గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, తిండి గింజలు మిగులుతాయని, పశువుల పోషణకు గడ్డి లభిస్తుందని, తద్వారా పాల ఉత్పత్తి ఆదాయం పెరుగుతుందనే ఆశతో కౌలు రైతులు కాయ కష్టం చేస్తున్నారన్నారు. కుటుంబంలోని వారందరూ కష్టపడుతూ పంటలు పండిస్తున్నారన్నారు. కానీ ఆశించిన ఫలితం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కౌలు రైతులకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనలు విధిస్తూ వారి ఆశలను అడియాసలు చేసిందన్నారు. రేషన్ కార్డు ఉంటేనే రుణమాఫీ చేస్తామని, రైతుల నుండి కౌలుకు చేస్తున్నట్లు డిక్లరేషన్ తేవాలని నిబంధనలు పెట్టి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు అందజేయాలని, బ్యాంకుల్లో రుణాలు ఇవ్వాలని, రైతులకు రుణమాఫీ చేస్తే కౌలు రైతులకు రుణమాఫీ వర్తింపచేయాలని, సబ్సిడీ విత్తనాలు ఎరువులు అందించి పంట పండిన అనంతరం మార్కెట్లో గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులను సంఘటితం చేసి సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాడుతామన్నారు.

రాష్ట్ర సదస్సులో చేసిన తీర్మానాలు

రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో రద్దు చేసిన సెక్షన్ 26ను తిరిగి పునరుద్ధరించాలని, కౌలు రైతులతో జాయింట్ లయబిలిటీ గ్రూపులు ఏర్పాటు చేయాలని, పరస్పర సెక్యూరిటీపై రుణాలు ఇవ్వాలని, పంటల ధరలపై మద్దతు ధర ఇవ్వాలని, ప్రకృతి వైపరీత్యాలకు పరిహారాలను వాస్తవ సాగు దారుకు నేరుగా ఇవ్వాలని, ప్రతి సంవత్సరం మే 15 వరకు గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తిస్తూ అధికారులు జాబితా ప్రకటించాలని, ప్రభుత్వ పథకాలు సబ్సిడీలు రైతులు అందించాలని, జిల్లాస్థాయిలో నోడల్ ఆఫీసర్ ను నియమించి కౌలు రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రతి ఏటా కౌలు రైతుల సంఘాలతో వ్యవసాయ శాఖ మంత్రి అఖిలపక్ష సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కరించాలని తీర్మానాలు చేశారు. జిల్లా కమిటీలో 15 మంది సభ్యులతో కమిటీని నియమించారు.

నీట్ పరీక్ష లీకేజీ పై సమగ్ర విచారణ జరిపించాలి

నవతెలంగాణ-ఖమ్మం



దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు వెంకటేష్, జిల్లా కార్యదర్శి మస్తాన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు ఆసిఫ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బసిరుద్దీన్, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్ కుమార్, పివైఎల్ రాష్ట్ర నాయకులు మంద సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఖమ్మంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు సుధాకర్, లక్ష్మణ్, రాకేష్ ,నాగరాజు, రోహిత్ ,అయ్యప్ప, రాజు, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.



అరెస్టులను నిరసిస్తూ ఖమ్మం ఖానాపురం స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు (ఫైల్)

'అక్రమ'బద్ధీకరణపై ఉక్కుపాదం

59 జీవోను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ స్థలాల కబ్జాకు యత్నం

- ఖమ్మంలో కొనసాగుతున్న కేసులు, అరెస్టులు
- ఇప్పటికే బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇద్దరు అరెస్టు
- రెండు జీవోల కింద తిరస్కరించిన
- దరఖాస్తులే ఎక్కువ
- రాజకీయాలకు అతీతంగా చర్యలు
- తీసుకోవాలి: సీపీఐ(ఎం)

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ స్థలాల్లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని అనేక ఏళ్లుగా ఉంటున్న వారి భూములను రెగ్యులరైజ్ చేయటం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెంబర్ 58, 59లను తీసుకొచ్చింది. రెండు విడతలుగా దరఖాస్తులు ఆహ్వానించింది. దీన్ని అడ్డుపెట్టుకుని విలువైన ప్రభుత్వ స్థలాలను కాజేయాలని అక్రమార్కులు పన్నాగం పన్నారు. ఖమ్మంలో విలువైన స్థలాలను కొట్టివేసేందుకు కొందరు 'అక్రమ'బద్ధీకరణకు పూనుకున్నారు. తమవి కాని ప్రభుత్వ స్థలాలను తమవిగా చూపించి కాజేసేందుకు యత్నించారు. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అర్జీలు అధికంగా రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంపై ఫోకస్ చేసింది. ప్రభుత్వ భూముల స్వాహాపర్వం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది.

'అక్రమ'బద్ధీకరణతో అరెస్టులు...

జీవో 59 ప్రకారం 'అక్రమ'బద్ధీకరణకు పూనుకున్నందుకు గాను ఖానాపురం హవేలీ పోలీసులు ఖమ్మం నగరపాలక సంస్థ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణతో పాటు మరో ఇద్దరిపై పీడీపీపీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఖానాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 94లో ఒకరు 7,200 గజాలు, మరొకరు 2,400 గజాల స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేశారు. పాకబండ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 86/ఇలో 500 గజాల స్థలాన్ని స్థలాన్ని రెగ్యులరైజ్ చేయడం కోసం కార్పొరేటర్ కృష్ణ దరఖాస్తు చేయగా అధికారులు తిరస్కరించారు. తమవి కాని స్థలాన్ని తమవిగా పేర్కొంటూ ప్రభుత్వ అధికారులను పక్కదోవ పట్టించారని స్థానిక తహశీల్దార్ స్వామి ఈనెల 17న ఖానాపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ముగ్గుర్నీ అరెస్టు చేశారు. జీవో 59 కింద ఇలాగే ప్రభుత్వ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆయన భార్య కార్పొరేటర్ శ్రీవిద్య పైనా కేసులు నమోదయ్యాయి. నాగరాజును అరెస్టు చేసి కొద్దిరోజుల పాటు ఖమ్మం జిల్లా జైల్‌లో ఉంచారు. ఆ తర్వాత బెయిల్‌పై రిలీజ్ అయ్యారు. ఇంకా అనేక మంది జీవోలను అడ్డుపెట్టుకుని అక్రమ పద్ధతుల్లో క్రమబద్ధీకరణ చేసుకున్నట్లు ఆరోపణలు వస్తుండటంతో ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. 'తీగలాగితే డొంక కదిలిన' చందంగా దురాక్రమణలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి. ఇంకా నగరంలో మరో 18 మంది పైనా రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మరిన్ని అరెస్టులు తప్పకపోవచ్చని జనం చర్చించుకుంటున్నారు.

అప్రూవైన వాటిలోనూ దురాక్రమణలే..!

అప్రూవైన వాటిలోనూ దురాక్రమణలే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా ఉన్న అనేక మంది విలువైన స్థలాలను కబ్జా చేసి, తప్పుడు ధ్రువీకరణలతో క్రమబద్ధీకరించుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జీవో 58, 59లను అడ్డుపెట్టుకుని రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను రెగ్యులరైజ్ చేయించుకున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, రాజకీయాలకు అతీతంగా విచారణ జరిపి ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కమిటీ
గణేశ్, ఆర్డీవో, ఖమ్మం

ఖమ్మంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించిన స్థలాల చుట్టూ కంచె వేశాం. బోర్డులు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలు అమర్చి ఆక్రమణలు జరగకుండా పరిరక్షిస్తున్నాం. ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశాం.

తిరస్కరించిన దరఖాస్తులే ఎక్కువ... ఖమ్మంలోనే అధికం

ప్రభుత్వ భూముల్లో స్థిరనివాసం ఉంటున్న వారి స్థలాలను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం రెండు విడతలుగా దరఖాస్తులు ఆహ్వానించింది. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో వచ్చిన అర్జీల్లో అధిక భాగం తిరస్కరణకు గురయ్యాయి. నిబంధనలకు లోబడి లేకపోవడంతో ముఖ్యంగా ఖమ్మం నగరంలో అధికంగా దరఖాస్తులను రిజెక్ట్ చేశారు. జిల్లాలో జీవో 59 కింద తొలివిడత 5,219 అప్లికేషన్‌లు రాగా వీటిలో 1,586 దరఖాస్తులనే అధికారులు ఆమోదించారు. 2,755 దరఖాస్తులను తిరస్కరించారు. 878 పెండింగ్‌లో ఉన్నాయి. ఖమ్మం అర్బన్ మండలంలో అత్యధికంగా 1,268 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 283 మాత్రమే అప్రూవ్ అవ్వగా 675 దరఖాస్తులను తిరస్కరించారు. 310 పెండింగ్‌లో ఉన్నాయి. ఖమ్మం రూరల్‌లో 141 దరఖాస్తులకు 91 రిజెక్టు అయ్యాయి. రఘునాథపాలెంలో 74 అర్జీలకు కేవలం మూడు మాత్రమే నిబంధనలకు లోబడి ఉన్నాయి. 58 జీవో కింద వచ్చిన దరఖాస్తులు 9,398కి గాను 5,335 తిరస్కరించారు. 810 దరఖాస్తులను 59 జీవో కిందకు బదలాయించారు. రెండో విడత 59 జీవో కింద 1939 దరఖాస్తులు రాగా కేవలం 362 మాత్రమే నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి. 477 పెండింగ్‌లో ఉన్నాయి. 1,100 దరఖాస్తులను తిరస్కరించారు. ఖమ్మం అర్బన్‌లో 367 దరఖాస్తులకు 253, ఖమ్మం రూరల్‌లో 203 అప్లికేషన్‌లకు 150 తిరస్కరణకు గురయ్యాయి. విలువైన ప్రభుత్వ స్థలాలున్న ప్రతీ చోటా తమవి కాకపోయినా తమవని చెప్పి అనేక మంది దరఖాస్తులు చేశారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నాలుగింటా మూడువంతులు రిజెక్టు అయ్యాయి. పెండింగ్‌లో ఉన్నవాటిలోనూ అనేకం తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది.

నేటి నుంచి సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులు

బోనకల్ : మండల పరిధిలోని జానకిపురంలోనే తేజ ఫంక్షన్ హాలు నందు సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీలలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు తెలిపారు. 21న ఉదయం వర్తమాన రాజకీయ పరిస్థితులు అనే అంశాన్ని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మధ్యాహ్నం ఆర్థిక విధానాలు అనే అంశాన్ని జిల్లా నాయకులు బండారు రమేష్ బోధిస్తారని తెలిపారు. 22న మతం - మతోన్మాదం అనే అంశాన్ని జిల్లా నాయకులు బోడపట్ల రవీందర్ మధ్యాహ్నం పార్టీ నిర్మాణం అనే అంశాన్ని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు బోధిస్తారని ఆయన తెలిపారు. పార్టీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

22, 23న సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులు

ముదిగొండ : సీపీఐ(ఎం) మండల రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 22, 23 తేదీలలో ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో నిర్వహించినట్లు సీపీఐ(ఎం) కార్యదర్శి బట్టు పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న క్లాసులు ప్రారంభసభతోపాటు, ఉదయం వర్తమాన రాజకీయాలు అనే అంశంపై సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు క్లాసు బోధించనున్నారు. మధ్యాహ్నం మతం, మతోన్మాదం అనే అంశంపై బోడపట్ల రవీందర్ క్లాసు బోధిస్తారు. 23న ఆర్థిక విధానాలు అనే అంశంపై సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ బోధిస్తారు. పార్టీ నిర్మాణంపై మండల కమిటీ కార్యదర్శి బట్ట పురుషోత్తం మాట్లాడతారు. పార్టీ మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు, శాఖ సభ్యులు, అధిక సంఖ్యలో హాజరై రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పౌరులకు చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మం లీగల్ : వివిధ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున ఛీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటేడ్ డెవలప్ మెంట్ సంస్థ వారు నిర్వహించిన కార్యక్రమంలో వివరించారు.కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలతులను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం, అట్టడుగు వర్గాల వారికి, సంవత్సర ఆదాయం 3 లక్షల లోపు ఉన్నవారికి, ఉచితంగా ప్రభుత్వ న్యాయవాదని నియమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ యం. వలరాజు, ఏఐడి సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ హరి ప్రసాదరావు, కో ఆర్డినేటర్స్, కె. శ్రీనివాస్, రాజేష్ మరియు సంస్థ టీం మెంబర్స్ పాల్గొన్నారు.

నీట్ పరీక్ష లీకేజ్ నిందితులను కఠినంగా శిక్షించాలి

- సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి
- లీకేజ్ పై నరేంద్ర మోడీ బాధ్యత వహించి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా డిమాండ్
- సరిత క్లినిక్‌సెంటర్‌లో నిరసన

నవతెలంగాణ-ఖమ్మం

నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, నిందితులను శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం సరిత క్లినిక్ సెంటర్లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష లీకేజ్‌కి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ నుండి నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ పరీక్ష లీకేజీపై తక్షణమే నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించి నిందితులపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. నీట్ పరీక్ష రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని ఆయన అన్నారు. దేశ భవిష్యత్తుతో మోడీ చలగాటమాడడం సరికాదన్నారు. దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే విద్యార్థుల పరీక్షలలో పద్ధతులు వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నటువంటి రాష్ట్రాల్లోనే ఎందుకు పేపర్ లీకేజీలు అవుతున్నాయని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా పరీక్ష కన్నా ముందే పేపర్ల లీకేజ్ అవుతుంటే ఆట బొమ్మలాడుతున్నట్లుగా వ్యవహరించే తీరు సరైన పద్ధతి కాదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. దేశంలో మోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసి మాయల పకీరు మాటలు చెప్పుతూ పూట గడపాలని చూస్తూ ఉండడం సరికాదన్నారు. ఇప్పటికైనా నీట్ పరీక్షను రద్దుచేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, కొండబోయిన నాగేశ్వరరావు, తాళ్లపల్లి కృష్ణ, పిన్నింటి రమ్య, ఎస్.కె.బషీర్, ఆర్.ప్రకాష్, జిల్లా నాయకులు వజినేపల్లి శ్రీనివాసరావు, బండారు యాకయ్య, పి.నాగసులోచన, అమరావతి, వత్సవాయి జానకిరాములు, తుడుం ప్రవీణ్, చింతల రమేష్, పడిగల నాగేశ్వరరావు, గద్దల రత్తమ్మ, దాసరి నాగేశ్వరరావు, ఎస్.కె.సైదులు, రావులపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



'నవరస ఫుడ్ కోర్ట్' నిర్వాహకులకు నోటీసులు



ఆర్ అండ్ బి స్థలంలో నిర్వహిస్తున్న నవరస ఫుడ్ కోర్ట్

- నీటిపారుదల శాఖ, గ్రామపంచాయతీల నుంచి నోటీసులు జారీ
- నవతెలంగాణ కథనంతో అధికారుల స్పందన

నవతెలంగాణ - బోనకల్

నవరసా ఫుడ్ కోర్ట్ నిర్వాహకులకు బోనకల్ నీటిపారుదల శాఖ అధికారులు, బోనకల్ గ్రామపంచాయతీ నుంచి గురువారం నోటీసులు జారీ చేశారు. నవరసా ఫుడ్ కోర్ట్ నుంచి వెదజల్లుతున్న దుర్గంధం అనే కథనం నవతెలంగాణ దినపత్రికలో ఈనెల 18వ తేదీన ప్రచురితమైంది. ఈ కథనంతో అధికారులు చలనం కలిగింది. నవరస ఫుడ్ కోర్టు నిర్వాహకులు వినియోగించిన వ్యర్థాలను, మురికి నీటిని రహస్యంగా శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలస్ ప్రహరీ గోడ లోపల నుంచి పైపుల ద్వారా నారాయణపురం- 2 మైనర్ లోకి కలిపారు. దీంతో ఆ వ్యర్థాలు మురిగి కాల్వకి వెళ్లిన మురుగనీరు నిల్వ ఉండే పెద్ద ఎత్తున దుర్వాసన వెదజల్లుతుంది. శ్రీ దుర్గా పిక్చర్ ప్యాలెస్ నిత్యం ప్రయాణికులు, ప్రజలతో కలకలలాడుతుంటది. ప్రతిరోజు వందలాదిమంది ప్రయాణికులు ఇక్కడే బస్సులు, ఆటోల కోసం వేసి ఉంటారు. కనీసం పావుగంట కూడా అక్కడ నిలబడలేని పరిస్థితి. పెద్ద ఎత్తున దుర్వాసన వస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయింది. పైగా నవరసా ఫుడ్ కోర్ట్ గదులను కూడా ఆర్ అండ్ బీ స్థలంలో నిర్మించారు. నిత్యం నవరసా ఫుడ్ కోర్ట్ వద్దకు జనం పెద్ద ఎత్తున ఉదయం వస్తుండటంతో రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం కలుగుతుంది. అనేక ద్విచక్ర వాహనాల ప్రమాదం జరిగాయి. అయినా అధికారులలో చలనం లేకుండా పోయింది. ప్రయాణికుల, ప్రజల, రాకపోకలకు అంతరాయం, తరచూ ప్రమాదాలకు నిలయం అంటూ నవతెలంగాణ దినపత్రికలో వార్తా ప్రచురితమైంది. నవతెలంగాణ కథనంతో అధికారులు కథనరంగంలోకి దిగారు. నీటిపారుదల శాఖ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు నవరస ఫుడ్ కోర్ట్ వ్యర్థాలను, మురికి నీటిని పైపుల ద్వారా కాల్వలోకి వదిలిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆ వెంటనే నోటీసులు జారీ చేశారు. మూడు రోజులలో నారాయణపురం-2 మైనర్ లోకి అక్రమంగా వేసిన పైపులను తొలగించాలని కోరారు. లేనియెడల ఇరిగేషన్ యాక్ట ప్రకారం మీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఏఈ కూరపాటి రాజేష్ ఆ నోటీసులో పేర్కొన్నారు. అదేవిధంగా బోనకల్ గ్రామపంచాయతీ కార్యదర్శి దామల్ల కిరణ్ కూడా నవరసా ఫుడ్ కోర్టు నుంచి దుర్వాసన వస్తుందని, దీనివలన ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే ప్రమాదం ఉందని వెంటనే వాటిని తొలగించాలని నోటీస్ అందజేశారు. నోటీస్ అందిన వెంటనే తగువిధంగా స్పందించకపోతే పంచాయతీరాజ్ చట్టప్రకారం మీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీసుకు సంబంధించి సమాచార నిమిత్తం తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ, బోనకల్ గ్రామపంచాయతీలకు సమాచార నిమిత్తం పంపించినట్లు రాజేష్ తెలిపారు.



నవతెలంగాణ దినపత్రిక ప్రసరించిన వార్తా కథనం

ఎన్‌టీఏను తక్షణమే రద్దు చేయాలి

నవతెలంగాణ-వైరాటౌన్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వైరా డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక బోడేపూడి భవనంలో హేమంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ జాతీయ పరీక్షలను నిర్వహించడంలో ఎన్.టి.ఎ, విద్యా మంత్రిత్వ శాఖ బాధ్యతా రాహిత్యాన్ని ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ఎన్.టి.ఎ ప్రారంభం నుండి మొత్తం విద్యా వ్యవస్థను అపహాస్యం చేస్తోందని, దేశంలో పరీక్షల నిర్వహణలో పూర్తిగా అసమర్థంగా ఉందని, నీట్ పేపర్ లీక్, సియుఇటీ పరీక్షలో పొరపాట్లు, తాజాగా యుజీసీ నెట్ 2024 పరీక్ష సమగ్రంగా నిర్వహించడంలో వైఫల్యం ఎన్టిఎ బాధ్యత రాహిత్యానికి, రాజీ ధోరణికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కోట ప్రేమ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు హేమంత్, అజయ్, డివిజన్ కమిటీ సభ్యులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

NAME CHANGE

I, **MOHAMMAD AFROZ KHAN** S/o. **Khairulla Khan, H.No : 8-4-116,** Rathi Banda Bazar, Khammam,T.S. In my pasport bearing no G4096672 my name was recorded as **MOHAMMED AFROZ KHAN** actually as per Aadhar my name is **MOHAMMAD AFROZ KHAN** for all purpose..

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఖమ్మం
హెచ్.ఎం.ఒ.పి. నెం. 165/2023

బిట్వీన్ :
బత్తుల రజిత అలియాస్ బండి రజిత ....పిటీషనర్
మరియు
బండి కృష్ణ .....రెస్పాండెంట్

టు,
బండి కృష్ణ, తండ్రి : పాసకాలు, వయస్సు : 46 సం.లు, వృత్తి : కూలి, నివాసం : రిమ్మారావుపేట గ్రామము, ఏన్కూరు మండలం, ఖమ్మం జిల్లా.

ఇందుమూలముగా నీకు తెలియ జేయునది ఏమనగా బత్తుల అలియాస్ బండి రజిత నీపై ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు విడాకుల కేసు వేసి యున్నారు. కానీ నీవు ఎన్నిసార్లు కోర్టు నోటీసులు మరియు రిజిస్టర్డ్ పోస్టులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నావు. **కావున నీవు ది. 24.07.2024న ఉ.గం. 10.30 ని॥లకు** పైన తెలిపిన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు నీవు గాని, నీ తరఫున న్యాయవాది గాని హాజరు కాగలరు. లేనిచో నీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.
(కోర్టు వారి అనుమతితో)

ఇట్లు
పసుపులేటి యాకయ్య
న్యాయవాది, ఇల్లందు.
ఇల్లందు క్యాంపు:ఖమ్మం.
ది.20.6.2024 సెల్ : 9912166358

ముగ్గురు మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-వేంసూరు

అసాధ్యమైన ఎగ్జిట్ సాధ్యం చేసి ఇచ్చిన హామీని నెరవేర్చుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు మండల ప్రజలు కతజ్ఞతలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎగ్జిట్ పాయింట్ వద్ద మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎగ్జిట్ మంజూరు చేసిన తర్వాతే మీ మండలానికి వస్తానని హామీ ఇచ్చి హామీ నెరవేర్చడం పట్ల మండల ప్రజలు మంత్రి తుమ్మలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎగ్జిట్ మూలంగా అశ్వరావుపేట, దమ్మపేట, సత్తుపల్లి మండల ప్రజలకు ప్రయాణానికి అనువుగా ఉంటుందని అన్నారు. గురువారం అధికారికంగా జీవో రావడంతో మండల ప్రజల ఆనందానికి అవధులు లేవు. 2021 నుండి ఎగ్జిట్ కొరకు పోరాటం నిర్వహిస్తూనే ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, సోమిరెడ్డి, తక్కెళ్ళపాటి గోపాలకృష్ణ, వెల్ది జగన్ మోహన్‌రావు, కొత్త సత్యనారాయణ, మోరంపూడి వెంకటేశ్వరరావు, గన్నేని, సురేష్, మందపాటి రాఘవరెడ్డి, ఫైజుద్దీన్, వేణు తదితరులున్నారు



ఎన్‌టీఏని తక్షణమే రద్దు చేయాలి

- అవకతవకలపై అధికారులపై విచారణ జరపాలి
- విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం

ఎన్‌టిఏని తక్షణమే రద్దు చేయాలని, వరుస పరీక్షల అవకతవకలపై ఎన్‌టిఎ అధికారులపై విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవనంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ జాతీయ పరీక్షలను నిర్వహించడంలో ఎన్‌టిఏ విద్యా మంత్రిత్వ శాఖ అత్యంత బాధ్యతారాహిత్యాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఎన్‌టిఏ ప్రారంభం నుండి మొత్తం విద్యా వ్యవస్థను అపహాస్యం చేస్తుందని, దేశంలో పరీక్షల నిర్వహణలో ఎన్‌టిఏ పూర్తిగా అసమర్థంగా ఉందని, నీట్‌లో పేపర్ లీక్, సియుఈటి పరీక్షలో పొరపాట్లు ఇప్పుడు తాజాగా యుజిసి ఎన్ఈటి 2024 పరీక్ష సమగ్రంగా నిర్వహించడంలో వైఫల్యం ఎన్‌టిఏ బాధ్యతారాహిత్యానికి, దాని రాజీధోరణికి నిదర్శనమన్నారు. ఇటీవలి నీట్ పరీక్ష లీక్ దాని చుట్టూ కొనసాగుతున్న వివాదాల తర్వాత కూడా పరీక్ష రద్దు జరిగిందని, నిరంతర విద్యారంగంలో విభేదాల తీవ్రమవుతున్న నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ కనీసం నివారించే చర్యలు తీసుకోవడంలో విఫలం చెందిందని, అందుకే తక్షణమే విద్యాశాఖ మంత్రి బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని, పరీక్షలను కేంద్రీకృతం చేసి ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లను, సంస్థలను పెంచి, విద్యలో మతోన్మాదాన్ని పెంచే దృష్టితో ఎన్ఈపిలో భాగంగా ఎన్‌టిఏ సృష్టించడం వెనుక ఉన్న కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంగీత, జిల్లా ఉపాధ్యక్షులు వంకాయల రాజు, నగర నాయకులు వినోద్, మనోజ్, చరణ్, వెంకటేష్, అనూష, శివాని, భావన, నవ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరుడు మృతి

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలోని చెరువుమాదారం గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సానుభూతిపరుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పేరూరులోని డిసిసిబిలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న వాకదాని నరేష్(33) బుధవారం గుండెపోటుతో మరణించారు. అనంతరం ఆయన భౌతిక కాయాన్ని గురువారం వారి స్వగ్రామం చెరువుమాదారానికి తరలించారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, బిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కేవీ రామిరెడ్డి మాట్లాడుతూ వాకధాని నరేష్ కుటుంబం సిపిఐ(ఎం) పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. నరేష్ తండ్రి ఒకదాని శేషగిరిరావు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించి పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. నరేష్ ఆకస్మిక మరణం సిపిఐ(ఎం)కు, వారి కుటుంబానికి తీరని లోటన్నారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో పార్టీ నాయకులు మందడపు మురళీకృష్ణ, ఎర్రదేశి నరసింహారావు, అబ్దుల్ రహీం, ఎస్‌కె మజీదు, ఎస్‌కె నవాబు తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ

నవతెలంగాణ-ఎర్రుపాలెం



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ స్పష్టం చేశారు. ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా నియంత్రించేందుకు రాత్రి సమయాలలో గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయో వాటి నియంత్రణకై దృష్టి పెట్టాలన్నారు. కేసుల నమోదు విషయంలో తాత్సారం చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పండితాపురం సంత వేలంపాట వాయిదా

నవతెలంగాణ-కామేపల్లి

పండితాపురం గ్రామంలోని శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల సంత వేలం పాట ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో జిల్లా పంచాయతీ అధికారులు పాట వాయిదా వేశారు. ఎన్నికల కోడ్ అనంతరం సంత ప్రాంగణంలో గురువారం గ్రామ ప్రత్యేక అధికారి రవీందర్ అధ్యక్షతన సంత వేలంపాట నిర్వహించారు. సంత వేలం పాట పాడేందుకు గ్రామానికి చెందిన భూక్య వీరన్న, బానోతు శంకర్ ఒక్కొక్కరు 35లక్షలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొన్నారు. అయితే ప్రభుత్వం మద్దతు ధర 1,84,70,646 ప్రకటించగా పాటదారులు ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా భూక్య వీరన్న కోటి 30 లక్షలకు పాడడంతో మద్దతు ధర రాకపోవడంతో అధికారులు పాటను వాయిదా వేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరల పాటను నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్పివో ఆదిలక్ష్మి, సిఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, వివిధ మండలాల ఇవో ఆర్డీలు, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.



నూతన పద్ధతిలో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాబోధన

సీడీపీఓ కమల ప్రియ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నూతన పద్ధతిలో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాబోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఐసీడిసి సీడీపీఓ చావా కమలప్రియ తెలిపారు. ఖమ్మంరూరల్ మండలంలోని మద్దులపల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం నవీకరించిన పూర్వ ప్రాథమిక విద్యా విధానం పైన మాస్టర్ ట్రైని శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. షకీరా మహిళా ప్రాంగణ ఇన్స్ట్రక్టర్ హిమబిందు, బ్లాక్ కో-ఆర్డినేటర్ షామిలి నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో సీడీపీఓ చావా కమల ప్రియ మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో నవీకరించిన విద్యా విధానంలో చిన్నారులకు బోధన చేయడం జరుగుతుందని, ఈ నవీకరణ విధానంపై అన్ని ప్రాజెక్టుల నుంచి ఒక్కొక్క సూపర్వైజర్ శిక్షణ తీసుకొని వచ్చారని వారి ద్వారా ప్రాజెక్టులోని మిగిలిన సూపర్వైజర్స్, అంగన్వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఉషారాణి, సూపర్వైజర్లు సంధ్యారాణి, అరుణ, జ్యోతి, సువర్చల, సావిత్రి, రాజకుమారి, లక్ష్మి, అమ్మన్ రాజా, విజయలక్ష్మి, గీత, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేత

నవతెలంగాణ-వైరాటౌన్

ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైరాలోని రిలయన్స్ ట్రెండ్స్ వారు అవార్డులు, మెడల్స్, సర్టిఫికేట్లు, ప్రోత్సహకాలను అందించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం...

- రూ.21.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ - బోనకల్ (చింతకాని)

తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమమే కాకుండా వారు ఆశించిన చిరకాల వాంఛని నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండల పరిధిలోని నాగులవంచ, తిమ్మినేనిపాలెం గ్రామాల్లో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగులవంచ నుండి తిమ్మినేనిపాలెం వరకు 6 కోట్లా 75 లక్షలు, నాగులవంచ నుండి పోలంపల్లి వరకు 5 కోట్లు 50 లక్షలు తిమ్మినేనిపాలెం నుండి చిన్న మండవ, పోలంపల్లి వరకు 9 కోట్లు, నాగులవంచ నుండి పోలంపల్లి వరకు 5 కోట్లా 50 లక్షలు మొత్తం 21 కోట్ల 25 లక్షల రూపాయల పంచాయతీరాజ్ నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగులవంచలో ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివద్ధికై అధిక నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నిధుల కొరత ఉన్నా రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తున్నామన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మల్లు భట్టివిక్రమార్కకు మండల ప్రజలు, మహిళలు బ్రహ్మరథం పట్టారు. మండల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం తీసుకువచ్చిన దరఖాస్తులను స్వీకరించి త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎంపీపీ కోపూరి పూర్ణయ్య ,వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు ,డిసిసి అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు మండల నాయకులు మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, బందెల నాగార్జున, కన్నబోయిన గోపి, షేక్ అబ్దుల్, వంగూరి రమేష్, కూరపాటి రాము, ఇనుకుళ్ళ దివాకర్ రెడ్డి , వివిధ గ్రామాల చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనులకిచ్చిన హామీల అమలుకు ఉద్యమాలు

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్, జిల్లా కార్యదర్శి భుక్యా వీరభద్రం పిలుపు
- గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు ప్రారంభం



నవతెలంగాణ-వైరాటౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీల అమలు కొరకు త్వరలో రాష్ట్రస్థాయి ఉద్యమాలను నిర్వహిస్తామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా పట్టణంలోని వరుచూరి ఫంక్షన్ హాల్‌లో గురువారం బానోత్ బాలాజీ అధ్యక్షతన గిరిజన సంఘం రాష్ట్రస్థాయి ప్రాంతీయ శిక్షణా తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. సంఘం జెండాను సీనియర్ నాయకులు గుగులోత్ పంతు నాయక్ ఆవిష్కరించారు. అమరజీవి గుగులోతు ధర్మా నాయక్, భూక్యా జగ్యి నాయక్‌లకు సంతాపం ప్రకటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ తరగతులకు ముఖ్య అతిథులుగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్, ఖమ్మం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం హాజరై మాట్లాడారు. వర్షాకాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న పోడు భూముల హక్కు పత్రాలను పంపిణీ చేయడానికి కార్యాచరణ రూపొందించాలని, పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనులపై దాడులు ఆపాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. శిక్షణా తరగతుల సందర్భంగా గిరిజన సంఘం వ్యవస్థాపక నాయకులు గుగులోత్ ధర్మా నాయక్, భూక్యా జగ్యా నాయకులకు హాజరైన ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బానోత్ బన్సీలాల్, భూక్యా జ్యోతి, భూక్యా కృష్ణ నాయక్, వాంకుడోత్ అమర్ సింగ్, కునుసోత్ షణ్ముఖ్, భానోత్ వెంకన్న, మాళోత్ కిషన్, గుగులోత్ వంతు నాయక్, భూక్య శ్రీనివాస నాయక్, బానోతు మధు, భూక్యా విజయ, ఎస్ అశ్వని, భూక్య కృష్ణ, బానోత్ హరిచంద్, అజ్మీర శోభన్ నాయక్, బానోత్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ...ప్రశ్నిస్తే అరెస్టులే.!...

- తెలంగాణ కౌలు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మాదినేని రమేష్



నవతెలంగాణ- తల్లాడ

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, వారికి వ్యతిరేకంగా మాట్లాడితే అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలంగాణ కౌలు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మాదినేని రమేష్ అన్నారు. మండలంలో సీపీఐ(ఎం)ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. స్థానిక దొడ్డ కృష్ణయ్య భవన్‌లో మండల స్థాయి రెండు రోజుల రాజకీయ శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సీపీఐ(ఎం) కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతులను చేసి బిజెపి విధివిధానాలను వివరించి బిజెపికి వ్యతిరేకంగా కార్యోన్ముఖులను చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు ప్రకటించి రెండు పథకాలనే అమలు చేస్తుందన్నారు. పథకాలు అమలయ్యే వరకు పోరాడాలి అన్నారు. బీఆర్ఎస్ ఓట్లు బిజెపికి మళ్లాయని ఈ పరిణామం మంచిది కాదన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ మాచర్ల భారతి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సిపిఎం మాత్రమే అన్నారు. గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేయాలని, స్తబ్దత విడనాడాలని సూచించారు. అకడామిక్ సెల్ బాధ్యులు బండారు రమేష్ ఆర్థిక, రాజకీయ పరిస్థితిపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, కృష్ణయ్య, పులి వెంకట నరసయ్య, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజె(ఐజెయు) రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విరాహత్ ఆలీ, కె.రాం నారాయణ

నవతెలంగాణ- ఖమ్మం



టియూడబ్ల్యూజె(ఐజెయు) రాష్ట్ర కార్యవర్గాన్ని మహాసభలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలోనే రాష్ట్ర అధ్యక్షుడిగా కె.విరాహత్ అలీని ఎన్నుకున్నారు. ఖమ్మంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర మహాసభల్లో మిగతా కమిటీని ఎనుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాం నారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు ముగ్గురు, కార్యదర్శులు ముగ్గురిని, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా 16 మందిని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.విరాహత్ అలీ, ఉపాధ్యక్షులుగా 1. గాడిపల్లి మధు (వరంగల్), 2. ఎంఏకె ఫైసల్(సంగారెడ్డి), 3. బి.సంపత్‌కుమార్ (పెద్దపల్లి), ప్రధాన కార్యదర్శిగా కె.రాంనారాయణ (ఖమ్మం), కార్యదర్శులుగా 1. కె.శ్రీకాంత్‌రెడ్డి (సంగారెడ్డి), 2.జి.మధుగౌడ్(వనపర్తి), 3.వి.యాదగిరి (హైదరాబాద్), కోశాధికారిగా ఎం.వెంకట్‌రెడ్డి (మేడ్చల్), కార్యవర్గసభ్యులుగా ఎం.వేణుగోపాలరావు (ఖమ్మం), పి.వేణుమాధవరావు (హన్మకొండ), ఆర్.ప్రకాష్‌రెడ్డి (మంచిర్యాల), ఎం.కర్ణయ్య (నాగర్‌కర్నూల్), జి.శ్రీనివాస్‌శర్మ (మెదక్), పి.ప్రభాకర్‌రెడ్డి (నల్గొండ), సయ్యద్ అబ్దుల్ లతీఫ్ (కామారెడ్డి), జె.సురేందర్‌కుమార్ (జగిత్యాల), ఏ.రవీందర్(కరీంనగర్), ఏ.రాజేష్ (హైదరాబాద్), కె.రాజిరెడ్డి (సిద్దిపేట), సయ్యద్‌గౌస్ మోహియుద్దీన్ (హైదరాబాద్), కె.అనిల్‌కుమార్ (హైదరాబాద్), చలసాని శ్రీనివాసరావు (సూర్యాపేట), కంకనాల సంతోష్ (హన్మకొండ), గుడిపెల్లి శ్రీనివాస్ (రంగారెడ్డి) ఎన్నుకున్నారు.

మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ గురువారం ఖమ్మంలోని ఉదయం ఉషాహరి కన్వెన్షన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు అకాడమీ చైర్మన్ సూచించారు. పది రోజుల్లో ఇళ్లస్థలాలను అందచేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షునిగా కరామత్ అలీ

నవతెలంగాణ-కొణిజర్ల



రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ), తెలంగాణ ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా షేక్ కరామత్ అలీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఉన్న జిల్లా అధ్యక్షుడైన వేముల మాధవరావు ఉద్యోగ విరమణ చేయడంతో నూతన కొత్త అధ్యక్షుడిగా మండలం పరిధిలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కరామత్ అలీని జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కరామత్ ఆలీని మండల ఎస్టీయూ బాధ్యులు దొడ్డా వెంకటేశ్వరరావు, నరసింహారావు, సైదా పల్లాచారి, జానకిరాణి, పద్మావతి, విజయశీల, అల్తాఫ్, నాగమణి, సమత, సంధ్య తదితరులు కరామత్‌ను అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ- బోనకల్(చింతకాని)

చింతకాని తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి పెండింగు దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ స్లాట్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు సంబంధించి ఎటువంటి సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచవద్దని రెవిన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయం పాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న మందులు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం చింతకానిలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నారు, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా లేరా అని అంగనవాడి కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

అనాధ బాలుడికి శ్రీ రామకృష్ణ విద్యాలయంలో ఉచిత విద్య

నవతెలంగాణ-ఖమ్మం


గుట్టల బజార్‌లోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో ఒక అనాధ బాలుడికి ఉచిత విద్యను అందించేందుకు శ్రీ రామకృష్ణ విద్యాలయం ముందుకొచ్చింది. అన్నం ఫౌండేషన్ అన్నం శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు తమ ఆశ్రమంలో పెరిగి వారిచే రాఘవ అని నామకరణం చేయబడిన బాలుడికి శ్రీ రామకృష్ణ విద్యాలయంలో డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉచిత విద్యను అందించేందుకు ముందుకు వచ్చారు. సంస్కృతి సంప్రదాయాలకు, దేశ భక్తికి నిలవైన విద్యాలయం 1966లో స్థాపితం అయిన శ్రీ రామకష్ణ విద్యాలయంలో ఈ నాటికి అవే విలువలతో కూడిన ఆధునిక విద్యను అందిస్తూ ఎంతో సేవా భావంతో అనాధ బాలుడికి ఉచిత విద్యను ఇచ్చిన పాఠశాల ప్రశంసనీయం అని, ఇక్కడ చదివిన ఎందరో పూర్వ విద్యార్థులు ఇప్పటికీ మంచి బుద్దులతో జీవిస్తున్నారని అన్నం శ్రీనివాస రావు కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, రాయన అచ్యుత్, గుంటి అశోక్, పాఠశాల ప్రధానాచార్యులు కాందిరాజు పాల్గొన్నారు.

ప్రజాహితం కోసం జర్నలిస్టులు పాటుపడాలి

- ప్రపంచానికి జ్ఞానం నేర్పేవి పత్రికలే
- టియూడబ్ల్యూజె రాష్ట్ర మహాసభల్లో మంత్రులు భట్టి, తుమ్మల, ఎంఎల్ఏ కూనంనేని

నవతెలంగాణ- ఖమ్మం

ప్రజాహితం కోసం జర్నలిస్టులు పాటుపడాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని ఉషా హరి కన్వెన్షన్‌లో అమర్‌నాథ్ ప్రాంగణంలో టియూడబ్ల్యూజె(ఐజెయు) రాష్ట్ర మహాసభల్లో మంత్రి మాట్లాడుతూ జర్నలిజం కత్తి మీద సాము లాంటిదన్నారు. నీతి నిజాయితీతో పనిచేస్తే ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవన్నారు. జర్నలిస్టులు దారి తప్పితే సమాజానికే ప్రమాదకరమన్నారు. యాజమాన్యాలు ఒత్తిడి చేసినా వృత్తిలో నిఖార్సయిన జర్నలిస్టులు ఇంకా పని చేస్తూనే ఉన్నారన్నారు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో జర్నలిస్టులు ఎంతో సహకరించారని, వారి రుణం మరిచిపోనని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ మంత్రిగా పనిచేసే అవకాశం దక్కిందని, గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్య శ్యామలం చేయడమే నా రాజకీయ లక్ష్యమని, ఆ



దిశగా సాగుతున్న తన ఎదుగుదలలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. జర్నలిస్టుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సానుకూలంగా ఉన్నారన్నారు. జర్నలిస్టుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. భావస్వేచ్ఛకు తమ ప్రభుత్వంలో భంగం కలగదని నిర్మాణాత్మకమైన విమర్శ అవసరమని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మీడియా భద్రత కోసం ఒక చట్టాన్ని తీసుకరావాలనే మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచనతో తాను ఏకీభవిస్తున్నానని, ఆ చట్టాన్ని తెచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. పేదలందరికీ ఇల్లు, విద్య వైద్యం ఉచితంగా అందించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని విక్రమార్క పేర్కొన్నారు. జర్నలిస్టుల ఇళ్లస్థలాల కేటాయింపు త్వరలోనే జరుగుతుందని హామీ ఇచ్చారు.

పత్రికలు ప్రపంచానికే జ్ఞానం ఇస్తాయని, అలాంటి బహత్తరమైన వ్యవస్థలో పనిచేసే జర్నలిస్టులకు కనీస వేతనం ఇచ్చేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఖమ్మంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర మూడవ మహాసభల్లో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తిలో ఉన్న వ్యక్తులు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. గ్రామీణ జర్నలిస్టు నుంచి పట్టణాల్లో పని చేస్తున్న వారి వరకు ఇల్లు, వైద్యం అందించాలని, ఆ విధంగా ప్రభుత్వాలు ఆలోచించాలని ఆయన సూచించారు. ఉండీ లేని జీతాలతో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ తమ జీవితాలు గడుపుతున్నారని అన్నారు. పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో ఉందని, ఎన్డి టీవీ లాంటివే మూసేసే పరిస్థితులు వచ్చాయని, నిజాలను నిజాయితీగా రాసే జర్నలిస్టులపై దాడులు కూడా జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఇబ్బందులను తట్టుకొని సురవరం ప్రతాపరెడ్డి వంటి జర్నలిస్టు యోధులను ఆదర్శంగా తీసుకొని ఆ వారసత్వాన్ని ప్రస్తుత జర్నలిస్టులు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి జర్నలిస్ట్ అధ్యయనం పెంచుకోవాలన్నారు. తాను విశాలాంధ్ర దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేసిన రోజులను, తన గురువు రాఘవాచారి, శ్రీనివాస్‌రెడ్డిలను ఆయన గుర్తు చేసుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల కోసం సాగే పోరాటంలో తమ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని ఆయన తెలిపారు. తాళ్లూరి పంచాక్షరయ్య ట్రస్ట్ బాధ్యులు వంశీ మాట్లాడుతూ ఏజెన్సీలో తమ ట్రస్ట్ చేస్తున్న సేవలకు జర్నలిస్టుల సహకారంతో ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి విరాహత్ అలీ, జాతీయ నాయకులు అమర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాంనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు కమర్తపు మురళీ, రావూరి సైదుబాబు, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, పాలెపు వెంకటరమణ, తుపాకుల ఎలగొండస్వామి, ప్రముఖ వస్త్ర వ్యాపారి గుర్రం ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com

విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్శాఖ ఎస్ఈ బికంసింగ్ మండల అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో విద్యుత్శాఖ అధికారులతో ఎస్ఈ బికంసింగ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రుగొండ సబ్ స్టేషన్ నుండి తిప్పనపల్లి మీదుగా పెనగడప గ్రామానికి ఫీడర్ లైన్ రూ.70లక్షలతో త్వరలో ఏర్పాటు చేయటం జరుగుతుందని, అధిక లోడ్ను తట్టుకునేందుకు సబ్స్టేషన్లో పాత బ్రేకర్ల స్థానంలో రూ.20 లక్షలతో రెండు కొత్త బ్రేకర్లు మంజూరైనాయన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా నల్లగోపు పుల్లయ్య



నవతెలంగాణ-సుజాతనగర్

కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా నల్లగోపు పుల్లయ్యను గురువారం నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీ లోకి ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన కౌలు రైతులకు రైతు భరోసా పథకం అమలు, గుర్తింపు కార్డులు వంటి సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

అక్రమ కట్టడాలు తొలింగించాలని వినతి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని యర్రగుంట గ్రామంలో ముక్కెర బజార్లో గల పంచాయితీ పైప్లైన్ తొలంగించి కొంత మంది అక్రమంగా ప్రహరి గోడ నిర్మించారని, ఆ అక్రమ కట్టడాలను తొలగించాలని రజక సంఘం అధ్యక్షురాలు శివకుమారి, జిల్లా అధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి ముసలయ్య ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల క్రితం పంచాయితీ పైపు లైన్ ఉందని, ఆ పైపు లైన్ పైన కొంతమంది వ్యక్తులు ప్రహరి గోడ నిర్మించారని, ఇదే రహదారి 12 అడుగులు ఉండటం గతంలో గ్రావెల్ పోయడం కూడా జరిగిందని, ఇప్పుడు ఆ రోడ్డు లేకుండా పోయిందని, వెంటనే రోడ్డు, పైపు లైన్, డ్రైనేజ్ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, భిక్షం, సత్యం, రాము తదితరులు పాల్గొన్నారు.



అన్నపురెడ్డిపల్లిలో పర్యటించిన కలెక్టర్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ జితిష్ వీ పటేల్ నూతన మండలమైన అన్నపురెడ్డిపల్లి మండలంలో తొలిసారిగా పర్యటించారు. మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్లో ఉన్న భూ సమస్యలు గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా మండల అభివృద్ధి కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం యర్రగుంట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల ఎంపిక కావడంతో అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. జాతీయ నులిపురుగులు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ చేశారు. పలు శాఖా అధికారులకు శాఖ పరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీష్ ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంఈఓ సత్యనారాయణ, హెడ్మాస్టర్ ఆనంద్కుమార్ పలుశాఖ అధికారులు పాల్గొన్నారు.

పీఈటీ నుండి పీడీగా అనిల్ కుమార్

నవతెలంగాణ-పినపాక



మండలంలోని జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీ గా పనిచేస్తున్న పీ.అనిల్ కుమార్ పీఈటీ నుండి ఫిజికల్ డైరెక్టర్గా పదోన్నతి పొందారు. ఈ పదోన్నతిలో భాగంగా జానంపేట నుండి మణుగూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామానుజవరం బదిలీపై వెళ్లనున్నారు. పదోన్నతికి సంబంధించిన నియామక పత్రంను జానంపేట ప్రధానోపాధ్యాయురాలు కారం విజయలక్ష్మి అనిల్ కుమార్కు అందించారు. అందరితో సమైక్యంగా ఉంటూ ఎంతో మంది విద్యార్థులను రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడలకు పరిచయం చేసిన అనిల్కుమార్ను పలువురు ప్రశంసించారు. పీఈటీ నుండి పీడీగా పదోన్నతి రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

- యువకుడు మృతి

నవతెలంగాణ-పినపాక

మండలంలోని ఐలపురం వద్ద చెట్టును ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం..బుధవారం అర్ధరాత్రి 11:30 గంటల సమయంలో బైకు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టడంతో అక్కడికక్కడే యువకుడు మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు పినపాక మండలం కిష్టపురం కొత్తూరు గ్రామానికి చెందిన మద్దెల సదీన్(23)గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు తరలించారు.



నియోజకవర్గ సమస్యలపై చర్యలు చేపట్టండి

- ఎమ్మెల్యే జారెకు యువ నాయకుల వినతి

నవతెలంగాణ-దమ్మపేట

నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో గల విద్యా, వైద్యం, పోడు భూములకు పట్టాలు మంజూరు, భూ వివాదాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆదివాసి యువనాయకులు అరేమ్ ప్రశాంత్, వాడే వీరాస్వామి వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే జారెను కలుసుకున్న వారు పలు సమస్యలు జారెకు వివరించారు. ముఖ్యంగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విద్య వైద్యం, పెండింగ్లో ఉన్నా పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, సుదీర్ఘంగా సాగుతున్న భూ వివాదాల విషయంలో కలెక్టర్, మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే జారే అన్నీ సమస్యలకు త్వరలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో పరిష్కారం చూపుతామని అన్నారు. వారితో పాటు కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తనగాల తిరుపతిరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దారా రంగారావులు ఉన్నారు.

రిపోర్టర్ పై కొడవలితో దాడి





- తీవ్ర గాయాలు

నవతెలంగాణ-పినపాక

మండలంలో ఒక ప్రముఖ పత్రికకు రిపోర్టర్గా విధులు నిర్వహిస్తున్న విజయ్పైన మంగపేట మండలం రామచంద్రపేటలో గురువారం సాయంత్రం మూడు గంటల సమయంలో కొడవలితో కొందరు దాడి చేశారు. ఎందుకు దాడి చేశారు అనే విషయం తెలియవలసి ఉంది. తీవ్ర గాయాలైన విజయ్ను మెరుగైన వైద్యం కోసం మణుగూరు 100 పడకల ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇటీవల ఈ బయ్యారం క్రాస్రోడ్లో విజయ్ కోమలి రెస్టారెంట్ను ప్రారంభించారు.

నీట్ అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం



నీట్ ఫలితాలలో వచ్చిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని, మెడికల్ పరీక్షలను నిర్వహించడానికి రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. నీట్ స్కాం వెలికి తీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిరసన నిర్వహించారు. స్థానిక అమరవీరుల స్థూపం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ దేశంలో 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే విధంగా ఎన్టీఏ నిర్వహించిన ఎగ్జామ్ ఉందని, దీనివలన వైద్య విద్య చదువుకోవాలని కలలు కన్న విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ స్కాం జరిగిందని ఒకవైపు చర్చ జరుగుతుండగానే పీజీ అర్హత పరీక్ష కోసం యూజీసీ నిర్వహించిన నెట్లో కూడా అనేక లోపాలు ఉండడం వలన నిట్ను రద్దు చేశారని, దీనివలన పీజీ ఎంట్రెన్స్ రాసిన విద్యార్థులు కూడా ఆందోళన గురవుతున్నారన్నారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగంపై కేంద్ర ప్రభుత్వం తన పెత్తనాన్ని కొనసాగించడం వలన ఇలాంటి అవత అవకలు జరుగుతున్నాయని విద్యార్థుల భవిష్యత్తుని కేంద్ర ప్రభుత్వం ఎన్టీఏ నెట్ సంస్థలు ప్రశ్నార్థకంగా మార్చాయని విమర్శించారు. తక్షణమే సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని నీట్ స్కాంపై తగు విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మెడికల్ పరీక్ష నిర్వహించడానికి రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగంపై కేంద్ర ప్రభుత్వం తన ఆజమాయిషీ ప్రదర్శించడం సరైనది కాదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, భూక్య రమేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కూరపాటి సమ్మయ్య, టౌన్ కమిటీ సభ్యులు నందిపాటి రమేష్, నాయకులు నాజర్, రవి, సతీష్, రామకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ అలసత్వం

- సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజె.రమేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్రంలో డిసెంబర్లో కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని, తక్షణమే కార్మిక సమస్యల పరిష్కారంలో రేవంత్రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించి, ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటియూ జిల్లా కార్యదర్శి ఏజె.రమేష్ డిమాండ్ చేశారు. సీఐటియూ జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి అధ్యక్షతన జరిగిన జిల్లా వర్క్ షాప్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత రీత్యా ఆ ప్రభుత్వాన్ని ఓడించి, ఎన్నో హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారం లోకి తెచ్చారన్నారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికుల సమస్యలపై అనేక హామీలను ఇచ్చారని, ఆచరణలో మాత్రం ఏ ఒక్క హామి అమలు చేయకపోగా, కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. అనేక ఆశలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కార్మికులు ఉన్నారన్నారు. దానికి భిన్నంగా టీచర్స్కి రూ.1లక్ష , ఆయాలకు రూ.50 వేలు మాత్రమే ఇవ్వాలని సర్క్యులర్ ఇచ్చారని మండి పడ్డారు. రాష్ట్రంలో ఆరు కోల్ బ్లాక్లను వేలం పాట వేయాలని, ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని మోడీ తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ ప్రభుత్వం నోరు విప్పడం లేదని ఆరోపించారు. 72 షెడ్యూల్ పరిశ్రమల్లో పని చేస్తున్న ఒక కోటి మంది కార్మికులకు వేతనాలు జీవో లను సవరించి, వేతనాలు పెంచాల్సింది పోయి, తగ్గిస్తూ జీవోలను ఇచ్చారని అన్నారు. ఈ చర్యాలన్నింటిని బట్టి చూస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మిక సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని అర్థమవుతున్నదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మిక సమస్యలపై దృష్టి పెట్టి, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల కార్మిక సమస్యల పరిష్కారం కి పోరాటాలు చేయడమే తప్ప వేరే మార్గం లేదని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలక్టరేట్ ధర్నా జరుగుతుందని, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21, 22 తేదీలలో స్థానిక శాసనసభ్యులకు వినతి పత్రాలు ఇవ్వాలని, ఈ నెల 25వ తేదీన కలక్టరేట్ ధర్నా జరుగుతుందని తెలిపారు. జిల్లా వర్క్ షాప్ ప్రారంభానికి ముందు సీఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఏ.నబీ ప్రజా ఉద్యమాలలో మరణించిన వారికి సంతాప తీర్మానం పెట్టగా, సమావేశం మౌనం పాటించింది. ఈ వర్క్ షాప్లో సీఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి.అప్పారావు, పిట్టల అర్జున్, గద్దల శ్రీనివాసరావు, వెంకటమ్మ, దొడ్డ రవి కుమార్, జిల్లా కోశాధికారి జిలకర పద్మ, సహాయ కార్యదర్శులు డి.వీరన్న, సత్య, వీఓఏ జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల మధు, తాల్లపల్లి కృష్ణ, భూక్యా రమేష్, రాములు, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి సుల్తానా, విఓఏ జిల్లా సహాయ కార్యదర్శి రేష్మా, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారావు, వెంకటప్పయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రాములు, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పీ.సోమయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారి పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పీ.సోమయ్య అన్నారు. గురువారం ములకపాడు వైయస్ భవన్లో జరుగుతున్న రెండోవ రోజు సీపీఐ(ఎం) మండల స్థాయి శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని పార్టీ పని పద్ధతులు అనే అంశాన్ని బోధించారు. దేశంలో మళ్ళీ దుర్మార్గమైన బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలో వచ్చిందన్నారు. 2014 ఎన్నికలకు ముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని నిరుద్యోగులను మోసం చేసిన నరేంద్ర మోడీ ప్రభుత్వం, కార్మికుల హక్కులు, చట్టాలను ఉల్లంగిస్తూ కార్మికుల పొట్ట కొడుతుందన్నారు. మోడీ ప్రభుత్వం, పేదరికం లేని సమాజం అని చెప్పి దేశాన్ని మరింత పేదరికంలోకి నెట్టేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని భవిష్యత్తులో లౌకిక తత్వ శక్తులందరూ ఏకమై, ఆ కూటమిలో ఉన్న వారు కూడా బయటికి వస్తే బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టొచ్చని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని రద్దు చేసి కార్పొరేట్లకు అప్పగించిన అడవులను, పరిశ్రమలను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని హెచ్చరిక చేశారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం పల్లె దవాఖానాల పేరుతో వైద్యం కోసం భవనాలు ఏర్పాటు చేసినప్పటికీ సరైన వైద్య సిబ్బంది లేరని, తక్షణమే నూతన కాంగ్రెస్ ప్రభుత్వం పల్లె దవాఖానాలో రెగ్యులర్ డాక్టర్లను, స్టాఫ్ నర్సులను, అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రజా సంక్షేమం కొనసాగించకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొర్సా చిలకమ్మ, మండల నాయకులు యలమంచి శ్రీనుబాబు, మర్మం సమ్మక్క, కొడాలి లోకేష్ బాబు, వాగే ఖాదర్ బాబు, ఎండీ.బేగ్, సోయం వీర్రాజు, కాకా కృష్ణ, సోయం నాగమణి, మాజీ సర్పంచులు సోయం పార్వతి, కల్లూరి దేవి, తోడం తిరుపతిరావు, సోడే రాంబాబు, కొమరం చంటి, కే.గోవర్ధన్, కల్లూరి లక్ష్మయ్య, గుడ్ల రామ్మోహన్రెడ్డి, త్రినాధ్, అర్జున్, యాకోబురెడ్డి, మడకం లక్ష్మి, మడివి ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒలంపిక్ డే రన్ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దమ్మపేట

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా దమ్మపేట ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఒలింపిక్ క్రీడా జ్యోతి వెలిగించి రన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతహాగా వ్యాయామ టీచర్ను అయిన నేను ఈ రన్ను ప్రారభించటం సంతోషముగా ఉందన్నారు. ఒలింపిక్ క్రీడలలో దేశం తరపున పాల్గొనడం క్రీడాకారుడి అంతిమ లక్ష్యంగా ఉంటుందని, దాని కోసం నిరంతరం క్రీడాకారులు శ్రమించాలని, అప్పుడే పతకాలు సాధిస్తారని తెలిపారు. ఈ ఒలింపిక్ డే రన్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో నిర్వహించటం ద్వారా క్రీడాకారులు ఒలింపిక్స్ క్రీడల వైపు ఆకర్షితమౌతారన్నారు. తొలుత ఇటివల మరణించిన ఖమ్మం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరి బీ.హరనాథ్రెడ్డికి జారె నివాళులు అర్పించారు. అనంతరం జీఎస్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఆరేం ప్రశాంత్ ఒలింపిక్ పతాకాన్ని ఊపి రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఒలింపిక్ డే రన్లో యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కే.మహీధర్ మాట్లాడుతూ ఈ రన్ 21న భద్రచలం చేరుకొని 22న ఇల్లందు, 23 న కొత్తగుడెం లో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ క్రీడా అధికారి గోపాలరావు, కాలేజీ ప్రిన్సిపల్ బీ.జను నాయక్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి పీ.నాగేందర్, జిల్లా బేస్ బాల్ సెక్రటరి ఇల్లుటూరి ప్రవీణ్, అథ్లెటిక్ కోచ్ జే.కృష్ణ, పీడీ శ్వేతా, పీఈటీ ఇందు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

- ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిత్య అవసర వస్తువుల ధరలు తగ్గించాలని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఐద్వా జిల్లా నాయకురాలు నాదెండ్ల లీలావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి డీ.సీతాలక్ష్మి మాట్లాడుతూ.. రోజురోజుకీ నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, మహిళలపై అధిక బారాలు పడుతున్నాయని, దీనివలన మహిళలు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈరోజు చూస్తే కందిపప్పు ఒక కేజీ రూ.200, అలాగే టమాటాలు 100 రూపాయలు ఉన్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే కాదు మహిళలు బయటకు వెళ్లాలన్న ఉద్యోగాలు చేయాలన్న మహిళలకు భద్రత లేదు. మహిళలకు అండగా ఉండాల్సిన భూపాల్పల్లి ఎస్ఐ మహిళా కానిస్టేబుల్పై అగత్యానికి పాలు పడ్డ ఎస్సైని ఉద్యోగం నుంచి తీసివేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చీడపురుగులు ఎక్కడ ఉన్నా నిగా పెట్టి వాళ్లకు బుద్ధి చెప్పాలని మహిళలకు, యువతకు, చిన్నపిల్లలకు అండగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గవర్నమెంట్ హాస్పిటల్లో సరిపోను డాక్టర్లు లేరు.. ముఖ్యంగా గైనకాలజిస్ట్ డాక్టర్స్ లేరని, వెంటనే డాక్టర్స్, సిబ్బందిని భద్రాచలం ఏరియా హాస్పిటల్ వెంటనే నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ ఏ. సక్కుబాయి, జీ. రాధా, టౌన్ కమిటీ సభ్యులు పుణ్యవతి, కే.సుశీల, ఎస్కే. చోట అమ్మ, సౌదామని, సరోజినీ, వై.పూర్ణిమ, కనక శ్రీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ను కలిసిన జీఎం జాన్ ఆనంద్

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి ఇల్లందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా వారు ఇల్లందు ఏరియాలో సింగరేణి సంస్థ కార్యకలాపాల గురించి చర్చించి తగు వివరాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏరియా ఎస్టేట్ అధికారి శివవీర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లు పరిశీలన

నవతెలంగాణ-అశ్వారావుపేట

స్థానిక కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలను, కొనుగోళ్లను అధికారులు తనిఖీ చేశారు. అశ్వారావుపేట కొనుగోలు కేంద్రంలో అధికారులు కక్ష సాధింపుతో తన ధాన్యం కొనుగోలు చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నారని చెన్నూరు రామకృష్ణ అనే రైతు ఇటీవల డీసీవో ఖుర్షీద్కు ఫిర్యాదు చేశాడు. రైతు ఫిర్యాదుపై స్పందించిన డీసీవో గురువారం డీసీఎస్ మాలతి, సివిల్ సప్లై డీఎం త్రినాథ్ను వెంట బెట్టుకుని కొనుగోలు కేంద్రంలోని నిల్వలను పరిశీలించారు. మరోసారి తూర్పార పట్టాలని సొసైటి అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని, ఇన్ని రోజులు ఆలస్యం చేయటం ఏమిటని, వ్యక్తిగత ఇగోలకు పోవద్దని హెచ్చరించారు. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న ఇతర రైతులు కొనుగోలు కేంద్రాల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయటం లేదని, ధాన్యం సేకరణలో ఉద్దేశ్య పూర్వకంగానే తాత్సారం చేసి ప్రయివేట్ వ్యాపారులకు విక్రయాలు జరిగేలా పరోక్షంగా సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కూడా ఉండమని, ప్రశ్నిస్తే వేదింపులు తప్పవు అనే ఆందోళనతో రైతులు మాట్లాడటం లేదని వివరించారు. స్థానిక వ్యవసాయాధికారులు కూపన్లు జారీ చేసినప్పుడు ధాన్యం సేకరణలో ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. పిర్యాదులు అన్నింటి పైనా విచారణ చేస్తామని, ముందు ధాన్యం సమస్య లేకుండా తూర్పార బట్టి, తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పట్టాదారు ఒకరు..ఆక్రమణదారులు మరొకరు..

- పోలీస్లకు బాధితుడు పిర్యాదు

నవతెలంగాణ-అశ్వారావుపేట





మండలంలోని వినాయకపురంకు చెందిన బత్తుల తిరుమలేష్ అనే రైతుకు పూర్వీకుల నుంచి ఆసుపాక రెవిన్యూ మౌజా సర్వే నంబర్లలో 281/అ విస్తీర్ణం 21 కుంటలు, సర్వే నంబరు 288/అ విస్తీర్ణం 1.03 కుంటలు కలిపి మొత్తం 1.24 కుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ వ్యవసాయ భూమికి సంబంధించి రెవిన్యూ రికార్డులు పొంది, ధరణి డిజిటల్ పట్టాదారు పాసు బుక్ సైతం ఉంది. ఈ భూములు వినాయకపురంలోని ప్రధాన సెంటర్కు సమీపంలో, ప్రధాన రహదారికి అనుకొని ఉన్నాయి. ఈ భూములపై సంబంధం లేని అదే గ్రామానికి చెందిన నల్లపు నరసింహారావు, నల్లపు లక్ష్మీపతి, చిట్రోతు శ్రీనివాసరావు, చిట్రోతు సీతా రాంబాబు, చిట్రోతు సత్య లక్ష్మీ చిట్రోతు రాణి, బరపటి రంగారావు అనే వ్యక్తులు కలిసి తన భూమిలోకి అక్రమంగా వచ్చి దౌర్జన్యంగా రేకుల షెడ్డును వేసి ఆక్రమించినట్లు బాధితుడి లిఖిత పూర్వకంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు వాపోతున్నాడు.



పోడు భూములకు పట్టాలివ్వాలి

- ఐటీడీఏ ఏపీఓకి వినతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఎన్నో ఏళ్లుగా పోడు కట్టుకొని జీవిస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పోడు సాగుదారులపై ఫారెస్ట్ వారి దాడులు ఆపాలని కోరుతూ గురువారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా చేసి ఏపీవో డేవిడ్ రాజుకి వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఐ ఎంఎల్ నాయకులు జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఎస్కే.ఉమర్ మాట్లాడుతూ. పోడు కొట్టుకొని వ్యవసాయం చేసుకుంటున్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని, హరితహారం పేరుతో ఉంచుకున్న భూమిని తిరిగి ఇవ్వాలని, ఆదివాసి గ్రామాల్లో వేరే గ్రామపంచాయతీలు వేరే గ్రామాలలో ప్రకృతి వనం పేరుతో తీసుకున్న భూములను తిరిగి ఇవ్వాలని పోడు సాగుదారులపై నాయకుల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. తక్షణమే పోడు భూముల సమస్యను పరిష్కరించేటట్టు ఫారెస్ట్ అధికారులు చొరవ చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా డివిజన్ నాయకులు కే.సారంగపాణి, పొడుగు నరసింహారావు, కుంజ కృష్ణ, ముసలి సతీష్, ముత్యాల సత్యనారాయణ, వీరమల్ల ఉమా, సోమ వినోద, బుర్ర సమ్మక్క, నాగమణి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com



'రక్షణతో పాటు సమయపాలన పాటించాలి'

నవతెలంగాణ-ఇల్లందు

ఉద్యోగులు రక్షణతో పాటు సమయపాలన పాటించాలని ప్రాజెక్ట్ అధికారి బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. జేకేఓసీలో గురువారం ప్రాజెక్ట్ అధికారి బొల్లం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు అందరూ రక్షణతో పాటు, సకాలంలో డ్యూటీకి రావాలని, సమయపాలన పాటించాలని, మధ్యాహ్న భోజనానికి విరామం తరువాత సకాలంలో తిరిగి విధుల్లో చేరాలన్నారు. యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, యంత్రాల పనిగంటలు పెంచాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజువారి లక్ష్యాలను అధిగమించాలన్నారు. బొగ్గు ఉత్పత్తి రవాణాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించుటకు ప్రతి ఒక్క ఉద్యోగి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ పీ.పూర్ణ చందర్, సేఫ్టీ ఆఫీసర్ శివ ప్రసాద్, పర్సనల్ అధికారి సుధాకర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి సంజీవచారి, ఐఎన్‌టీయూసీ ఫిట్ కార్యదర్శి బాబు రావ్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యునిగా పట్టణవాసి బయ్యు అభిమన్యు

నవతెలంగాణ-ఇల్లందు



ఇటీవల ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ప్లీనరీ సమావేశానికి 33 జిల్లాల నుండి 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. దీనిలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి జిల్లా అధ్యక్షుడు బయ్యు అభిమన్యుని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ప్రతినిధులు ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ సభ్యులు అభిమన్యు మాట్లాడుతూ తనను ఎన్నుకున్న ప్రతి ఒక్క సభ్యులకి, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. నమ్మకం ఉంచి నాకు బాధ్యత అప్పగించినందుకు శక్తికి మించిన విద్యారంగ సమస్యల కోసం, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని, రానున్న రోజుల్లో ఎస్ఎఫ్ఐ సంఘాన్ని మరింత బలోపేతం చేయడం కోసం విద్యార్థులను ఐక్యం చేస్తూ పోరాటం చేస్తానన్నారు.

ఐఎఫ్టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఇల్లందు

ఈనెల 23న మహబూబాబాద్‌లో నిర్వహించే ఐఎఫ్టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తూ గురువారం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీతారామయ్య గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...29 కార్మిక చట్టాలను రద్దుచేసిన మోడీ ప్రభుత్వం 2019లో నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చిందని, ఇవి కార్మికులకు అత్యంత ప్రమాద కరమైనవన్నారు. నాలుగు లేబర్ కోడు లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు, సమ్మెలు నిర్వహించారని తెలిపారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం మొండిగా బిల్లు పాస్ చేసిందని, 4 లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా రాష్ట్రాల గొంతు విప్పాలన్నారు.



మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-చర్ల

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జీ.పద్మ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ముఖ్యమంత్రి ఇస్తానన్న పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయలు ఇస్తానని ప్రభుత్వం హామీ ఇచ్చిందని హామీ ప్రకారమే మధ్యాహ్న భోజన కార్మికులందరూ ఓట్లు వేసి గెలిపించారాని తెలిపారు. గెలిచిన ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోవాలని, తక్షణమే ఇస్తానన్నా పదివేల రూపాయల జీతాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని, కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి, మధ్యాహ్న భోజన కార్మికులు రాజేశ్వరి, నిరూష, రాజమ్మ, లీలావతి, నాగమణి, స్రవంతి, కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారెకు జీపీ కార్మికుల వినతి

నవతెలంగాణ-దమ్మపేట

మండలంలోని 31 గ్రామపంచాయతీలకు చెందిన కార్మికులు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి మండల కార్యదర్శి బెజవాడ రాము మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో. అత్యంత దుర్భరమైన జీవనం కొనసాగిస్తున్న కార్మికులు ఎవరైనా ఉన్నారంటే అది గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు మాత్రమె అని అన్నారు. ఆరు నెలలు గడుస్తున్న కార్మికుల సమస్యలు మాత్రం అక్కడే ఉన్నాయని కావున ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులు కోరినటువంటి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ సహాయ కార్యదర్శి యార్లగడ్డ మణికంఠ. నల్ల ప్రసాద్. శ్రీమన్నారాయణ. ఎస్ కే జాన్‌బి, నక్క నాగమణి, గొర్రెపాటి బసవయ్య, పెంకె ప్రభాకర్, సహదేవుడు, ఉదయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పోగుల కోటేశ్వర్‌రావు

నవతెలంగాణ-కొత్తగూడెం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పోరాడి సాధించుకున్న సంక్షేమ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు పాలకులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుల కోటేశ్వర్ రావు డిమాండ్ చేశారు. ఈ నెల 23న సారపాకలో జరగనున్న ఏఐటీయూసీ జిల్లా రెండో మహాసభల ప్రచారంలో భాగంగా గురువారం పోస్టాఫీస్ సెంటరులో కార్మికుల అడ్డాలో మహాసభ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వర్ రావు మాట్లాడుతూ భవన సంక్షేమ చట్టంలో గుర్తింపు సంఘ ప్రతినిధులకు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేర్చడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో బోర్డులో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, కార్మికులకు సంక్షేమ చట్టం ఫలాలు అందాటలేదన్నారు. కార్మికుల అడ్డాల్లో రెస్టు షెల్టర్లు, పరిహారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాలకు కార్మికులు బాసటగా నిలవాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు కంచర్ల జమాలయ్య, గెద్దాడ నగేష్, పిడుగు శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు తాటికల చంద్రమౌళి, అనుమాల రాజు, అనిషెట్టి భిక్షపతి, గుంటి మల్లేష్, చెక్క కోటేశ్వరరావు, తన్నీరు హరిబాబు, మల్లేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో గురువారం మండల ప్రజా పరిషత్ అధికారి, ఎంపీడీవో జీ.రవీంద్రరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు డీ.ప్రసాద్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మూడు బిచ్చు, మండల కార్యదర్శి సరికొండ నాగేశ్వరరావులు మాట్లాడారు. నిత్యం గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న జీపీ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం మూలంగా కార్మిక కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 27 వేల రూపాయలు ఇవ్వాలని, ఆదివారం సెలవు అమలు చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే.అన్నాజీ, కే.ఎర్రయ్య, ప్రసాద్, బాలాజీ, మహేష్, యశోద, తార్య, లింగ, సంపత్, సురేష్, నెహ్రూ, నాగేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు.

లాభదాయక సాగు పద్ధతులను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



సన్న కారు రైతులను లాభదాయక సాగు పద్ధతులపై ప్రోత్సహించాలి జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సన్నకారు రైతులతో కొత్త తరహాలో వ్యవసాయం చేయించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచే దిశలో వ్యవసాయ విస్తరణ అధికారులు కృషి చేయాలని కోరారు. మునగ సాగు ద్వారా, మునగ కాయలు పండించి ఒక ఎకరంలో వరి సాగు కన్నా అధిక ఆదాయం సాధించవచ్చని, కామారెడ్డి జిల్లాలో నిరూపణ అయిందని, ప్రతి వ్యవసాయ అధికారి కనీసం ఒక రైతును ఆ దిశలో ప్రోత్సహించాలని ఆదేశించారు. మునగ సాగు ఒక ఎకరంలో చేపట్టి, వాటికి నీటి సరఫరాకై నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, మునగ చెట్లు నాటుటకు గుంటలు, నీటి కుంటలు తవ్వుటకు ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం సాయం చేస్తుందని, మునగ చెట్లకు రక్షణగా చుట్టూ టేకు చెట్లు ఏర్పాటు చేసుకోవాలని, నీటి కుంటలలో అజోల్ల నాచు పెంపకం ద్వారా ఆదాయం పొందవచ్చని, అలాగే నీటి కుంటలలో కొర్రమీను పిల్లలను వేసి వాటి పెంపకం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. వరి సాగు రైతులకు అంతగా లాభదాయకం కాని పరిస్థితుల్లో ఆయిల్ ఫామ్ అంతర్ పంటగా వేసుకోవచ్చని, ఆయిల్ ఫామ్ మొక్కల మధ్య అరటి సాగు చేసుకోవచ్చని తెలిపారు. తేనెటీగల పెంపకం చేపట్టడం ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు చేసేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఉద్యానవన అధికారి సూర్యనారాయణ, జిల్లా మార్కెట్ అధికారి సునీత, జిల్లా విత్తన అభివృద్ధి సంస్థ అధికారి బిక్షం, ఏడిఏ రవికుమార్, ఏవో దీపక్, మండల వ్యవసాయ అధికారులు, మండల విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు

చంద్రుగొండ : ఇష్టపడి చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. గురువారం మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో నేరుగా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి రోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత విద్యను అందిస్తారన్నారు. అర్థంకాని సబ్జెక్టులను ఉపాధ్యాయులను మళ్లీ, మళ్లీ అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మద్దుకూరు గ్రామానికి చెందిన ఉపాధిహామి పథకం కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌పై లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. గత ఏడాది నర్సరీ మొక్కలను తెచ్చి, హరితహారం కార్యక్రమంలో నాటడం జరిగిందని, నేటికి వాటి డబ్బులురాలేదని, చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని, విచారణ చేపట్టాలని కూలీలు కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ విచారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరుగుదొడ్లను పాఠశాలల్లో పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీఓ అశోక్, పీఆర్ ఈఈ సత్యనారయాణ, ఎంఈఓ సత్యనారాయణ, సీడీపీఓ నిర్మలాజ్యోతి, ఏఈ శ్రీనివాస్, హెచ్ఎం భవాని, గ్రామస్తులు తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యం కాపాడుకోవాలి

పాల్వంచ : విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి కాపాడుకోవాలని భద్రాది కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. జాతీయ నులిపురుగుల కార్యక్రమం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ పాల్వంచలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ కె. చంద్రశేఖర్, వీ. విజేత, దుర్గా, ఎస్.క్రాంతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజల తరఫున సీపీఐ(ఎం) పోరాటాలు

- రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు



ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం ప్రజల తరఫున సీపీఐ(ఎం) పోరాటాలు, ఆందోళనలు నిర్వహించాలని, ఇందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధత కలిగి ముందుకు సాగాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) మండల రాజకీయ శిక్షణ తరగతులు మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ విశిష్టత గురించి భోదించారు. ఉదయం, సాయంత్రం పార్టీ నిర్మాణం, కర్తవ్యాలపై సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ వివరించారు. ఈ దేశంలో సామాన్య ప్రజలు బతికే పరిస్థితి లేదని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మి కులు, రైతులు, కార్మిక వర్గంపై పెద్ద ప్రమాదం ముంచుకొస్తుందని అన్నారు. నిరంతరం ప్రజల తరఫున సీపీఐ(ఎం) కార్యకర్తలు, నాయకులు, పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలనలో పెట్టుకున్న దరఖాస్తులు సక్రమంగా అధికారులు ఆన్‌లైన్ చేయకపోవటం వల్ల బూర్గంపాడు మండల ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఆ సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో పాపినేని సరోజన, బయ్యా రాము, ఎస్‌కే.అబిధా, అజయ్ కుమార్, పాండవుల రామనాథం, రాయల వెంకటేశ్వర్లు, కనకం వెంకటేశ్వర్లు, గుంటుక కృష్ణ, నిమ్మల అప్పారావు, పాండవులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలితో అలమటిస్తున్న పంచాయతీ కార్మికులు

- ఐదు నెలలుగా రాని వేతనాలు
- జిల్లా మంత్రులు వెంటనే స్పందించి వేతనాలు చెల్లించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-చర్ల



గ్రామపంచాయతీ కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని, ఐదు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు వెంటనే స్పందించి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం చర్ల మండలం ఎంపీఓకి వినతి పత్రం అందజేశారు. మండలంలో 26 గ్రామపంచాయతీ ఉన్నాయని ప్రతి గ్రామపంచాయతీలో రెండు నెలల నుండి ఏడు నెలల వరకు వేతనాలు పెండింగ్లో ఉన్నాయని ఎంపిఓకి వివరించారు. ఇన్ని నెలల పాటు వేతనాలు రాకుండా ఉంటే కార్మికులు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. నెలల తరబడి జీతాలు చెల్లించకుండా పనిచేయించుకోవడం చట్టరీత్యా నేరమని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఆదివారం సెలవు విధిగా అమలు చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు సెలవులు లేవని ఆదివారం కూడా పనులు చేయిస్తున్నారని వివరించారు. ఈ విధంగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతోటి ఎంపీఓ మాట్లాడి పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. ప్రతి నెల మొదటి వారంలో జీతాలు చెల్లించే విధంగా బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని బకాయి వేతనాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ వేతనాలకు సంబంధించి కొన్ని గ్రామపంచాయతీలో చెక్కులు ట్రెజరీలో పెండింగ్లో ఉన్నాయని తొందర్లోనే పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. వేతనాల సమస్యకు పరిష్కారంగా నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు ఇప్పటికే తెలియజేశామని సాధ్యమైనంత తొందరలో వేతనాల చెల్లింపు జరుగుతుందని చెప్పారు. ఆదివారం రోజు అందరూ సెలవు తీసుకునే విధంగా పంచాయతీ కార్యదర్శులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీఓను కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ.పద్మ, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ చర్ల మండల నాయకులు విజయ్, కళ్యాణ్ పార్వతి, త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

కలెక్టర్ ప్రియాంక అలాకు ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-పాల్వంచ



రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేసిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా నుంచి హైదరాబాదుకు బదిలీ అయిన కలెక్టర్ ప్రియాంక అలాకు బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 11 నెలల పాటు పనిచేయడం ఆనందంగా ఉందని ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. జిల్లాలో తొలిసారిగా కలెక్టర్ గా పని చేసిన అనుభూతి మరువలేనిదని ఆమె తెలిపారు. అటు వరదల సమయంలో ఇటు ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం సమిష్టిగా పనిచేసి విజయవంతంగా సేవలందించారని అభినందించారు. కలెక్టర్‌ను సన్మానించిన వారిలో డిఆర్డిఓ విద్యాచందన, డిఎఫ్ఓ కృష్ణ గౌడ్,డిఆర్డి ఏ అదనపు పీడీ ఎన్.రవి కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- బాధిత కుటుంబాలను ఆదుకుంటాం
- జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి, మండలం ప్రశాంతినగర్ గ్రామ పంచాయతీలో ఐటీడీఏ వారి ద్వారా నర్సరీ ఏర్పాటు చేయటకుగాను సుమారు 100 ఎకరాల గిరిజనుల భూమిని 1983 సంవత్సరం లో అప్పటి ప్రభుత్వం సేకరించిందని, వారికి ప్రత్యామ్నాయంగా గరిమెళ్ళపాడు ఏరియాలో ఇళ్ల స్థలాలను కేటాయించడం జరిగింది.. కానీ కాలక్రమేణా వారి కుటుంబాలు పెరగడం వల్ల అప్పుడు కేటాయించిన ఇళ్ల స్థలాలు సరిపోక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం పేదలు వేసుకున్న గుడిసేల ప్రాంతాన్ని సందర్శించారు. దానికి శ్రీనివాసరెడ్డి నగర్‌గా నామకరణం చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో గత ఐదు సంవత్సరాల క్రితం గిరిజనులు గుడిసెలను వేసుకొని ఉంటున్నారు.. కానీ వారికి ఇళ్ల పట్టాలు లేకపోవడం వలన గ్రామ పంచాయతీ వారు ఇంటి నెంబర్లు కేటాయించకపోవడంతో నిత్యవసరాలైన నీరు, విద్యుత్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవిన్యూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బాధిత గిరిజనులందరూ తాము గుడిసెలు వేసుకొని ఉంటున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేసి ఇళ్లకు ఇంటి నెంబర్లు కేటాయించి మౌలిక వసతులు కల్పించవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గిరిజనుల సమస్యపై వెంటనే స్పందించి వారు నివాసం ఉంటున్న ఇళ్ల స్థలాలకు వెంటనే పట్టాలు మంజూరు చేసి వారికి ఇందిరమ్మ గహాలు కూడా మంజూరు చేయాలని కోరారు. కృతజ్ఞతగా వారి నివాస కాలనీకి పొంగులేటి శ్రీనన్న నగర్‌గా నామకరణం చేస్తూ అట్టి కాలనీ ప్రారంభోత్సవాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), దేవి ప్రసన్న, మండె వీర హనుమంతరావు, పరంజ్యోతి, కనకరాజు, ఏఎంసీ చైర్మన్ రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన అడవి పంది మాంసం స్వాధీనం

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని గాండ్లగూడెంలో గురువారం ఒకరి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న అడవి పంది మాంసాన్ని గురువారం స్థానిక ఫారెస్టు రేంజర్ మురళి స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సదరు ఇంట్లో తనిఖీలు చేసిన అధికారులకు సుమారు 1 కేజీ మాంసం లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. మాంసాన్ని అశ్వారావుపేట ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించారు. దీనిపై రేంజర్ మాట్లాడుతూ పట్టుబడిన మాంసాన్ని నిర్ధారణ కోసం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించి, పరీక్షలు చేయిస్తామని తెలిపారు. పరీక్షల్లో అడవి పంది మాంసంగా నివేదిక వస్తే సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలి

నవతెలంగాణ-దమ్మపేట



విద్యార్థిని, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తద్వారా ఆరగ్యవంతమైన ఉన్నత విద్యను అందిపుచ్చుకుంటారని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని అంకంపాలెం గర్ల్స్ హాస్టల్, దమ్మపేట ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జారె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారెను పాఠశాల యాజమాన్యం శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అదే విధంగా విద్యార్థినీ విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను అందిస్తూ పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ఉపాధ్యాయులకు యాజమాన్యానికి తెలియజేస్తూ ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను ఎమ్మెల్యే జారె అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆయా పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : నులిపురుగుల నివారణతో పాటు జీర్ణాశయ, ప్రేవులకు సంభందించిన వ్యాధుల నివారణలో వ్యక్తిగత శుభ్రత ప్రధానం అని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. నియోజక వర్గం కేంద్రమైన అశ్వారావుపేటలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో అశ్వారావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ అద్యక్షతన గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.హరిత, పిఎ సిఎస్ అశ్వారావుపేట అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, ఎంపిటిసి సత్యవరుపు తిరుమల బాలగంగాధర్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : నులిపురుగుల నివారణ కోసం ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జడ్పీటిసి తెల్లం సీతమ్మ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం దుమ్ముగూడెం, పర్ణశాల, నరసాపురం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పరిధిలో జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు జడ్పీటిసి చేతుల మీదుగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం పర్ణశాల నరసాపురం వైద్యాధికారులు పుల్లారెడ్డి, రేణుకా రెడ్డి, సుభాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పినపాక : జీరో నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గ భవాని సూచించారు. గురువారం మండల కేంద్రంలో గల స్థానిక జిల్లా పరిషత్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన నులి పురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమానికి ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఎంపీడీవో రామకృష్ణ హాజరై విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గా భవాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చింతపండు సత్యం, జిల్లా పరిషత్ స్కూల్ హెడ్ మాస్టర్ రమణ, ఉపాధ్యాయులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : పిల్లల మానసిక శారీరక ఎదుగుదల పై నులి పురుగుల దుష్ప్రభావం ఉంటుందని వైద్యాధికారిణి తనుజ అన్నారు. గురువారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో బాల బాలికలకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను వేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దారా వెంకటేశ్వర్లు, హెచ్ఎం వాజిద్ ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి : మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో, అంగన్వాడీ సెంటర్లలో, కళాశాలల్లో ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయసు పిల్లలందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్‌లు నులిపురుగుల నిర్మూలనకు మింగించారు. గురువారం టేకులపల్లి గవర్నమెంట్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ మౌనిక, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధు వరుణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కె వైద్యుడు మున్వర్ అలీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం : నులిపురుగుల నివారణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు కోరారు.గురువారం జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ ప్రాథమిక వైద్యశాల, రుద్రంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు బాదావత్ శాంతి, రుద్రంపూర్, పెనగడప ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వాణి, డాక్టర్ నేహా అమ్రిన్, ఎంపీఓ సత్యనారాయణ, ఎంపీటీసీ పరమేష్, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో మహిళలకు రక్షణ ఏది?

నవతెలంగాణ-మణుగూరు





సింగరేణిలో మహిళలకు రక్షణ ఏదని హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షురాలు కోడిపల్లి శ్రీలత, పిట్ కార్యదర్శి మౌనిక ప్రశ్నించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణిలో మేము మహిళలుగా ఏ పనైనా పనిచేస్తాం. కానీ మా ఆత్మగౌరవం కాపాడేవిధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్జీ వర్క్ షాప్, ఏరియా హాస్పిటల్, కేకేఫైవ్, శాంతిఖని ఇలా వరుస సంఘటనలు మహిళా భద్రతను ప్రశ్నిస్తున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను మీ తోటి అక్కాచెల్లెల్లుగా భావించండి.. శాంతిఖని ఘటనను మేము తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

బొగ్గు బ్లాక్ లను బేషరతుగా సింగరేణికి అప్పగించాలి

నవతెలంగాణ-మణుగూరు



బొగ్గులు బ్లాకులను సింగరేణి సంస్థకు అప్పగించాలని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామ నరసయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కేవీఎల్ మహేంద్ర భవన్లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో బొగ్గు బ్లాక్ల వేలం పాటని ఏఐటీయూసీ వ్యతిరేకిస్తుందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు సింగరేణిని ప్రయివేటీకరించబోమని, ఆ ఆలోచనే లేదని ప్రధానమంత్రి హోదాలో ప్రకటన చేసిన మోడీ ప్రభుత్వం నేడు జరగబోయే బొగ్గు గనుల వేలం పాటలో తెలంగాణలోని శ్రావణ్ పల్లి బొగ్గు బ్లాక్ ను చేర్చడం దేనిని సూచిస్తుందని అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతాలలోని బొగ్గు బ్లాకలను సింగరేణి కి కేటాయించాలని తద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఇంతకుముందు ప్రయివేట్ వారికి కేటాయించిన సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్ లను కూడా సింగరేణికే కేటాయించాలని అన్నారు. ప్రభుత్వాలు ప్రజల, కార్మికుల అభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రయివేట్ వారికి అప్పగిస్తే ఏఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, ఎండి ఇమాముద్దీన్, ఆకులపల్లి చంద్రశేఖర్, గడ్డం రవి, భీమ్ సేన్, తదితరులు పాల్గొన్నారు.

గొడుగు వితరణ

నవతెలంగాణ-మణుగూరు



లయన్స్ క్లబ్ మణుగూరు ప్రెసిడెంట్ గాజుల పూర్ణచంద్రరావు - బుజ్జమ్మల 37వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మణుగూరులో పండ్ల వీధి వ్యాపారం చేసే గుండె నాగమణికి వీధి గొడుగు వితరణ చేశారు. అశ్వాపురంలోని సాయిబాబా ఆలయంలో అన్నదానం కోసం 25 కేజీల బియ్యం వితరణగా అందించడం పలువురికి ఆదర్శంగా నిలిచారని సభ్యులు అన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా పూర్ణచంద్రరావు చేస్తున్న సామాజిక సేవలను ప్రశంసించారు. ఈ సంవత్సరం 450 సామాజిక సేవా కార్యక్రమాలు చేసి మణుగూరు లయన్స్ క్లబ్ ఔన్నత్యాన్ని మరింతగా పెంచారన్నారు. జోన్ రీజియన్ జిల్లాస్థాయిలో మణుగూరు లయన్స్ క్లబ్ ను ముందంజలో ఉంచారన్నారు. వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు అందించారు.. పూలదండలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మణుగూరు చార్టర్ ప్రెసిడెంట్ హరిబాబు సెక్రెటరీ షేక్ మీరా హుస్సేన్, ఎలక్ట్ ప్రెసిడెంట్ నల్లగట్ల సత్య ప్రకాష్, సభ్యులు గాజుల రమేష్, కముజు చంద్రమోహన్, డాక్టర్ సమ్మయ్య, బేతంచర్ల వెంకటేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, ఆడబాల నాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని బోనాలు ఎత్తిన మహిళలు

నవతెలంగాణ-పినపాక

వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు జరగాలని మండలంలో మహిళలు బోనాలు ఎత్తుకున్నారు. గురువారం మండల కేంద్రంలో, సీతంపేట, ఈ.బయ్యారం, జానంపేట, దుగినేపల్లిలో మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. మృగశిర కార్తె పూర్తి అయిన వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడాలని అమ్మవారికి మొక్కులు చెల్లించామని మహిళలు తెలియజేశారు. బొడ్రాయి వద్ద ప్రత్యేక జలాభిషేకాలు చేశారు. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె పూర్తియ్యేలోపు చెరువులు నిండి ఉండేవని ఈసారి ఇంకా చెరువులు నిండకపోవడంతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నామని మహిళలు తెలియజేశారు. అనంతరం వనభోజనాలకు సైతం వెళ్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించండి

- ఆహారం తీసుకునే ప్రతిసారి చేతులు శుభ్రపరచుకోవాలి

- జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత

నవతెలంగాణ- బూర్గంపాడు

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ఆహారం తీసుకునే ప్రతిసారి చేతులు శుభ్రపరచుకోవాలని జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత అన్నారు. మండలంలోని సంజీవరెడ్డి పాలెం గ్రామంలోని రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ గర్ల్స్ కళాశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ నులి పురుగులు నిర్మూలన కార్యక్రమంలో మండల అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడుపులో నులి పురుగులు వృద్ధి చెందితే పిల్లలు ఆరోగ్యానికి గురవు తారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమాలా రెడ్డి, మెడికల్ ఆఫీసర్ లక్ష్మి సాహితి, సిహెచ్ఓలు సిహెచ్ సత్యవతి, సోమ్లా నాయక్, హెచ్ఈఓ రవి, హెచ్ఎం కే తాతారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పలురు ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులందరికీ నులి పురుగుల నివారణ టాబ్లెట్లు వేసిన వైద్య సిబ్బంది

నవతెలంగాణ - బోనకల్

నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ టాబ్లెట్లను మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం వేశారు. బోనకల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నులుపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు టాబ్లెట్లను ప్రాథమిక వైద్యాధికారిని వేముల స్రవంతి, ఎంపీడీవో లకావత్ రాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రమేష్‌లతో కలిసి వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోగల అన్ని ప్రభుత్వ ప్రైవేటు అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న విద్యార్థులందరికీ నులి పరుగుల నివారణ టాబ్లెట్లు వేయనున్నట్లు తెలిపారు. గురువారం అందుబాటులో లేని విద్యార్థులకు ఈనెల 27న మరల టాబ్లెట్లు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ పెద్దినేని శ్రీనివాసరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ, అధ్యాపక బృందం, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్వైజర్లు మంద దానయ్య అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

జూలూరుపాడు : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరుపాడు నందు 19 సంవత్సరాల లోపు విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు మింగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ లావుడియా సోనీ, మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యులు లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

మహిళ ఉద్యోగుల ఆరోగ్యంపై సింగరేణి సీఎండీ ఇచ్చిన ఆదేశాల అమలు చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

మహిళా ఉద్యోగుల ఆరోగ్య సమస్యలపై సీఎండీ ఇచ్చిన ఆదేశాలను ఏరియా అధికారులు వెంటనే అమలు చేయాలని టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి నాగేల్లి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం డీజీఎం పర్సనల్ రమేష్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. మహిళా ఉద్యోగులు, అర్హత గల ఉద్యోగుల మహిళా కుటుంబాల సభ్యుల ఆరోగ్య శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సింగరేణి సీఎండీ బలరాం ప్రత్యేక దృష్టి సారించి మహిళలకు ఎక్కువగా వస్తున్న బ్రెస్ట్ క్యాన్సర్ పై కొత్తగూడెం ఏరియా నందు ఈ నెల 19న బసవతారక వైద్య నిపుణులచే రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణకు ఆదేశాలు అందించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు వారం రోజులు ముందుగానే ఆయా ఏరియాలకు చేరినప్పటికీ మణుగూరు ఏరియాలో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ఉందని కార్మికులకు తెలియపరచడంలో గనులు, డిపార్ట్ మెంట్ లలో ఉన్న సంబంధిత అధికారులు అలసత్వం వహించరాదని కోరారు ఓసీ 2, ఏరియా హాస్పిటల్ నందు పని చేస్తున్న కార్మికులకు మాత్రమే స్క్రీన్ టెస్ట్ పై నోటీస్ బోర్డ్‌లు వేశారని, మిగతా ఏ గనిలో, డిపార్ట్ మెంట్ లలో కనీస సమాచారం లేకపోవడంతో ఈ క్యాంపుకు దూరమైనారని ఆయన తెలియజేశారు. గని అధికారుల అలసత్వం వల్ల యాజమాన్యం అందించే ప్రయోజనాలు నీరుగారుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్, నాగేశ్వర రావు, వినయ్, శ్రీనివాస్, రే వన్ శ్రీనివాస్, ఇమ్రాన్, రమేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందే

• పంచాయతీలో అక్రమాలు జరిగితే చూస్తూ ఊరుకోం

• డీఎల్పిఓ సుధీర్ కుమార్

నవతెలంగాణ-పినపాక

గ్రామపంచాయతీలలో సెక్రటరీలు సిబ్బంది పారిశుధ్యంపై ముందుగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎల్పిఓ సుధీర్ కుమార్ సూచించారు. గురువారం మండలంలో ఆయన స్థానిక ఎంపీఓ వెంకటేశ్వరరావుతో కలిసి పర్యటించారు. ముందుగా జానంపేట గ్రామపంచాయతీ చేరుకున్న ఆయన గ్రామపంచాయతీలలో అవినీతి జరిగిందని అనేక ఫిర్యాదులు రావడంతో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు నాటికి వివరాలు సేకరించి రికార్డు చేసుకున్నారు. గత సెక్రటరీ శ్రీనివాసరావును సైతం పిలిపించి గ్రామపంచాయతీలో పూర్తిస్థాయిలో నిధుల వివరాలను అడిగి తెలుసుకుని ఆ నివేదికను తయారు చేసుకున్నారు. జానంపేటలో ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణ వరకు రహదారులు ఏర్పాటు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు కొలతలో ఉన్న ఆక్రమిత దుకాణాలను తొలగించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ నుంచి ముందుగా నోటీసులు ఇవ్వాలన్నారు. అనంతరం పినపాక గ్రామపంచాయతీలలో మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. మిషన్ మిషన్ భగీరథ సర్వే ఆలస్యం అవ్వడంతో వివరణ ఇవ్వాలని కోరారు. అనంతరం ఈ బయ్యారం గ్రామపంచాయతీలో డ్రైనేజీని పరిశీలించారు. ఈ బయ్యారం గ్రామంలో బస్టాండ్ సమీపంలో నీరు నిలిచి ఉంటుందని గ్రామస్తులు తెలపడంతో తక్షణమే పనులను ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీరు నిలవకుండా చూడాలని ఎంపీఓను ఆదేశించారు. ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో సైతం డ్రైనేజీ వరకు ఉన్న నిర్మాణాలను తొలగించాలని సోమవారంలోగా డ్రైనేజీ పూర్తిగా క్లీనింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. రోగాలు వ్యాపిస్తే దానికి బాధ్యత మనమే వహించాల్సి వస్తుందన్నారు. ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో ట్రాఫిక్ సైతం పరిశీలించారు. క్రాస్ రోడ్ లో గల ఒక చెట్టు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో గ్రామసభ ఏర్పాటు చేసి తీర్మానం చేసి కలెక్టర్ కు నివేదిక పంపించి క్లియరెన్స్ తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పంచాయతీ కొలతలో ఉన్న ఆక్రమిత నిర్మాణాలను తొలగించాలన్నారు. రోడ్డు సమీపంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారిని తొలగించాలన్నారు. పంచాయతీ అధికారులు సూచించిన స్థలంలో పండ్ల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో



రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీకి ముందుగా ఉన్న వారందరికీ నోటీసులు అందజేయాలన్నారు. ఉప్పాడ బ్రిడ్జి వరకు రోడ్డు పనులను శుభ్రం చేయాలన్నారు. పల్లి గ్రామపంచాయతీ ప్రజలు తమ సమస్యలను డిఎల్పిఓ కు విన్నవించారు.

సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న డీఎల్పిఓ ను కలిసి జానంపేట గ్రామపంచాయతీలో జరిగిన అవినీతిని పూర్తిస్థాయిలో బయటికి తీయాలని దాని వెనుక ఎవరు ఉన్న ఉపేక్షించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్పిఓ కార్యాలయం సిబ్బంది నకుల్, రామకృష్ణ, జానంపేట సెక్రటరీ నాగిని, ఈ బయ్యారం సెక్రటరీ జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఈ బయ్యారం క్రాస్ రోడ్ వర్తక సంఘం నాయకులు త్రిమూర్తులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యువజనుల సమస్యలపై డీవైఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్త సర్వే

• యువత జయప్రదం చేయండి

• డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట. రమేష్

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర వ్యాప్తంగా యువజనుల సమస్యలపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రామాలలో, పట్టణాలలో, బస్తీలో సర్వే నిర్వహిస్తున్నట్లు, ఈ సర్వేలలో యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో యువతీ, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై డీవైఎఫ్ఐ కార్యకర్తలు అధ్యయనం చేసి సర్వే నిర్వహించి, సర్వేలలో వచ్చిన సమస్యలపై పోరాటాలకు రూపకల్పన చేసేందుకు రాష్ట్ర కమిటీ కార్యాచరణ తీసుకుందని ఆయన తెలిపారు. అలాగే నీట్ పరీక్ష రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని ఆయన అన్నారు. దేశ భవిష్యత్తుతో మోడీ చలగాటమాడడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా పరీక్ష కన్నా ముందే పేపర్ల లీకేజ్ అవుతుంటే ఆట బొమ్మలాడుతున్నట్లుగా వ్యవహరించే తీరు సరైన పద్ధతి కాదని అన్నారు. డీవైఎఫ్ఐ సర్వేలలో యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి షేక్.బషిరుద్దీన్ మాట్లాడుతూ డ్రగ్స్ మాఫీయాపై, నిర్మూలనకై విద్యార్థులను, యువకులను చైతన్య వంతం చేస్తూ జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు చింతల



రమేష్, సత్తెనపల్లి నరేష్, పటాన్ రోషినికాన్, శీలం వీరబాబు, కూరపాటి శ్రీను, గుమ్మ ముత్తారావు, బొడ్డు మధు, షేక్ నాగురు పాషా, చిత్తార్ మురళి, రావులపాటి నాగరాజు, శభాష్ రెడ్డి సాయి రాకేష్, ఎర్ర సాయి, ఎర్ర నగేష్, తాటి వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ

• పార్టీ సభ్యులు క్రమశిక్షణతో ఉండాలి

• సీపీఐ(ఎం) నాయకులు బోడపట్ల రవీందర్, ఎర్ర.శ్రీనివాసరావు

• విజయవంతంగా ముగిసిన రాజకీయ శిక్షణా తరగతులు

నవతెలంగాణ-కూసుమంచి



భారతదేశ చరిత్రను నేడు ఆర్ఎస్ఎస్ కనుసైగల్లో బిజెపి ప్రభుత్వం వక్రీస్తుందని, పాఠ్యపుస్తకాల్లో మత సంస్కృతిని ప్రవేశపెట్టి ప్రయత్నం బిజెపి చేస్తుందని సీపీఐ(ఎం) నాయకులు బోడపట్ల రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని యడవెల్లి పద్మా రెడ్డి భవనంలో జరుగుతున్న పార్టీ సభ్యుల శిక్షణ తరగతుల కార్యక్రమంలో రెండోవ రోజు ఉదయం 'మతం-మతోన్మాదం' అనే అంశంపై ఆయన బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశంలో బిజెపి మతోన్మాదం ప్రమాదకరంగా మారుతుందని, విద్యను కాషాయీకరణ చేసే పనిలో నిమగ్నమై ఉందని, చరిత్రను వక్రీకరిస్తూ పాఠ్యపుస్తకాలలో మార్పులు చేస్తుందని తెలిపారు. ఇలాంటి మతోన్మాద ప్రయత్నాలకు అడ్డుకట్టలు వేయకపోతే భారతదేశ ప్రజల మనుగడకే ప్రమాదమన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ దేశంలో మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కమ్యూనిస్టు సభ్యులపై ఉందని, అలా ప్రతి కమ్యూనిస్టు సభ్యుడు దేశ రాజకీయ, మతాల పైన అవగాహన కలిగి ఉండి, దేశాన్ని మతోన్మాదుల చేతుల నుండి కాపాడాల్సిన బాధ్యతల్లో కమ్యూనిస్టుల పాత్ర ముఖ్యమైనదన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి సభ్యులు పనిచేయాలని ఆయన కోరారు.

కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి వుండాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు అన్నారు. రెండోవరోజు పార్టీ క్లాస్ బోధించడానికి విచ్చేసిన ఆయన 'పార్టీ నిర్మాణం' పై క్లాస్ బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టుపార్టీ నాయకులు చేసిన త్యాగాలను గుర్తు చేశారు.మల్లెల సన్మతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ గా సిపిఎం సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యడవెల్లి రమణారెడ్డి, తోటకూరి రాజు, మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన శాఖ కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రెండుచోట్ల ఎగ్జిట్స్...

-ప్రజలు, రైతులకు ఎంతో ఉపయోగకరం.. కృషిచేసిన మంత్రులకు కృతజ్ఞతలు

- సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు భారత జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేపై సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో రెండు చోట్ల అండర్ పాస్ ఎగ్జిట్స్ ఏర్పాటు అనేది నియోజకవర్గ ప్రజలు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఎగ్జిట్స్ ఏర్పాటుకు ఎన్‌హెచ్ఏఐ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో వివరాలను వెల్లడించేందుకు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలోని వేంసూరు మండలం లింగపాలెం, కల్లూరు మండల లింగాల వద్ద ఈ ఎగ్జిట్స్ మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎగ్జిట్స్ లేకుంటే ఇబ్బందులు పడతామని పలువురు రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి తమ గోడును వెల్లబుచ్చడం జరిగిందన్నారు. ఇందుకు స్పందించిన తుమ్మల ఎగ్జిట్స్ విషయమై ఎన్‌హెచ్ఏఐ అధికారులతో పలుమార్లు సంప్రదింపులు జరిపి నియోజకవర్గంలో రెండుచోట్ల ఎగ్జిట్స్‌ను మంజూరు చేయించారని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో రెండుచోట్ల ఎగ్జిట్స్ ఏర్పాటయ్యేలా సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ నియోజకవర్గ ప్రజలు, రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వేంసూరు, కల్లూరు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

60 కుటుంబాలకు డబుల్ ఇండ్ల పట్టాల పంపిణీ

వేంసూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన 60 కుటుంబాలకు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ గురువారం సత్తుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా డబుల్ ఇండ్లు మంజూరవుతాయని, ప్రస్తుతం రానివారు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అందరికి వస్తాయని భరోసా ఇచ్చారు.

గార్లపాడు ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభం

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని గార్లపాడు ప్రాథమిక పాఠశాలను 14 సంవత్సరాల అనంతరం జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రామకృష్ణ గురువారం గ్రామస్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా పునః ప్రారంభించారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు లేరని నెపంతో గార్లపాడు ప్రాథమిక పాఠశాలను మూసివేశారు. దీంతో గార్లపాడు గ్రామానికి చెందిన విద్యార్థులు మూడు కిలోమీటర్ల దూరంలో గల గోవిందాపురం ఎల్ గ్రామానికి విద్య కోసం వెళ్తున్నారు. 14 ఏళ్ల నుంచి గార్లపాడు గ్రామ విద్యార్థులు చదువు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతి గ్రామానికి ప్రాథమిక పాఠశాల ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గార్లపాడు ప్రాథమిక పాఠశాలను జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రామకృష్ణ రంగరంగ వైభవంగా పున ప్రారంభించారు. గార్లపాడు ప్రాథమిక పాఠశాలను పున ప్రారంభించడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా సిఆర్పి షేక్ మహబూబ్ పాషా గ్రామపంచాయతీ కార్యదర్శి కే నాగేశ్వరరావు గార్లపాడు ప్రాథమిక పాఠశాల పున ప్రారంభ విషయంపై గ్రామస్తులతో చర్చలు జరిపారు. గ్రామస్తులందరూ తమ పాఠశాలను పున ప్రారంభించాలని గట్టిగా కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గార్లపాడు ప్రాథమిక పాఠశాలకు పంపించేందుకు ముందుకు రావడంతో పాఠశాలను పున ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వరరావు, మండల అభివృద్ధి అధికారి లకావత్ రాజు, మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య గారు, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కే.నాగేశ్వరరావు, సిఆర్పి షేక్ మహబూబ్ పాషా, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, అంగన్వాడి టీచర్ దారెల్లి అరుణ, ఆశ వర్కర్ కనకపుడి అలివేలు, గ్రామస్తులు మోదుగు బెన్ని, గంధం ఆనంద్, కేతినేని పుల్లయ్య, కేతినేని నరసింహారావు, దారెల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు 23 ఎకరాల స్థలం కేటాయిస్తాం

- వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తా

- టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్) నేతలకు కలెక్టర్ హామీ

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలోని జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం 23 ఎకరాల స్థలాన్ని కేటాయించి...వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గురువారం కలెక్టర్‌ను అభినందించేందుకు వెళ్లిన...టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్) ప్రతినిధి బృందానికి ఇండ్ల స్థలాలు ఇస్తామని ముజామ్మిల్ ఖాన్ హామీ ఇచ్చారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఇండ్ల స్థలాల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా...ఎట్టి పరిస్థితుల్లో ఈ సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. జీఓ నెంబర్ 147 ప్రకారం ప్రభుత్వం 23 ఎకరాల 2 గుంటల భూమిని కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. అందులో 8 ఎకరాల భూమి అత్యధిక మార్కెట్ విలువ కలిగి ఉన్నందున ప్రత్యామ్నాయ భూమిని పరిశీలిస్తున్నామన్నారు. ఆర్డీవో, తహసీల్దార్ లు... సర్వేయర్‌లతో చర్చిస్తున్నట్లు తెలిపారు.అదే ప్రాంతంలో మరో రెండు సర్వే నెంబర్‌లలోని భూమికి మార్కెట్ వ్యాల్యూ తక్కువగా ఉన్న....8 ఎకరాల భూమిని గుర్తించినట్లు పేర్కొన్నారు. 23 ఎకరాల భూమిని ఏకకాలంలో జర్నలిస్టులకు భూమి కేటాయిస్తామని తెలిపారు. నూతన కలెక్టర్‌గా మొదటి ప్రాధాన్యత జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను కేటాయించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. మరో 20 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువను పెంచే అవకాశం ఉన్నందున ఈసమస్యను వేగవంతంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రారవి, ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, జి.ప్రశాంత్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ముత్యాల కోటేశ్వరరావు, టెంజూ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజనీకాంత్, ఉపాధ్యక్షులు దుంపల భాస్కర్, మందుల ఉపేందర్, అడేపు ఉపేందర్, టెంజూ టౌన్ అధ్యక్షులు ఎలమందల జగదీష్, ఉపాధ్యక్షులు నరాని సాయి, సాయి కార్తీక్, గువ్వల రాజు, గణేష్, వీడియో జర్నలిస్టు సంఘం నాయకులు సాక్షి సతీష్, భూక్య గణేష్, కల్లూరి గణేష్, లంక సునీల్, దేవేందర్, ఖమ్మం ప్రెస్‌క్లబ్ నేతలు తోట గణేష్, వెంపటి నాయుడు, మోదుగు శ్రీధర్, ఫోటోగ్రాఫర్స్ సాక్షి రాజు, వల్లభనేని రవి తదితరులు పాల్గొన్నారు.

గోళ్లపాడు చెరువును సర్వే చేసిన అధికారులు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండల పరిధిలోని గోళ్లపాడు చెరువును నీటిపారుదల శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఇటీవల ఓ మట్టి వ్యాపారీ ఇటుకల తయారీ వ్యాపారుల కొరకు వెయ్యి క్యూబిక్ మీటర్లకు అనుమతి తీసుకుని పదివేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించారని జిల్లా కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నీటిపారుదలశాఖ, భూగర్భ గనుల శాఖల అధికారులు చెరువును సర్వేచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈఈ నాగప్రియాంక, ఆర్ఐలు, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

పోడు రైతుల పక్షాన పోరాటం చేస్తా

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ భరోసా

నవతెలంగాణ-కారేపల్లి

పోడు రైతుల హక్కుల కోసం వారి పక్షావ పోరాటం చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. గురువారం కారేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్‌ల పంపిణీని ఎమ్మెల్యే చేపట్టారు. 33 మంది లబ్ధిదారులకు రూ.33,03,828/-లను అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సోమనబోయిన సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కారేపల్లి మండలంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న అటవీ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయటానికి కార్యాచరణతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. ఏజెన్సీలో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే విధంగా పోడు సమస్యను పరిష్కరిస్తానన్నారు. గొడవలకు తావు లేకుండా ప్రజల సంయమనం పాటించాలని, పోడు సమస్య పరిష్కరించే బాధ్యత తనదేనన్నారు. 24వ తేదిన పోలీసు, ఫారెస్ట్ అధికారులు పోడు సాగుదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, సామరస్యంగా సమస్యను పరిష్కరించుకుందామని సూచించారు. సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా కల్పించటమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ శకుంతల కిషోర్, ఎంపీడీవో జీ.సురేందర్, ఆర్ఐ లు సామినేని నరసింహారావు, జార్జ్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఆలోత్ ఈశ్వరిబాయి నందరాజ్, సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, మండల కో ఆప్షన్ ఎండి హనీఫ్, సొసైటీ డైరెక్టర్లు బానోత్ హీరాలాల్, కొత్తూరి రామారావు, పీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం

నవతెలంగాణ - బోనకల్

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు బోనకల్ మండల కాంగ్రెస్ నాయకులు గురువారం బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఘన స్వాగతం పలికారు. చింతకాని మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి బోనకల్ మీదుగా చింతకాని వెళ్తున్నారు. దీంతో బోనకల్ కాంగ్రెస్ నాయకులు బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్ పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మల్లు భట్టి విక్రమార్కకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్కకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు ఇళ్ల సమస్యల గురించి ప్రస్తావించారు. దీంతో ఆయన స్పందిస్తూ త్వరలోనే విలేకరులందరికీ ఇళ్ల స్థలాలు, ఇల్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా నవరసా ఫుడ్ కోర్టు మీద పలు ఆరోపణ రావటంతో నవరసా ఫుడ్ కోర్ట్ నిర్వహకుడు భట్టి విక్రమార్క వద్దకు వచ్చి తన తప్పు ఏమీ లేదంటూ చెప్పుకునే ప్రయత్నం చేశాడు. తమ వల్ల సమస్యలు రావడం లేదని, వేరేచోట వస్తున్నాయని భట్టికి వివరించారు. దీంతో భట్టి నవరసా ఫుడ్ కోర్ట్ నిర్వహకుడిని వివరాలు అడిగే ప్రయత్నం చేస్తుండగా కొంతమంది నవరసా ఫుడ్ కోర్టును ప్రభుత్వ స్థలంలో కట్టారని అన్నారు. దీంతో మల్లు భట్టి విక్రమార్క అతనితో ఏమి మాట్లాడకుండానే మౌనంగా ఉండిపోయారు. ప్రభుత్వ స్థలంలో నవరసా ఫుడ్ కోర్టును నిర్వహిస్తున్నారని భట్టి విక్రమార్కకు వివరించగానే నిర్వాహకులు అక్కడ లేకుండా వెళ్లిపోయారు. కొద్దిసేపు కాంగ్రెస్ నాయకులతో మాట్లాడి చింతకాని వెళ్లిపోయారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, కలకోట సొసైటీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు, నాయకులు భాగం నాగేశ్వరరావు, నల్లమోతు సత్యనారాయణ, గూడ నరసయ్య శాస్త్రి, నిమ్మతోట జనప్రియ కుమార్, బోనకల్ మాజీ సర్పంచ్ బుక్య సైదానాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మారుపల్లి ప్రేమ్‌కుమార్, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు చేపట్టాలి

ఉపాధ్యాయుల నిరసన



నవతెలంగాణ -దుమ్ముగూడెం

గిరిజన సంక్షేమ శాఖలో సుదీర్ఘంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు బోధనేతర సిబ్బందికి ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టాలని టీఎస్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కారం సర్వేశ్వరరావు దొర డిమాండ్ చేశారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు దొర మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్లకు అప్ గ్రేడ్, ప్రమోషన్లు కల్పించాలని, ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్లలో అర్హత కలిగిన వారితో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఒకే చోట పని చేయడం వల్ల మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణరావు, ఎన్. సత్యనారాయణ, బట్ట హరికృష్ణ, ఇర్పా అనసూయ, ప్రేమ్ కుమార్, కొర్సా వెంకటేశ్వరరావు, లక్ష్మి, ఆంజనేయులు, కళ్యాణి పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్

'పాన్ ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో..

ప్రత్యేకంగా అభినందించిన రాచకొండ సీపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు బంగారు పతకాలను సాధించిన హెడ్‌కానిస్టేబుల్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గౌరవాన్ని మరింత పెంచారు. రాచకొండ పరిధిలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్ కుమార్ 'పాన్ ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించారు. వీటితో పాటు ఈ ఏడాది ఫిబ్రవరి 22 నుంచి 25వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన 28వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ -2024 (ఏఎంఏ)లో 45 సంవత్సరాల విభాగంలో నాలుగు పతకాలు (1 బంగారు పతకం, 3 కాంస్య పతకాలు) అనిల్ కుమార్ సాధించారు. అందులో 4క్ష్మ400 మీటర్ల రిలేలో బంగారు పతకం, 800 మీటర్లు, 1500 మీటర్లు, 5000 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలు వరించాయి. త్వరలో సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాలో జరుగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్న సందర్భంగా గురువారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ తరుణ్ జోషి హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అథ్లెటిక్స్ క్రీడలను ప్రోత్సహిస్తామని తెలిపారు. అనిల్ కుమార్‌కు పోలీసు శాఖ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతలో పశ్చిమబెంగాల్ కీలకపాత్ర

గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర్య పోరాటం, భారతీయ తాత్వికత, జాతీయ సమైక్యత కోసం పశ్చిమబెంగాల్ కీలక పాత్ర పోషించిందని రాష్ట్ర గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్ తెలిపారు. ఆ రాష్ట్రం నుంచి శ్రీఅరబిందో, శ్రీరామకృష్ణపరమహంస తదితర ప్రముఖులు వచ్చారని గుర్తుచేశారు. గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ లో నిర్వహించిన పశ్చిమబెంగాల్ రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫుట్‌బాల్, క్రికెట్ వంటి క్రీడల్లోనూ ఆ రాష్ట్రం అమోఘమైన పాత్ర పోషించిందని చెప్పారు. తెలంగాణకు, పశ్చిమబెంగాల్‌కు మధ్య సుదీర్ఘమైన సాంస్కృతిక సంబంధాలున్నాయని కొనియాడారు. అనంతరం పలువురు బెంగాలీ ప్రముఖులను గవర్నర్ సత్కరించారు. వేడుకల్లో కళాకారులు బెంగాలీ నృత్య ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం, రాజ్‌భవన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

త్రిశంకు స్వర్గంలో వర్కర్ టూ ఓనర్ స్కీమ్

తుది నిర్మాణ దశకు వీవింగ్‌పార్క్

బాలారిష్టాలు దాటుకుని 88 ఎకరాల్లో రూపుదాల్చుకున్న షెడ్ల నిర్మాణం

పనుల్లేక, ప్రభుత్వ ఆర్డర్లు లేక నిస్సహాయస్థితిలో పరిశ్రమ

తాము ఓనర్లమెప్పుడవుతామనే ఆందోళనలో వస్త్ర కార్మికులు

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపైనే గంపెడాశలు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికుల్ని.. యజమానిగా చేస్తామని గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'వర్కర్ టూ ఓనర్' స్కీమ్ బాలారిష్టాలు దాటుకుంటూ ఏడేండ్ల తరువాత ఓ తుది దశకు చేరుకుంది. 88 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన వీవింగ్‌పార్క్ ఓ రూపుదాల్చుకుంది. రూ.375 కోట్లతో చేపట్టిన ఈ పార్క్‌లో షెడ్లు, ఇతర ఇంటీరియల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇక వర్కర్ ఓనర్ అయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని భావించిన నేపథ్యంలో మగ్గాలు నడవక, ప్రభుత్వ ఆర్డర్లు లేక సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రశ్నార్థకంగా మారింది. వర్కర్ టూ ఓనర్ స్కీమ్‌ను 'త్రిశంకు స్వర్గం'లోకి నెట్టేసినట్టయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ నిర్ణయాలపైనే కార్మికులు గంపెడాశలు పెట్టుకున్నారు.

సిరిసిల్ల నేత కార్మికులను ఓనర్లుగా మార్చేందుకు గత బీఆర్ఎస్ సర్కార్ వర్కర్ టూ ఓనర్ స్కీమును ఏడేండ్ల కిందట తీసుకొచ్చింది. ఇందుకు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు శివారులో వీవింగ్‌పార్క్ కోసం 88 ఎకరాల భూమి కేటాయించింది. ఈ స్కీమ్ రూపకల్పనలో భాగంగా సుమారు ఎనిమిది మంది కార్మికులు ఒకేచోట పని చేసేలా నిర్మాణాలు చేపట్టి దాన్ని ఒక యూనిట్‌గా పరిగణించింది. ఒక్కో గ్రూప్ కార్మికులకు పవర్‌లూమ్స్ అందజేసి, ప్రతి కార్మికునికీ స్టోర్ రూమ్ సహా 800 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయిస్తామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి కార్మికునికీ నాలుగు సెమీ ఆటోమేటిక్ పవర్ లూమ్‌లు, వైండింగ్ మిషన్‌ను అందజేస్తామని ప్రకటించింది. పార్కులో 60 వార్పింగ్ మిషన్లనూ ఏర్పాటు చేస్తామని చెప్పింది. మొత్తంగా సిరిసిల్లలోని సుమారు 30వేల మగ్గాలపై పని చేసే 6 వేల మంది కార్మికులు, అనుబంధ రంగాలైన డైయింగ్, కండెలు చుట్టడం, బీములు పోసే ఇతరత్రా పనుల్లో కార్మికులను కలుపుకుని మొత్తంగా 10వేల మంది వర్కర్లను ఓనర్లుగా మార్చుతామని గత సర్కారు ప్రకటించింది.

బాలారిష్టాలు దాటుకుంటూ..

2017 అక్టోబర్ 11న అప్పటి సీఎం కేసీఆర్ ఈ 'వర్కర్ టూ ఓనర్' పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత రూ.220కోట్లతో షెడ్ల నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నిర్మాణాల బాధ్యతను రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) చేపట్టింది. అయితే, ప్రారంభం నుంచి పనులు నత్తనడక సాగుతూ ఏడేండ్ల కాలం గడిచిపోయింది. మధ్యలో ముడిసరుకుల ధరలు పెరగడంతో యూనిట్ ధరను రూ.8లక్షల నుంచి రూ.15లక్షలకు పెంచిన గత సర్కారు వ్యయ అంచనాను రూ.375కోట్లకు పెంచింది. మొదటి దశలో 1,104 మంది నేత కార్మికులు కూర్చునేలా వర్క్ షెడ్లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. షెడ్ల నిర్మాణాలను పూర్తి చేసింది. అందులో 4416 పవర్‌లూమ్స్‌ను సైతం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మిగిలిన షెడ్లు, ఇతర పనులు తుదిదశలో ఉన్నాయి. అయినప్పటికీ ఈ ఏడేండ్లలో పనుల పురోగతిపై గత సర్కారు పెద్దగా దృష్టిసారించలేదనే విమర్శలున్నాయి. నిర్మాణ పనులపైగానీ, పురోగతి పైగానీ సమీక్షించిందీ లేదనే వాదనలు ఉన్నాయి. షెడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ లోపల ఇంటీరియల్ పనులు ఇంకా పూర్తవలేదు. ఆటోమెటిక్ మగ్గాలను బిగించేందుకు ఆర్డర్లు ఇవ్వలేదు. ప్రస్తుతం పాత ప్రభుత్వం కొనసాగించిన ప్రభుత్వ ఆర్డర్ల విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏ నిర్ణయాన్నీ తీసుకోలేదు. ఇక్కడి చేనేత కార్మికుల సంక్షేమ పథకాల కొనసాగింపుపైనా స్పష్టమైన కార్యాచరణ రూపొందించలేదు. ఈ నేపథ్యంలో 'వర్కర్ టూ ఓనర్' స్కీమ్ అమలు ఎప్పుడు ఉంటుందనేది చర్చ నడుస్తోంది.



వర్కర్ టు ఓనర్ ఉద్దేశమిదీ...

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులను యజమానులుగా చేయడమే వర్కర్ టూ ఓనర్ ప్రధానోద్దేశం. కార్మికులే యజమానులుగా మారి వస్త్రాలను ఉత్పత్తి చేస్తారు. ఈ పథకం అమలులోకి వస్తే సిరిసిల్లలో దాదాపు పది వేల మంది కార్మికులు ఓనర్లుగా మారనున్నారు. ఒక్కో కార్మికుడికి యూనిట్ కింద రూ.8 లక్షల విలువ చేసే నాలుగు ఆధునిక మరమగ్గాలను సమకూరుస్తారు. ఒక్కో షెడ్డులో 8 మంది కార్మికులకు యూనిట్లు కేటాయిస్తారు. ఆధునిక మరమగ్గాలపై వస్త్రాలు ఉత్పత్తి చేసేందుకు కార్మికులకు చేతినిండా పని కల్పిస్తారు. ఈ మొత్తం పెట్టుబడిలో 50శాతం రాయితీని ప్రభుత్వం కల్పించి మరో 40శాతం బ్యాంక్ రుణాన్ని అందిస్తారు. మిగిలిన 10శాతం పెట్టుబడిని మాత్రం కార్మికుడు భరించాల్సి ఉంటుంది. ఈ ఆలోచన సక్సెస్‌గా మారితే సిరిసిల్లలోని 30వేల మగ్గాలపై పని చేసే సుమారు 6వేల మంది కార్మికులు, మరో 4వేల మంది అనుబంధ రంగ కార్మికులంతా ఓనర్లుగా మారుతారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై కార్మికులు గంపెడాశలు పెట్టుకున్నారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ సోదాలు

అతని సోదరుడి నివాసంలోనూ

ఏకకాలంలో పలుచోట్ల దాడులు

అక్రమ మైనింగ్ వ్యవహారమే కారణమా..?

చర్చనీయాంశంగా మారిన పారిశ్రామిక ప్రాంతం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఈడీ దాడులు జరిగాయి. గురువారం ఉదయం నుంచే ఈడీ అధికారులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డితో పాటు బంధువుల ఇండ్లు, వారికి సంబంధించిన కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సుమారు 40 మందికి పైగా అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, అతని కుటుంబ సభ్యులు అక్రమ మైనింగ్, రియల్ ఎస్టేట్‌లో భారీఎత్తున పెట్టుబడులు పెట్టినట్టు ఆరోపణలు ఉండటంతో పాటు పలువురి ఫిర్యాదులతో ఈడీ అధికారులు రంగంలోకి దిగినట్టు సమాచారం. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామపంచాయతీ పరిధిలో మధుసూదన్ రెడ్డికి సంబంధించిన సంతోష్ సాండ్ మైనింగ్ తమకు కేటాయించిన భూమితోపాటు మరో 11 ఎకరాల్లో అక్రమ మైనింగ్ చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ అక్రమాలపై విచారణకు సంగారెడ్డి ఆర్డీవో నేతృత్వంలో ప్రత్యేక కమిటీని నియమించింది. అక్రమాలు జరిగినట్టు కమిటీ తేల్చడంతో గూడెం మధుసూదన్ రెడ్డిపై కేసు నమోదు చేసి గతంలో అరెస్టు చేశారు. 20 రోజులు సంగారెడ్డి జైల్లో ఉన్న ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. అనధికారికంగా మైనింగ్ చేసినందుకుగాను క్రషర్ యాజమాన్యానికి మైనింగ్ అధికారులు రూ.341 కోట్లపైన పెనాల్టీ విధించారు. దానికి తోడు రియల్ ఎస్టేట్ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టినట్టు ఆరోపణలు రావడంతో పాటు అక్రమ మైనింగ్‌పై పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈడీ అధికారులు ఎమ్మెల్యే, ఆయన బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించినట్టు తెలుస్తోంది. అక్రమ మైనింగ్ వ్యవహారంతో పాటు బినామీ పేర్లపై పెట్టుబడుల గురించి ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. సోదాలు పూర్తయితేనే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది. ఈడీ సోదాలతో పటాన్‌చెరువాడతోపాటు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

హామీల అమలుకు ఉద్యమాలు

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్

వైరాలో రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు ప్రారంభం



నవతెలంగాణ-వైరాటౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీల అమలు కోరుతూ త్వరలో రాష్ట్రస్థాయి ఉద్యమాలు నిర్వహిస్తామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్ తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా పట్టణంలోని పరుచూరి ఫంక్షన్ హాల్‌లో గురువారం బానోత్ బాలాజీ అధ్యక్షతన గిరిజన సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ, సామాజిక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సంఘం జెండాను సీనియర్ నాయకులు గుగులోత్ పంతు నాయక్ ఆవిష్కరించారు. అమరజీవి గుగులోతు ధర్మా నాయక్, భూక్యా జగ్యా నాయక్‌కు సంతాపం ప్రకటించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీరామ్ నాయక్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో అనుసరించిన గిరిజన వ్యతిరేక విధానాలపై ఎన్నికల్లో గిరిజనులు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ తీసుకొచ్చిన అటవీ సంరక్షణ నియమాల చట్టం 2023ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీలో 80శాతం రిజర్వేషన్లు గిరిజనులకు కేటాయిస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించాలని కోరారు. తెలంగాణలో గిరిజనులకు 6 నుంచి 10 శాతానికి పెంచిన రిజర్వేషన్ జీవో 33ను 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు కార్యాచరణ చేపట్టడానికి తక్షణం గిరిజన శాఖ మంత్రిని నియమించాలని, లేకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మైదాన ప్రాంతం జిల్లాల్లో ఐటీడీఏలను ఏర్పాటు చేయాలన్నారు. ట్రైకార్ సంస్థను మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రకారం విధివిధానాలు రూపొందించి గిరిజన నిరుద్యోగులు పెట్టుకున్న దరఖాస్తులన్నింటికీ 90 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని కోరారు. తండాల గ్రామ పంచాయతీ లకు రెవెన్యూ హోదా ఇవ్వడంతోపాటు, తండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలనే డిమాండ్లపై త్వరలోనే అన్ని గిరిజన సంఘాలతో కలిసి ఐక్య కార్యాచరణ చేపడతామని తెలిపారు. జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. వర్షాకాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న పోడు భూముల హక్కు పత్రాలను పంపిణీ చేయడానికి కార్యాచరణ రూపొందించాలని, గిరిజనులపై దాడులు ఆపాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బానోత్ బన్సీలాల్, భూక్య జ్యోతి పాల్గొన్నారు.

ఐఐఎంలో సీటు సాధించిన అంధ విద్యార్థిని

నవతెలంగాణ-జహీరాబాద్



సాధారణ రైతు కుటుంబం.. అందునా అంధత్వాన్ని జయించి జాతీయ స్థాయి ఐ.ఐ.ఎం (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) పోటీ పరీక్షల్లో విద్యార్థిని మంచి ప్రతిభ కనబర్చి సీటు దక్కించుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని గడీకి చెందిన కోత్తకాపు గోపాల్ రెడ్డి- విజయలక్ష్మి దంపతుల రెండో సంతానమైన శివాని అంధురాలు. అయినా చదువు పట్ల ఉన్న ఆసక్తితో ఉన్నత శిఖరాలకు ఎదగాలనే లక్ష్యంతో కష్టపడింది. అందుకు తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహం తోడైంది. ప్రాథమిక, ఉన్నత విద్యను హైదరాబాద్ బేగంపేట్‌లోని దేవనార్ పబ్లిక్ స్కూల్‌లో కొనసాగించి.. పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ విద్యను జహీరాబాద్‌లోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో కామర్స్ కోర్సు పూర్తి చేశారు. చెన్నైలోని సత్యబామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బిబిఎ కోర్స్ పూర్తి చేసింది. క్యాట్ ఎగ్జామ్ కోసం ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకొని 2023లో నిర్వహించిన ఐ.ఐ.ఎం కోర్స్ కోసం పరీక్ష రాసింది. దేశంలో 21 ఐఐఎం కళాశాలలు ఉండగా, 19 ఐఐఎం కళాశాలల్లో అర్హత సాధించింది. అందులో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ ఐఐఎంను ఎంపిక చేసుకుంది. రెండు సంవత్సరాల ఐఐఎం కోర్స్ విజయవంతంగా పూర్తి చేసి ఉన్నత స్థానానికి చేరుకుని తల్లిదండ్రులకు, తాను పుట్టిన ప్రాంతానికి మంచి పేరు తేవాలన్నదే తన లక్ష్యమని శివాని స్పష్టం చేశారు.

అమరావతి, పోలవరం సంపద సృష్టి కేంద్రాలు

ప్రజా రాజధానిని విధ్వంసం చేశారు

ఒక మూర్ఖుడితో రాష్ట్రానికి తీరని నష్టం

రాజధాని పనులపై వైట్‌పేపర్

ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతిలో పర్యటన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రానికి అమరావతి, పోలవరం సంపద సృష్టి కేంద్రాలని...గత పాలకుల మూర్ఖత్వం వల్లే రెండూ విధ్వంసానికి గురయ్యాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రాజధాని అమరావతిని అపహాస్యం చేసి విధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో తన రెండో పర్యటనలో భాగంగా ఆయన గురువారం అమరావతిలో పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన, విధ్వంసాలకు గురైన నిర్మాణాలు, శిథిలాలను పరిశీలించారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చిన ఉండవల్లిలోని ప్రజావేదిక శిథిలాలను తొలుత వీక్షించారు. అక్కడి నుంచి బయలుదేరి ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా నాడు రాజధానికి భూమిపూజ జరిగిన వేదిక వద్ద మోకాళ్లపై ప్రణమిల్లారు. అక్కడ నుంచి బయలుదేరి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మించిన గృహాలను చూశారు. తరువాత ఆలిండియా సర్వీసెస్ న్యాయమూర్తుల కోసం నిర్మించిన భవన సముదాయాలనూ పరిశీలించారు. అనంతరం మంత్రుల నివాస గృహాలు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల, నాల్గో తరగతి ఉద్యోగుల కోసం నిర్మించిన అపార్ట్‌మెంట్లను పరిశీలించారు.

ఏ అంటే అమరావతి....పీ అంటే పోలవరం

'రాజధాని కోసం భూములిచ్చిన రైతులు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. "అనేక సవాళ్లను, కేసులను అధిగమించి 1,631 రోజులు ఆందోళనలు చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో రైతులు ఆందోళనలు విరమించారు. రాజధాని కోసం రైతులు చేసిన పోరాటం...భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. ఏపీ అనే పదంలో ఏ అంటే అమరావతి...పీ అంటే పోలవరం. అమరావతి ప్రజారాజధాని...తెలుగువారికి చిరునామాగా ఉంటుంది. 5 కోట్ల మంది ప్రజలకు దశ, దిశను నిర్దేశిస్తుంది. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గర్వంగా పనులు చేసుకోవచ్చు. కానీ రాజధానిని జగన్ అతలాకుతలం చేశారు. దక్షిణ భారతదేశంలో ఎక్కువనీళ్లు ఉండే నది గోదావరి. పోలవరం నిర్మాణం జరిగి నదులు అనుసంధానం చేస్తే ప్రతి ఎకరాకు నీళ్లివ్వచ్చు. విభజన అనంతరం రాజధాని కట్టుకోవడానికి ఆర్థిక తోడ్పాటు, పోలవరం పూర్తి చేసుకునేందుకు కేంద్రం వెసులుబాటు కల్పించింది. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, అమరావతి రాజధానికి ఆర్థిక సాయం చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చింది." అని ఆయన అన్నారు.

పోలవరం-అమరావతి వ్యక్తిగత అంశాలు కావు..

'ప్రజలు కూటమికి ఏకపక్షంగా ఓట్లు వేశారు...రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద విజయం ఎప్పుడూ రాలేదు. ఒక వ్యక్తి ముఖ్యమంత్రి పదవికి పనికిరాడని ప్రజలు తీర్పు ఇచ్చి 11 సీట్లకు పరిమితం చేశారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి, అర్హతలేని వ్యక్తి సీఎం అయితే రాష్ట్రం ఎంత నష్టపోతుందో గత ఐదేండ్లలో చూశాం. పోలవరం, అమరావతి ప్రాజెక్టులు వ్యక్తిగత అంశానికి సంబంధించినవి కాదు... వాటి ద్వారా సంపద సృష్టి జరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది....అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పెరుగుతాయి. పోలవరం పూర్తి చేసి, నదుల అనుసంధానం పూర్తయితే రాయలసీమ రతనాలు సీమ అవుతుంది. గత ప్రభుత్వం పోలవరంను గోదావరిలో కలిపింది. పోలవరానికి శాపంగా మారిన వ్యక్తి వల్ల, ఆయన మూర్ఖత్వం వల్ల ఖర్చు కూడా రెట్టింపైంది." అని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

త్వరలో శ్వేతపత్రం విడుదల

"రాజధానిలో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి...పైగా ఇష్టానుసారంగా విధ్వంసం చేశారు. పైపులు, ఇసుక దొంగతనం చేయడంతో పాటు రోడ్లను కూడా తవ్వుకుపోయారు. ఒక్క బిల్డింగును కూడా పూర్తి చేయలేదు. రోడ్ల నిర్మాణాలన్నీ సగంలో ఆగిపోయాయి. కొన్ని బిల్డింగ్‌లు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీల భవనాలు, మంత్రుల భవనాలు, గెజిటెడ్ అధికారుల, నాన్ గెజిటెడ్ అధికారుల భవనాల నిర్మాణాలు ప్రారంభించాం....ఆ పనులన్నీ అర్ధాంతరంగా నిలిపేశారు. శ్వేతపత్రం విడుదల చేసి రాజధాని ప్రస్తుత పరిస్థితిపై ప్రజలకు వివరాలన్నీ తెలుపుతాం. ప్రజల్లో కూడా గత ప్రభుత్వం విధ్వంసంపై చర్చ జరగాలి. ఏం చేయాలనే దానిపై అధ్యయనం చేయాల్సి ఉంది." అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

గర్వంగా తలెత్తుకు తిరిగే రాజధాని అమరావతి

'తెలుగుజాతి గర్వంగా, గౌరవంగా తలెత్తుకు తిరిగే రాజధాని అమరావతి. విశాఖను ఆర్థిక రాజధానిగా, కర్నూలును ఆధునిక నగరంగా తయారు చేయాలనుకున్నాం. కేంద్రం 12 విద్యా సంస్థలను ఇచ్చింది. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, మంగళగిరిలో ఎయిమ్స్, విశాఖలో ఐఐఎం, తాడేపల్లిలో ఎన్ఐటీ, ఒంగోలులో ఐఐటీ, విజయనగరంలో గిరిజన యూనివర్సిటీని...ఇలా ప్రాంతాల వారీగా నెలకొల్పాం. కానీ గత ప్రభుత్వం ఏదీ జరగ నివ్వలేదు ..ముందుకు సాగనివ్వలేదు. రాజధానిపై ఇష్టారీతిన బురదజల్లారు. నిత్యం విష ప్రచారం చేశారు... బ్రాండ్ దెబ్బతీయడానికి ప్రయత్నించారు. ఇన్ సైడర్ ట్రేడింగ్ అన్నారు...స్విస్ ఛాలెంజ్‌లో మోసం అన్నారు. సింగపూర్ కన్సార్టియంపైనా విషం చిమ్మి తరిమేశారు. రాష్ట్రానికి మధ్యలో ఉండేలా ఎక్కడైనా రాజధాని పెట్టండని శివరామకృష్ణ కమిటీ నివేదికలో చెప్పింది. దానికి అనుగుణంగానే 12 పార్లమెంట్ స్థానాలు ఒకవైపు...మరో 12 పార్లమెంట్ స్థానాలు ఇంకోవైపు ఉండేలా చూసి...గుంటూరు సెంట్రల్ గా అమరావతిని రాజధానిగా గుర్తించాం." అని చంద్రబాబు వివరించారు.

మూడు ముక్కలాట

'మూడు రాజధానులు అని మూడు ముక్కలాట ఆడారు. పదేండ్ల తర్వాత రాజధాని ఏది అంటే చెప్పుకోలేని దుస్థితికి తీసుకొచ్చారు.

రాజధాని నిర్మాణానికి డబ్బులు ఎక్కడివి అని మాట్లాడారు. రైతులు ఇచ్చిన భూములే కాకుండా ప్రభుత్వ భూములు కలుపుకుని 55 వేల ఎకరాలను సేకరించాం. 29 వేల మంది రైతుల్లో ఒక్కరు కూడా కోర్టుకు వెళ్లకుండా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. ఒక ప్రాజెక్టు కట్టాలంటే భూమి ఇవ్వడానికి ఇష్టపడని ఈ రోజుల్లో రాజధాని కోసం ముందుకు వచ్చి రైతుల భూములు ఇచ్చారు. వారిచ్చిన భూములు, ప్రభుత్వ భూముల్లో రోడ్లు, బిల్డింగులు, ఇతర నిర్మాణాలు పోను మిగిలిన భూములు అమ్మితే రాజధానిని నిర్మించుకోవచ్చు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని నేను మొదటి నుండి చెప్తూనే ఉన్నా. ఇక్కడ వచ్చే ఆదాయమే రాజధాని నిర్మాణానికి సరిపోతుంది. రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు కూడా రాజధాని సంపదతోనే అమలు చేయవచ్చు...కానీ గత పాలకులు నిర్వీర్యం చేశారని చంద్రబాబు విమర్శించారు.

రాజధాని విధ్వంసంపై ప్రజలకు వివరిస్తాం...

"ఐదేండ్లు పట్టించుకోకపోవడంతో బిల్డింగులన్నీ బూజు పట్టాయి. కొన్నింటిని పగలగొట్టారు. రాజధానికి వ్యతిరేకంగా ఏమేం చేయాలో అన్నింటినీ చేశారు. కాపాడుకోవాలనుకున్న రైతులపైనా పోలీసులు ఏకపక్షంగా కేసులు పెట్టారు. నిర్మాణాల కోసం కాంట్రాక్టర్లు తెచ్చిపెట్టిన మెటీరియల్ దోచుకెళ్లారు. రాజధానిలో గత ప్రభుత్వం ఎంతటి నష్టం కలిగించిందో ప్రజలకు వివరిస్తాం. బ్రహ్మాండంగా ఉండాల్సిన రాజధానిలో..ఇప్పుడు తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలతో కమ్మేసుకుంది. ఇవన్నీ బాగుచేస్తాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

నిరుద్యోగ మార్చ్ కాదు... బీఆర్ఎస్ కార్యకర్తల మార్చ్

వారి గురించి మాట్లాడే అర్హత గులాబీ నేతలకు లేదు

టీపీసీసీ అధికార ప్రతినిధులు రియాజ్, చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగుల మార్చ్ పేరుతో బీఆర్ఎస్ రాజకీయం చేయడం సిగ్గు చేటని టీపీసీసీ అధికార ప్రతినిధులు రియాజ్, చనగాని దయాకర్ అన్నారు. ఆ పార్టీ నిరుద్యోగ మార్చ్ పేరుతో కార్యకర్తల మార్చ్ నిర్వహించిందని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు రవళిరెడ్డి, డాక్టర్ లింగం యాదవ్‌తో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కారు ఎంతో మంది నిరుద్యోగులను పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉద్యోగుల నోటిఫికేషన్లు వేయడం లేదంటూ మనస్థాపానికి గురైన నిరుద్యోగ యువతి ప్రవల్లిక హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవల్లిక విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ పోలీసుల సహకారంతో కట్టు కథలు చెప్పించి ఆమె కుటుంబాన్ని సైతం ఆవేదనకు గురి చేశారని విమర్శించారు. ఆమె ఆత్మహత్యను కూడా హేళన చేసిన చరిత్ర వారిదని వాపోయారు. పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ సర్కారు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన అశోక్ కుమార్ వెనుక కేటీఆర్ పైసల ముఠా ఉందని ఆరోపించారు. బీఆర్ఎస్ నిర్వహించిన నిరుద్యోగుల మార్చ్ కార్యక్రమంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఏ ఒక్క నిరుద్యోగి కూడా లేడని చెప్పారు. అడ్డా మీది కూలీలతో మార్చ్ నిర్వహించడం ద్వారా కేటీఆర్ కుట్రకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగ జాబ్ క్యాలెండర్ దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ మాత్రం కృత్రిమ ఉద్యమాన్ని సృష్టించే పనిలో పడిందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని వారు హెచ్చరించారు.

అరుంధతీ రాయ్... ప్రసిద్ధ రచయిత్రి, ఉద్యమకారిణి అయిన ఈమె బుకర్ ప్రైజ్ పొందిన మొట్టమొదటి భారతీయురాలిగా చరిత్రకెక్కారు. నర్మదా బచావ్ ఉద్యోమంలో కీలకపాత్ర పోషించారు. మతోన్మాదులను తన రచనలతో చీల్చి చండాడుతున్నారు. అలాంటి వ్యక్తిని ఉపా చట్టం కింద అరెస్టు చేయాలంటూ ఆర్డర్లు జారీ చేశారు. ఇక్కడ విచిత్రం ఏమిటంటే 13 ఏండ్ల కిందట ఆమెపై పెట్టిన ఓ కేసును ఆధారం చేసుకొని ఇప్పుడు అరెస్టు చేయడం. ఇంతకీ ఆమెపై పెట్టిన ఆ కేసేంటి? ఇన్నేండ్ల తర్వాత ఆమెపై ఉపా చట్టం ఎందుకు ప్రయోగించారో ఈ రోజు మానవిలో తెలుసుకుందాం...



ప్రశ్నించడమే ఆమె నేరమా..?

ఇలా తినండి..

తులసిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి. తులసిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా శరీరాన్ని రక్షిస్తాయి. అసిడిటీ ఉన్నవారు ఉదయం ఖాళీ కడుపుతో తులసి ఆకులు నమిలితే తగ్గుతుంది. తులసి నీరు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.



తులసి ఆకులతో టీ తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఒత్తిడి తగ్గుతుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను నమలడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. బరువు తగ్గుతారు. జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. తులసి అనేక రుగ్మతలకు దివ్యౌషధంగా పనిచేస్తుంది. తులసి ఆకులు, పసుపు పొడి వేసి మరిగించిన నీటిని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

తులసిలో ఉండే యూజీనాల్ అనే సమ్మేళనం టైప్ 2 డయాబెటిస్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. తులసి ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. తులసిలో శరీరంలో మంటను తగ్గించే సమ్మేళనాలు ఉన్నాయి. ధమనుల వాపును తగ్గించడం ద్వారా, తులసి ఆరోగ్యకరమైన రక్త ప్రవాహాన్ని నిర్వహించడానికి, కొలెస్ట్రాల్ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. తులసి నీరు తాగడం వల్ల మలబద్ధకం, విరేచనాల సమస్యలు తగ్గుతాయి. ఇందులో ఉండే ఔషధ గుణాలు వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే జ్వరం త్వరగా తగ్గిస్తాయి. ■

అరుంధతి రాయ్ మేఘాలయలోని షిల్లాంగ్లో జన్మించారు. కేరళకు చెందిన యలయాళీ జాకోబైట్ సిరియస్ క్రైస్తవ మహిళా హక్కుల కార్యకర్త అయిన మేరీ రాయ్ ఈమె తల్లి. కోల్‌కతాకు చెందిన బెంగాలీ బ్రహ్మ సమాజీ, టీ తోటల నిర్వాహకుడు రాజీబ్ ఈమె తండ్రి. తనను అందరూ బ్రహ్మణురాలు అంటే ఆమె తీవ్రంగా ఖండించేవారు. ఆమెకు రెండేండ్ల వయసు ఉన్నప్పుడు ఆమె తల్లిదండ్రులు విడిపోయారు. తర్వాత ఆమె తన సోదరుడితో కలిసి కేరళ వచ్చేశారు. కొంత కాలం వారి కుటుంబం మేరీ తల్లిదండ్రుల గడిపారు. కేరళ వచ్చిన తర్వాత మేరీ సొంతంగా పాఠశాల ప్రారంభించారు.

టెలివిజన్ జీవితం...

కొట్టాయంలోని కార్పస్ క్రిస్టీలో తన పాఠశాల విద్యను అభ్యసించారు. ఆ తర్వాత తమిళనాడులోని నీలగిరిలోని లారెన్స్ స్కూల్, లవ్‌డేల్‌లో చదివారు. ఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో ఆరికటెక్చర్ అభ్యసించారు. అక్కడ ఆర్కిటెక్ట్ గెరార్డ్‌ను డా కున్హాను కలిశారు. వారు 1978లో వివాహం చేసుకున్నారు. అయితే 1982లో వీరు విడిపోయారు. ఢిల్లీ వచ్చిన అరుంధతికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్‌లో స్థానం లభించింది. అక్కడే 1984లో ఆమెకు సినీ నిర్మాత ప్రదీప్ కిషన్‌తో పరిచయం ఏర్పడింది. అతనికి అవార్డు తెచ్చిపెట్టిన మస్సే సాహిబ్‌లో మేకల కాపరి పాత్ర కోసం ఆమెను అడిగారు. అదే ఏడాది వారిద్దరూ పెండ్లి చేసుకున్నారు. ఇద్దరూ కలిసి స్వాతంత్ర్య ఉద్యమం గురించి టెలివిజన్‌లో ధారావాహిక తీసుకొచ్చారు. అలాగే ఎలక్ట్రిక్ మూన్ అనే రెండు చిత్రాలకు పని చేశారు.



అనుభవాల ఆధారంగా...

1988లో ఇన్ విచ్ అన్నీ గివ్స్ ఇట్ దోస్ వోన్స్ చిత్రానికి ఆమె ఉత్తమ స్క్రీన్ ప్లే జాతీయ చలన చిత్ర అవార్డును అందుకున్నారు. ఆర్కిటెక్చర్ విద్యార్థిగా తన అనుభవాల ఆధారంగా రూపొందించిన చిత్రమిది. 1994లో పూలన్‌దేవి జీవితం ఆధారంగా తీసిన శేఖర్ కపూర్ చిత్రం బాండిట్ క్వీన్‌ను విమర్శించడంతో ఆమె అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ది గ్రేట్ ఇండియన్ రేప్ ట్రిక్ అనే తన చలన చిత్ర సమీక్షలో ఆమె మహిళపై తన అనుమతి లేకుండా అనుభవించడం అనే హక్కును ప్రశ్నించారు. ఈ రెండు చిత్రాలు మహిళల జీవితాలను కించపరిచే విధంగా ఉన్నాయని వీటిని తప్పుగా చిత్రీకరించారని కపూర్‌ను ఆమె విమర్శించారు. ఇలాంటి చిత్ర పరిశ్రమపై విసుగుచెంది ఏరోబిక్స్ తరగతులు ప్రారంభించారు.

రచయిత్రిగా...

1992లో ఆమె తన మొదటి నవల రాయడం ప్రారంభించారు. దీన్ని 1996లో పూర్తి చేశారు. ఈ పుస్తకం సెమీ ఆత్మకథ. తన చిన్ననాటి అనుభవాల ఆధారంగా రాసింది. ఆమె ప్రచురించిన 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' అనే నవల ఆమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఇది 1997లో ఫిక్షన్ విభాగంలో బుకర్ ప్రైజ్ అందుకుంది. ది న్యూయార్క్ టైమ్స్ నోటబుల్ బుక్స్ ఆఫ్ ది ఇయర్‌లో ఒకటిగా గుర్తించబడింది. బెస్ట్ సెల్లర్స్ జాబితాలో నాల్గవ స్థానానికి చేరుకుంది. 18 దేశాల్లో ఈ పుస్తకం అమ్ముడు పోయింది. ఈ పుస్తకం విజయవంతం అయిన తర్వాత ఆమె టెలివిజన్‌కు 'ది బన్యన్ ట్రీ' అనే ధారావాహికతోపాటు 'ఎ ఫిల్మ్ విత్ అరుంధతీ రాయ్' అనే డాక్యుమెంటరీ రాశారు. 2007లో తన రెండవ నవల 'ది మినిస్ట్రీ ఆఫ్ అట్మోస్ట్ హ్యాపీనెస్' మొదలుపెట్టారు. 2016లో దీన్ని పెంగ్విన్ ఇండియా, హమీష్ హామిల్టన్ యూకే వారు ఈ పుస్తకాన్ని ప్రచురిస్తామన్నారు. ఈ నవల 2017లో మ్యాన్ బుకర్ ప్రైజ్‌కు ఎంపిక చేయబడింది. 2018లో ఫిక్షన్ కోసం నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డుకు ఫైనలిస్ట్‌గా ఎంపికయింది.

> మతోన్మాద విధాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా తనకు ఇచ్చిన పురస్కారాన్ని సైతం వెనక్కు ఇచ్చేసిన ధైర్యశాలి ఆమె. అందుకే ఆమెపై కేంద్రం కక్ష సాధింపుకు పాల్పడింది.

ఆజాదీ

ఆమె రచించిన ఆజాదీ పుస్తకం ఫ్రెంచ్ అనువాదానికి 45వ యూరోపియన్ ఎస్సే ప్రైజ్‌లో జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. యావత్ ప్రపంచం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను అరుంధతి తన కలం ద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. ప్రపంచాన్ని భయకంపితుల్ని చేస్తున్న ఉగ్రవాదం, ఫాసిజం గురించి అది చేసే దాష్టీకాలను, మారణ హోమాన్ని ఈ పుస్తకంలో కండ్లకు కట్టినట్టు రాశారు. ఎందరో జీవితాలను ప్రభావితం చేసేలా ఇందులోని వ్యాసాలు ఉన్నాయి. అజాది అనే పేరు కూడా సరిగ్గా సరి పోయిందంటూ బహుమతి అందించిన ఫౌండేషన్ కితాబు ఇచ్చింది. ఎలాంటి కల్పితాలు లేకుండా వాస్తవాల ప్రాతిపదికన ప్రతింబించేలా ఉన్నాయని కూడా ప్రశంసించింది. అలాగే సమకాలీన రాజకీయాలు, సంస్కృతికి సంబంధించిన అనేక వ్యాసాలు కూడా ఆమె రాశారు. 2014లో పెంగ్విన్ ఇండియా ఐదు వాల్యూమ్స్‌గా తీసుకొచ్చారు. 2019లో హేమార్కెట్ బుక్స్ ప్రచురించిన మై సెడిషియస్ హార్ట్ అనే ఒకే సంపుటిలో నాన్ ఫిక్షన్ పుస్తకం తీసుకొచ్చారు.





అందుకే ఉపా చట్టం

నర్మదా డ్యామ్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా మేధా పాట్కర్‌తో కలిసి ప్రచారం చేశారు. తనకు ప్రైజ్‌గా వచ్చిన డబ్బును ఈ ఆందోళనకు విరాళంగా ఇచ్చారు. సామ్రాజ్యవాదం, పారిశ్రామికీకరణ, ఆర్థిక వృద్ధి పట్ల భారతదేశ విధాలను వ్యతిరేకిస్తూ ఆమె అనేక రచనలు చేశారు. అలాగే కాశ్మీరీ సమస్యపై కూడా 13 ఏండ్ల కిందట స్పందించారు. దాంతో ఆమెపై కేసు పెట్టి జైలుకు పంపారు. ఇప్పుడు ఉపా చట్టం ప్రయోగించారు. కార్పొరేట్లకు, వ్యాపారవేత్తలకు తప్ప సామాన్యులకు న్యాయం చేయని మోడీ ఎన్నికను ఆమె మొదటి నుండి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మతోన్మాద విధాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా తనకు ఇచ్చిన పురస్కారాన్ని సైతం వెనక్కు ఇచ్చేసిన ధైర్యశాలి ఆమె. అందుకే ఆమెపై కేంద్రం కక్ష సాధింపుకు పాల్పడుతున్నది. విచిత్రం ఏమిటంటే ఆమెపై వచ్చిన ఫిర్యాదు దాదాపు 13 ఏండ్ల కిందటిది. ఇప్పటికే బ్యాంకులకు కన్నాలు వేసి, కోట్లు కొల్లగొట్టిన బడా బాబులు, ఆర్థిక నేరస్థులకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రజల పక్షాన తన గొంతును వినిపిస్తూ, కలం ఝులిపిస్తున్న అరుంధతీ రాయ్‌ను మాత్రం అడ్డు కోవడం ఎంత వరకు సబబు అనేది బుద్ధి జీవులందరూ ఆలోచించాల్సిన విషయం. ■

అలా కుదరదు

పాట్నా : విద్య ఉద్యోగ రంగాల్లో బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ బీహార్ ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలను పాట్నా హైకోర్టు గురువారం రద్దు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేపట్టిన నితీశ్ కుమార్ ప్రభుత్వం .. నివేదిక ఆధారంగా 50 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది.

రిజర్వేషన్ల సవరణ బిల్లు ప్రకారం.. ఇబిసిలకు 18 శాతం నుంచి 25 శాతం, బీసీలకు 12శాతం నుంచి 18 శాతం, ఎస్సీకి 16 శాతం నుంచి 20 శాతం, ఎస్టీ 1 శాతం నుంచి 2 శాతానికి పెంచింది. బీసీ మహిళలకు అప్పటివరకు ఉన్న 3 శాతం రిజర్వేషన్‌ను రద్దు చేశారు. ఇక, ఆర్థికంగా వెనకబడినవారిని ఉద్దేశించిన 10శాతం రిజర్వేషన్లు కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి.

ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ గౌరవ్ కుమార్, ఇతరులు పాట్నా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై సుదీర్ఘ విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి కె.వి. చంద్రన్‌తో కూడిన డివిజన్ బెంచ్ మార్చి 11, 2024న తీర్పును రిజర్వ్ చేసింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలకు 65 శాతం రిజర్వేషన్‌ను పెంచడంతో ప్రభుత్వ సర్వీసులో జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 35 శాతం పోస్టులు మాత్రమే ఇవ్వగలిగారని న్యాయవాది దినుకుమార్ కోర్టుకు తెలిపారు. జనరల్ కేటగిరీలో ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా బలహీన వర్గాలు)కి ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్‌ను రద్దు చేయడం రాజ్యాంగంలోని సెక్షన్ 14, సెక్షన్ 15(6),(బి)కి విరుద్ధమని వాదించారు. కులగణన సర్వే అనంతరం దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. ఇందిరా సాహ్ని కేసులో రిజర్వేషన్ల పరిమితిపై సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి విధించిందని తెలిపారు. ఈ కేసు ప్రస్తుతం విచారణలో ఉంది.

ఎన్టీఏను రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ నివాసం ఎదుట ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను బలవంతంగా అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సర్వకళాశాల ఎదుట నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై పోలీసులు దారుణంగా దాడి చేశారు. యూపీతో పాటు బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లోనూ విద్యార్థులు ఆందోళనకు దిగారు.

మంత్రివర్గంలో మా సమస్యలు చర్చించండి

- రవాణామంత్రికి టీఎస్ఆర్టీసీ ఈయూ వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ విలీనం, కార్మికుల సమస్యల పరిష్కారాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకొని, అమలు చేయాలని టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. శనివారం ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈయూ రాష్ట్ర కమిటీ తరఫున ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న గురువారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీలో యూనియన్ల కార్యకలాపాలను పునరుద్ధరించాలనీ, ప్రభుత్వంలో విలీన ప్రక్రియను పూర్తిచేయాలని, కార్మికులకు రావల్సిన పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలు అందచేయాలని కోరారు.

సింగరేణి విచ్ఛిన్నానికి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

అడిగేందుకు ఎలాంటి భేషజాలూ లేవన్నారు.

ఆ రెండు గనులను సింగరేణికి అప్పగించాలి

ఇటీవల వేలంలో పెట్టిన సత్తుపల్లి, కోయగూడెం ఓపెన్‌కాస్టు గనులను సింగరేణికి అప్పగించాలని భట్టి డిమాండ్ చేశారు. 2015లో మైన్స్ అండ్ మినరల్ యాక్ట్ చేసినప్పుడు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్.. ఇప్పుడు దానికి భిన్నంగా వేలం పాటలు నిర్వహించొద్దనడం 'దొంగే దొంగ' అని అరిచినట్టుగా ఉందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఎంఎండీఆర్ యాక్ట్ ప్రకారం వేలం నిలుపుదలకు ప్రయత్నిస్తామన్నారు. 42వేల మంది ప్రత్యక్షంగా, 22వేల మంది పరోక్షంగా..మరో 50వేల మంది సంస్థ ఆధారంగా ఉపాధి పొందుతున్నారని వివరించారు. అటువంటి సింగరేణి సంస్థను కాపాడాలని యూనియన్లు లేఖ ఇచ్చాయని తెలిపారు. కిషన్‌రెడ్డి, మోడీ రాష్ట్ర ప్రయోజనాల కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిర్ణీత గడువులో కోయగూడెం, సత్తుపల్లి ఓసీల వేలం పూర్తి చేయలేదు కాబట్టి నాటి 5శాతానికి ఇంకో 0.5 శాతం ఇస్తాం.. వాటిని సింగరేణికే ఇవ్వాలని అడుగుతామన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి విధ్వంసం

బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి విధ్వంసం జరిగిందని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. 2015లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన మైన్స్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ యాక్ట్‌కు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు తమకు సన్నిహితమైన అరబిందో, ఆరో, అవంతిక, ప్రతీమ వంటి సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు కేసీఆర్ ప్రయత్నించారని ఆరోపించారు. వేలంలో పాల్గొనేందుకు కేసీఆర్ అనుమతివ్వకపోవడం వల్లే సత్తుపల్లి, కోయగూడెం ఓసీలు సింగరేణికి దక్కలేదని ఆరోపించారు. ఈ కంపెనీల ద్వారా బీజేపీకి ఎన్నికల బాండ్స్ రూపంలో లబ్ది చేకూరిందన్నారు. సింగరేణి సంస్థ, ఆస్తులు, కొత్తగనులను కాపాడుకోవడం కోసం తాము పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ బొగ్గు గనుల శాఖమంత్రిని కలిశామని, ప్రస్తుత మంత్రిని కూడా కలుస్తామని చెప్పారు. అవసరమైతే ప్రధానినీ కలిసేందుకు సిద్ధమన్నారు.

సింగరేణి సంసిద్ధంగా లేకుంటేనే వేలం వేయాలి: మంత్రి తుమ్మల

సింగరేణి సంసిద్ధత వ్యక్తం చేయకపోతేనే బొగ్గు గనులను వేలం వేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 2016లో ఒడిషా ప్రభుత్వ మైన్ఏ కంపెనీకి అప్పగించినట్టుగానే సింగరేణికి గనులను అప్పగించాలన్నారు. సింగరేణిని విచ్ఛిన్నం చేయాలనే బీజేపీ, బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నా యన్నారు.

ఉద్యోగులను తగ్గించిన కేసీఆర్ : కూనంనేని

తెలంగాణ రాక ముందు లక్ష మందికి పైగా సంస్థలో ఉద్యోగులు ఉంటే.. రాష్ట్రం వచ్చాక 42వేలకు కేసీఆర్ తగ్గించారని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఆనాడు మైనింగ్ బిల్లును సమర్థించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. సింగరేణి పరిరక్షణకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చెంచు గిరిజన మహిళను చిత్రహింసలు పెట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం ధర్మానాయక్ ఆర్.శ్రీరామ్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజక వర్గం మూలచింతలపల్లి చెంచుగూడెంలో చెంచు ఈశ్వరమ్మపై బండి వెంకటేశం, శివ, సలేశ్వరం అత్యంత పాశవికంగా దాడి చేశారని వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడటమే కాక, అతి ధారుణంగా వ్యవహరించారనీ, డీజిల్ పోసి హత్య యత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. పది రోజులపాటు నిర్బంధించి విపరీతంగా చిత్రహింసలు పెట్టారని తెలిపారు.

ఆమె పొలాన్ని కౌలుకు తీసుకుని తమతోటే వెట్టి చాకిరి చేయించుకున్నారని పేర్కొన్నారు.తమకు బానిసగా ఉండలేదన్న కక్షతో ఈ ధారుణానికి ఒడిగట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానిక అధికారులు స్పందించి ఆ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలనీ, మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

చెంచు మహిళపై పాశవిక దాడి

(మొదటిపేజీ తరువాయి)

చెబితే.. కాల్చేస్తామని బెదిరించారు. ఈ అమానుష ఘటన నల్లమల అటవీ ప్రాంతంలో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. మొలచింతలపల్లి చెంచు పెంటకు చెందిన కాట్రావత్ ఈశ్వరమ్మపై బండి వెంకటేశ్వర్లు, అతని భార్య శివమ్మ, తమ్ముడు శివ కలిసి దాడి చేసి బయటకు పొక్కకుండా రహస్యంగా ఉంచారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి చెంచు పెంటకు చెందిన కాట్రావత్ ఈశ్వరమ్మ- భర్త ఈదన్న. వారికి ముగ్గురు సంతానం. పది రోజుల కిందట భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో భార్య ఈశ్వరమ్మ పుట్టిల్లైన సుక్యాపూర్‌కు పోయి తలదాచుకుంది. అయితే, ఆమె భర్త ఈదన్న భార్య గురించి గ్రామంలో తెలిసిన వారిని అడిగాడు. జాడ తెలియకపోవడంతో ఈ విషయాన్ని తమ పొలాన్ని కౌలుకు చేస్తున్న బండి వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి చెప్పాడు. దాంతో వెంకటేశ్వర్లు, అతని భార్య శివమ్మ, తమ్ముడు శివ కలిసి ఈశ్వరమ్మ ఎక్కడుందో తెలుసుకున్నారు. సుక్యాపూర్ వెళ్లి ఆమెను తీసుకొచ్చారు. మార్గ మధ్యలోనే కొట్టి చిత్రహింసలు పెట్టారు. తర్వాత వెంకటేశ్వర్లు ఇంట్లో బంధించారు. కాళ్లు, చేతులు కట్టేసి పచ్చి మిర్చి కారాన్ని కండ్లల్లో, మర్మాంగాలపై పెట్టారు. బట్టలు ఊడదీసి ప్రయివేటు భాగాలపై డీజిల్ పోశారు. కట్టెకు బట్ట చుట్టి నిప్పంటించి తొడలు, మర్మాంగాలపై కాల్చారు. ఎంత రోధించినా వారు పట్టించుకోలేదు.

ఈశ్వరమ్మ భర్త అడ్డు వస్తే.. అతనిపై కర్రతో దాడి చేసి అక్కడి నుంచి తరిమివేశారు. తొడలు, వీపు వాచిపోయాయి. దాడి విషయం బయటికి పొక్కకుండా పది రోజులు ఇంట్లోనే నిర్బంధించారు. కనీసం చికిత్స కూడా చేయించలేదు. భర్త ఊళ్లో వారిని ఆరా తీసే క్రమంలో ఈ విషయం బయటపడింది. బుధవారం ప్రజా సంఘాలకు తెలిసి ఆందోళనకు పూనుకోగా, బాధితురాలిని కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అయితే, సదరు నిందితులు చెంచు దంపతుల భూమిని కౌలుకు చేసుకుంటూ వారిని తమ వద్ద పనికి పెట్టుకున్నారని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు బుధవారం సాయంత్రం గ్రామానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఆర్.శ్రీనివాసులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

చెంచు మహిళపై దాడి అమానుషం. మహిళను వివస్త్రను చేసి డీజిల్ పోసి కాల్చడం అమానవీయం. ఈ దాడి సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. పోలీసులు వెంటనే నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

విచారణ చేస్తున్నాం.. దోషులను శిక్షిస్తాం : బుర్రి శ్రీనివాసులు- డీఎస్పీ, కొల్లాపూర్

మొలచింతలపల్లి గ్రామంలో జరిగిన అమానవీయ ఘటన పట్ల చింతిస్తున్నాం. ఇందుకు

విద్యావ్యవస్థ భ్రష్టు పట్టింది

న్యూఢిల్లీ: దేశంలో విద్యావ్యవస్థను బీజేపీ, ఆర్ఎస్ఎస్ భ్రష్టు పట్టించాయని రాహుల్ గాంధీ మోడీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. విద్యాసంస్థలను ఆ రెండూ హైజాక్ చేశాయని అన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గాంధీ పలు అంశాలను ప్రస్తావించారు. "భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా... దేశంలో నాన్‌స్టాప్ పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని చాలా మంది విద్యార్థులు ఫిర్యాదు చేశారు. మీ అందరికీ తెలిసినట్టుగా నీట్, యూజీసీ నెట్..2024 లీక్ అయ్యాయి. అందులో ఒకదాన్ని మాత్రమే కేంద్రం రద్దు చేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మోడీ జీ ఆపారని చెబుతున్నారు. అది నిజమా కాదా అన్నది అలా ఉంచితే... దేశంలో పేపర్ లీకేజీలను మాత్రం మోడీ ఆపలేకపోతున్నారు" అని రాహుల్ ఘాటుగా విమర్శించారు. పదేండ్ల మోడీ పాలనలో ఉపాధి కరువైంది. ఉద్యోగాల్లేవు. పోటీ పరీక్షలు ఇలా లీకులతో రద్దవుతుంటే.. ఓడిపోయేది విద్యార్థులేనని ఆందోళన వ్యక్తం చేశారు. నెలలు, ఏండ్లపాటు ప్రిపేరై పరీక్ష రాస్తే.. భావితరాల భవిష్యత్తుతో ఈ ప్రభుత్వం ఆడుకుంటోందని అన్నారు. "మధ్యప్రదేశ్‌లో వ్యాపం స్కాం జరిగింది. ఇపుడు దేశమంతా లీకులు విస్తరించాయి. విద్యాసంస్థల హైజాకింగ్ జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ చేతుల్లో విద్యావ్యవస్థ బందీ అయ్యింది. విద్య కాషాయికరణను మోడీ జీ మరింత సులభతరం చేశారు. అవకతవకలపై విచారణ కొనసాగుతోంది. ఇపుడు ఒక పరీక్షను రద్దు చేశారు. మరొకటి రద్దు చేస్తారో లేదో తెలియదు" అని రాహుల్ గాంధీ అన్నారు. లీకులు, రద్దుకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతారా..? అని అడిగిన ప్రశ్నకు, "అవును, మేం దీన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తాం " అని గాంధీ చెప్పారు.

కేజ్రీవాల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

నిలిపివేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తోసిపుచ్చింది. బెయిల్ పిటిషన్‌కు సంబంధించి గురువారం ఉదయానికి తీర్పు రిజర్వ్ చేసిన రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి నియాయ్ బిందు.. అదేరోజు సాయంత్రం బెయిల్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ బెయిల్ బాండ్‌పై సంతకం చేసేందుకు వీలుగా 48 గంటలపాటు స్టే విధించాలని ఈడీ న్యాయస్థానాన్ని కోరింది. తద్వారా ఈ తీర్పును పై కోర్టులో సవాలు చేసేందుకు వీలు కలుగుతుందని విజ్ఞప్తి చేసింది. కానీ వీరి వాదనను కోర్టు నిరాకరించింది. ఈ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

సత్యమేవ జయతే.. అతిషీ

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరుపై ఆప్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ క్యాంప్‌లో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిశీ సత్యమే గెలిచిందన్నారు. సత్యానికి కొన్నిసార్లు ఇబ్బందులు రావొచ్చేమో గానీ.. ఓటమి మాత్రం ఉండదని తెలిపారు.

24 గంటల్లో 17 మంది మృతి

న్యూఢిల్లీ : ఢిల్లీలో అధిక ఉష్ణోగ్రతలు ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. వడగాల్పులకు గత 24 గంటల్లో 17 మంది మృతి చెందినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. అలాగే వడదెబ్బ తగిలి ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోందని చెప్పారు. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో వడదెబ్బ సంబంధిత సమస్యలతో 33 మంది చేరినట్లు అధికారులు తెలిపారు. వీరిలో గత 24 గంటల్లో 13 మంది మరణించినట్లు తెలిపారు. అలాగే రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో 22 మంది చేరారు. వీరిలో గత 24 గంటల్లో నలుగురు మరణించారు. మిగిలిన ఆసుపత్రుల్లో కూడా వడదెబ్బ బాధితులు గణనీయంగా చేరుతున్నారని అధికారులు తెలిపారు. ఢిల్లీతో పాటు ఉత్తర భారతంలో అనేక ప్రాంతాల్లో గత కొన్ని రోజుల నుంచి వేడి గాలులు వీస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఢిల్లీలో గురువారం ఉదయం వర్షం కురియడంతో కాస్త ఉపశమనం లభించింది.

సూర్య ప్రతాపం

ఐసీసీ టీ20 ప్రపంచకప్ సూపర్8 రేసును టీమ్ ఇండియా ఆశాజనకంగా ఆరంభించింది. మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్ (53) అర్థ సెంచరీతో చెలరేగగా.. ధనాధన్ హిట్టర్లు రిషబ్ పంత్, హార్దిక్ పాండ్య విలువైన ఇన్నింగ్స్‌లు నమోదు చేశారు. స్టార్ బ్యాటర్లు రోహిత్, కోహ్లి నిరాశపరిచినా అఫ్గనిస్థాన్‌తో మ్యాచ్‌లో భారత్ తొలుత 181/8 పరుగుల మంచి స్కోరు సాధించింది.

- అర్థ సెంచరీతో చెలరేగిన సూర్య
- రాణించిన హార్దిక్ పాండ్య, రిషబ్ పంత్
- ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్

అఫ్గాన్‌తో మ్యాచ్‌లో భారత్ 181/8

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్





పొట్టి ఫార్మాట్ సూపర్‌స్టార్ సూర్యకుమార్ యాదవ్ (53, 28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీతో చెలరేగాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్ సహజశైలికి కాస్త భిన్నంగా ఆడినా అర్థ సెంచరీతో టీమ్ ఇండియాను ఆదుకున్నాడు. వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య (32, 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహా రిషబ్ పంత్ (20, 11 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు. సూర్యకుమార్ యాదవ్‌కు తోడు హార్దిక్, పంత్‌లు మెరవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 181 పరుగులు చేసింది. అఫ్గనిస్థాన్ పేసర్ ఫజల్‌హాక్ ఫరూకీ (3/33), రషీద్ ఖాన్ (3/26) మూడు వికెట్లు పడగొట్టి ఆ జట్టును సైతం మ్యాచ్ రేసులో నిలిపారు!.

ఆ ఇద్దరు విఫలం : సూపర్8 మ్యాచ్‌లో టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు కాస్త కష్టంగా సాగిన పిచ్‌పై భారత ఓపెనర్లు, సీనియర్ క్రికెటర్లు రోహిత్ శర్మ (8), విరాట్ కోహ్లి (24) విఫలమయ్యారు. పవర్‌ప్లేలోనే కెప్టెన్ రోహిత్ శర్మ నిష్క్రమించగా.. జట్టుకు అతడి అవసరం ఎక్కువగా ఉన్న తరుణంలో విరాట్ కోహ్లి నిరాశపరిచాడు. అఫ్గాన్ పేసర్ ఫరూకీ మరోసారి బ్రేక్ అందించాడు. పవర్‌ప్లేలో వికెట్‌తో అఫ్గాన్‌కు పైచేయి అందించాడు. పవర్‌ప్లేలో ఓ వికెట్ కోల్పోయిన భారత్ 47 పరుగులు చేసింది. రిషబ్ పంత్ (20, 11 బంతుల్లో 4 ఫోర్లు) పవర్‌ప్లేలో భారత్ గౌరవప్రద స్కోరు అందుకుంది. విలక్షణ షాట్లతో మెరిసిన రిషబ్ పంత్ యుఎస్‌ఏ లెగ్ ఫామ్ కొనసాగించాడు. కానీ పవర్‌ప్లే అనంతరం రషీద్‌ఖాన్‌పై స్విచ్ షాట్ ఆడబోయి వికెట్ల ముందు దొరికిపోయాడు. విరాట్ కోహ్లి సైతం రషీద్ ఖాన్ ఓవర్లోనే వికెట్ పారేసుకున్నాడు. దీంతో 62/3తో భారత్ కష్టాల్లో పడింది.

ఆదుకున్న సూర్యకుమార్ : లేటుగా ఫామ్ అందుకున్న సూర్యకుమార్ (53) అఫ్గనిస్థాన్‌పై ఆపద్బాంధవుడి ఇన్నింగ్స్ నమోదు చేశాడు. ఓ ఎండ్‌లో సహచర బ్యాటర్లు తడబాటుకు గురవుతున్న వేళ సూర్యకుమార్ యాదవ్ తనదైన శైలిలో పరుగులు పిండుకున్నాడు. ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లు బాదిన సూర్యకుమార్ యాదవ్ 27 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. యువ బ్యాటర్ శివం దూబె (10) దూకుడు చూపించినా వికెట్ నిలుపుకోలేదు. ఓ ఎండ్‌లో సూర్యకుమార్ దంచికొట్టగా.. మరోఎండ్ నుంచి వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య (32) మెప్పించాడు. విలువైన ఇన్నింగ్స్‌తో జట్టుకు మంచి స్కోరు అందించటంలో ముఖ్య భూమిక పోషించాడు. ఆఖర్లో రవీంద్ర జడేజా (7) ఆశించిన ప్రదర్శన చేయలేదు. అక్షర్ పటేల్ (12, 6 బంతుల్లో 2 ఫోర్లు) ఆకట్టుకున్నాడు. అఫ్గాన్ బౌలర్లలో ఫజల్‌హాక్ ఫరూకీ, రషీద్ ఖాన్ మూడేసి వికెట్లతో విజృంభించారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) రషీద్ ఖాన్ (బి) ఫరూకీ 8, విరాట్ కోహ్లి (సి) మహ్మద్ నబి (బి) రషీద్ ఖాన్ 24, రిషబ్ పంత్ (ఎల్బీ) రషీద్ ఖాన్ 20, సూర్యకుమార్ యాదవ్ (సి) మహ్మద్ నబి (బి) ఫరూకీ 53, శివం దూబె (ఎల్బీ) రషీద్ ఖాన్ 10, హార్దిక్ పాండ్య (సి)అజ్మతుల్లా (బి) నవీన్ ఉల్ హాక్ 32, రవీంద్ర జడేజా (సి) గుల్బాదిన్ (బి) ఫరూకీ 7, అక్షర్ పటేల్ (రనౌట్) 12, అర్షదీప్ సింగ్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 13, **మొత్తం :** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 181.


వికెట్ల పతనం : 1-11, 2-54, 3-62, 4-90, 5-150, 6-159, 7-165, 8-181.

బౌలింగ్ : ఫజల్‌హాక్ ఫరూకీ 4-0-33-3, మహ్మద్ నబి 3-0-24-0, నవీన్ ఉల్ హాక్ 4-0-40-1, రషీద్ ఖాన్ 4-0-26-3, నూర్ అహ్మద్ 3-0-30-0, అజ్మతుల్లా ఓమర్‌జాయ్ 2-0-23-0.

సాల్ట్ చితకొట్టాడు

డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ దుమ్మురేపింది. గ్రూప్ దశలో అనూహ్య పరిస్థితులు ఎదుర్కొన్న ఇంగ్లాండ్ సూపర్8లో సూపర్ షో చేసింది. ఆతిథ్య వెస్టిండీస్‌ను చిత్తు చేసి సెమీఫైనల్ బెర్త్ దిశగా ఓ అడుగు ముందుకేసింది. ఫిల్ సాల్ట్ (87 నాటౌట్) ఛేదనలో అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. సాల్ట్ మెరుపులతో ఇంగ్లాండ్ అలవోక విజయం సాధించింది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన కరీబియన్లకు సూపర్8లో తొలి ఓటమి ఎదురైంది.

- ఛేదనలో ఫిల్ సాల్ట్ అజేయ అర్థ సెంచరీ
- విండీస్‌పై ఇంగ్లాండ్ ఘన విజయం
- వెస్టిండీస్ 180/4, ఇంగ్లాండ్ 181/2



నవతెలంగాణ-గ్రాస్‌ఐలెట్

సూపర్8లో డిఫెండింగ్ చాంపియన్ మొదలెట్టింది. ఆతిథ్య వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో మెరుపు విజయం సాధించింది. 181 పరుగుల లక్ష్యాన్ని మరో 15 బంతులు మిగిలి ఉండగానే ఛేదించిన ఇంగ్లాండ్..సూపర్8లో తొలి విజయం ఖాతాలో వేసుకుంది. ఇంగ్లాండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ (87 నాటౌట్, 47 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగగా.. జానీ బెయిర్‌స్టో (48 నాటౌట్, 26 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 180 పరుగులు చేసింది. జాన్సన్ ఛార్లెస్ (38, 34 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (36, 32 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), రోవ్‌మాన్ పావెల్ (36, 17 బంతుల్లో 5 సిక్స్‌లు) సమిష్టిగా రాణించారు. ఛేదనలో అజేయ అర్థ సెంచరీ సాధించిన ఫిల్ సాల్ట్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

సాల్ట్ ధనాధన్ : 181 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ అదరగొట్టింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (87 నాటౌట్) సూపర్ ఫామ్ కొనసాగించాడు. కెప్టెన్ జోశ్ బట్లర్ (25)తో కలిసి అర్థ సెంచరీ భాగస్వామ్యం నమోదు చేసిన ఫిల్ సాల్ట్ అదే జోరు ఆఖరు వరకు చూపించాడు. జోశ్ బట్లర్ రెండు ఫోర్లతో మెరిసినా.. వికెట్ నిలుపుకోలేదు. పవర్‌ప్లే అనంతరం బట్లర్ అవుటయ్యాడు. మోయిన్ అలీ (13) సైతం అంచనాలను అందుకోలేదు. ఈ దశలో జానీ బెయిర్‌స్టో (48 నాటౌట్) ఫిల్ సాల్ట్‌తో జత కలిశాడు. బెయిర్‌స్టో, సాల్ట్ జోడీ కరీబియన్ బౌలర్లను ఆటాడుకున్నారు. సాల్ట్ 38 బంతుల్లోనే నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో అర్థ సెంచరీ సాధించాడు. హాఫ్ సెంచరీ అనంతరం సాల్ట్ టాప్ గేర్‌లోకి వెళ్లాడు. మరో మూడు సిక్సర్లు, మూడు ఫోర్లతో ధనాధన్ మోత మోగించాడు. మరో ఎండ్‌లో ప్రమాదకర హిట్టర్ బెయిర్‌స్టో సైతం ఏమాత్రం తగ్గలేదు. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 బంతుల్లోనే అజేయంగా 48 పరుగులు సాధించాడు. ఫిల్ సాల్ట్, బెయిర్‌స్టో జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 97 పరుగులు జోడించారు. దీంతో 17.3 ఓవర్లలోనే ఇంగ్లాండ్ లాంఛనం ముగించింది. 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వెస్టిండీస్ బౌలర్లలో రోమారియో షెఫర్డ్, రోస్టన్ ఛేజ్‌లు చెరో వికెట్ పడగొట్టారు.

సమిష్టిగా కొట్టారు : తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ సొంతగడ్డపై ఆశించిన స్కోరు చేయలేదు. 20 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయినా 180 పరుగులే చేయగల్గింది. ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసి కరీబియన్ హిట్టర్లను కట్టడి చేశారు. స్పిన్నర్ ఆదిల్ రషీద్ (1/21), పేసర్ జోఫ్రా ఆర్చర్ (1/34), మోయిన్ అలీ (1/15) రాణించారు. విండీస్ ఓపెనర్ బ్రాండన్ కింగ్ (23, 13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఆరంభం అందించాడు. కానీ రిటైర్డ్‌హర్ట్‌గా నిష్క్రమించాడు. మరో ఓపెనర్ జాన్సన్ చార్లెస్ (38, 34 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువసేపు క్రీజులో నిలిచినా దూకుడు చూపించలేకపోయాడు. మిడిల్ ఆర్డర్‌లో నికోలస్ పూరన్ (36), రోవ్‌మాన్ పావెల్ (36) సహా రూథర్‌ఫోర్డ్ (28 నాటౌట్) విలువైన ఇన్నింగ్స్‌లు నమోదు చేశారు.

భారత్, బంగ్లా పోరు..ఉప్పల్ స్టేడియంలో!

టీ20 మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న హైదరాబాద్
బీసీసీఐ స్వదేశీ సీజన్ షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగు క్రికెట్ అభిమానులకు మరో తీపి కబురు. టెస్టు మ్యాచ్, ఐపీఎల్ వినోదం ఆస్వాదించిన క్రికెట్ ప్రియులు ఈ ఏడాది మరో ధనాధన్ ధమాకా అందుకోనున్నారు!. భారత్, బంగ్లాదేశ్ టీ20 మ్యాచ్‌కు హైదరాబాద్ ఉప్పల్ క్రికెట్ స్టేడియం వేదిక కానుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం 2024-25 స్వదేశీ సీజన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారత స్వదేశీ సీజన్ ఆరంభం కానుంది. భారత పర్యటనకు రానున్న బంగ్లాదేశ్ ఇక్కడ రెండు టెస్టులు, మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. భారత్, బంగ్లాదేశ్ టెస్టులకు చెన్నై, కాన్పూర్ వేదిక కానున్నాయి. సెప్టెంబర్ 19-23 వరకు చెన్నై టెస్టు, సెప్టెంబర్ 27-అక్టోబర్ 1 వరకు కాన్పూర్ టెస్టు జరుగనున్నాయి. టీ20 సిరీస్‌కు వరుసగా ధర్మశాల, న్యూఢిల్లీ, హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అక్టోబర్ 12న హైదరాబాద్‌లో భారత్, బంగ్లాదేశ్ చివరి టీ20 మ్యాచ్‌లో ఢీకొట్టనున్నాయి. ఇక అక్టోబర్‌లో భారత్‌కు రానున్న న్యూజిలాండ్ మూడు టెస్టుల సిరీస్‌లో ఆడనుంది. బెంగళూర్, పుణె, ముంబయి కివీస్‌తో మూడు టెస్టులకు వేదికలుగా నిలువనున్నాయి. 2025లో ఇంగ్లాండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఇక్కడ ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. చెన్నై, కోల్‌కత, రాజ్‌కోట్, పుణె, ముంబయిలు టీ20 సిరీస్‌లో ఐదు మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనుండగా.. మూడు వన్డేలకు వరుసగా నాగ్‌పూర్, కటక్, అహ్మదాబాద్‌లు వేదికగా నిలువనున్నాయి.

ర్యాంకింగ్స్‌పై భారత ఆర్చర్ల గురి

2024 పారిస్ ఒలింపిక్స్‌అర్హతపై దీమా



న్యూఢిల్లీ : ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 3 పోటీలలో భారత రికర్వ్ ఆర్చర్లు పతకాలు సాధించడంలో విఫలమైనా పారిస్ ఒలింపిక్ బెర్తులను దాదాపుగా ఖాయం చేసుకున్నారు. మహిళల విభాగంలో దీపికా కుమారి, భజన్, అంకితాతో కూడిన త్రయం.. సెమీస్‌లో 4-5తో ఫ్రాన్స్ చేతిలో ఓటమిపాలైంది. కాంస్య పోరులో జపాన్.. 6-0తో భారత్‌కు పరాభవం తప్పలేదు. ఇక ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్‌తో కూడిన పురుషుల జట్టు సైతం క్వార్టర్స్‌లో 1-5తో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. కాగా రికర్వ్ ఆర్చర్ల నిరాశపరిచినా ఈనెల 25న విడుదల కాబోయే ర్యాంకింగ్స్‌ను బట్టి పారిస్ బెర్తులు నిర్ధారణ అవుతాయి. కొత్త నిబంధనల ప్రకారం.. ఒలింపిక్ బెర్తులు ఖాయం కాని జట్లలో టాప్-2 టీమ్స్‌కు కోటా దక్కుతుంది. పురుషుల ర్యాంకింగ్స్‌లో భారత్ రెండో స్థానంలో ఉండగా మహిళల విభాగంలో 8వ స్థానంలో ఉంది. మహిళల కేటగిరీలో టాప్-7లో ఉన్న సౌత్ కొరియా, చైనా, జర్మనీ, ఫ్రాన్స్, మెక్సికో, యూఎస్‌ఏ, చైనీస్ తైపీ 'పారిస్'కు అర్హత సాధించగా మిగిలిన రెండు కోటాలలో భారత్‌కు అవకాశం దక్కనుంది.

భిన్న కథతో ది కానిస్టేబుల్

వరుణ్ సందేశ్ హీరోగా, ఆర్యన్ సుభాన్ ఎస్‌కె దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ నిర్మిస్తున్న చిత్రం 'ది కానిస్టేబుల్'. ఈ చిత్రంతో మధులిక వారణాసి హీరోయిన్‌గా పరిచయం కానున్నారు. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయ్యింది.

ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, "సినిమా షూటింగ్ అంతా చాలా హాయిగా సాగింది. కానిస్టేబుల్ పాత్రలో కొత్త కోణంలో, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను' అని చెప్పారు. "కథ, కథనాలు అద్భుతంగా అమరిన చిత్రమిది. పోలీస్ పాత్రలో వరుణ్ సందేశ్ ఆకట్టుకుంటారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి' అని నిర్మాత బలగం జగదీష్ అన్నారు.

హ్యాట్రిక్ సక్సెస్



దాదాపు 5 దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమకి, బసవ తారకం కేన్సర్ హాస్పిటల్ అధ్యక్షులుగా సేవలందిస్తూ, హిందూపురం నుంచి మూడసారి ఎం.ఎల్.ఏగా విజయం సాధించిన నందమూరి బాలకృష్ణని తెలుగు చలనచిత్ర నిర్మాత మండలి అధ్యక్షులు కె.ఎల్. దామోదర్ ప్రసాద్, కార్యదర్శి టి.ప్రసన్న కుమార్, ఈసీ మెంబర్ వి.వెంకటరమణ రెడ్డి (దిల్ రాజు), తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు, కార్యదర్శి కోశాధికారితోపాటు తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కె. అనుపమ్ రెడ్డి, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి తదితరులు పుష్పగుచ్చాలతో అభినందించారు.

ఏపీలో సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం..


ఇదిలా ఉంటే, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సమావేశం ఈనెల 26వ తేదీన విజయవాడలో జరుగనుంది. తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి చెందే దిశగా ఈ సమావేశం కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హెచ్‌ఆర్‌డి, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతున్నట్టు వాణిజ్య మండలి కార్యవర్గం తెలిపింది.

మాస్ ఎంటర్‌టైనర్


బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ పై రవి శంకర్, నవీన్ యెర్నేని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టీజీ విశ్వ ప్రసాద్ సంయుక్తంగా ఓ స్ట్రెయిట్ హిందీ సినిమాని నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కబోయే ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లో కోర్ టీమ్, ప్రత్యేక అతిథులతో గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది.






























Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886